www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 8-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 190 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: విదియ రా.2.23 తదుపరి తదియ, నక్షత్రం: అశ్విని రా.10.45 తదుపరి భరణి, వర్జ్యం: రా.7.12-8.37, దుర్ముహూర్తం: ఉ.11.39-12.26, అమృతఘడియలు: సా.4.21-5.47, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.10, సూర్యాస్తమయం: 5.54 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఫేస్ రికగ్నిషన్, ఫింగర్ ప్రింట్స్‌తోనూ

ఇక యూపీఐ చెల్లింపులు

నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చిన ఎన్‌పీసీఐ

పిన్ ఆధారిత చెల్లింపుల్లో పెద్దఎత్తున మోసాలు

చోటు చేసుకుంటున్న నేపథ్యంలో కొత్త విధానం

నూతన వినియోగదారులు, వృద్ధులకు సులువుగా యూపీఐ

2





పెట్రోల్ వాహనాల ధరలకు

సమానంగా ఈవీలు!

మరో 4-6 నెలల్లో అందుబాటులోకి..

శిలాజ ఇంధనాలతో ఆర్థికంగా పెను భారం

దేశ పురోగతికి కాలుష్యరహిత ఇంధనాలే కీలకం: నితిన్ గడ్కరీ

2

మోహన్‌బాబు వర్సిటీని

మూసేయండి!

ఆ బాధ్యతలు ఎస్వీయూకు అప్పగించండి

విద్యార్థుల నుంచి 26 కోట్లు అదనపు వసూలు.. సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులు

15 రోజుల్లో ఫీజులు తిరిగి చెల్లించాలి

ఏపీ ఉన్నత విద్యా కమిషన్ ఉత్తర్వులు

15 లక్షల జరిమానా చెల్లించిన వర్సిటీ

గుర్తింపు రద్దు, వసూళ్లపై హైకోర్టుకు..

14



14

'గ్రూప్-1'పై జోక్యం చేసుకోలేం

అభ్యంతరాలుంటే.. హైకోర్టుకే వెళ్లండి

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

నియామకాలపై స్టే ఇచ్చేందుకు నిరాకరణ

టీజీపీఎస్సీకి ఊరట.. అధికారుల హర్షం

బస్‌పై కొండచరియలు

హిమాచల్‌లో 18 మంది మృతి

2

బస్సులో 35 మంది ప్రయాణికులు

మృతుల సంఖ్య పెరిగే అవకాశం

ఇంటర్ విద్యార్థినిపై

హత్యాచారం

నల్లగొండ జిల్లా కేంద్రంలో దారుణం

పరిచయస్థుడే నిందితుడు

3

స్నేహితుడి గదికి తీసుకెళ్లి హత్యాచారం

నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసులు

దర్యాప్తు చేస్తున్న పోలీసులు

క్వాంటమ్ టెక్నాలజీపై పరిశోధనకు

భౌతికశాస్త్ర నోబెల్

జాన్ క్లార్క్, మైకేల్ హెచ్ డెవొరె, జాన్ ఎం మార్టినిస్‌కు సంయుక్తంగా ప్రకటించిన నోబెల్ కమిటీ

2

హైకోర్టులో బలమైన వాదన

వినిపిద్దాం

బీసీ రిజర్వేషన్లకు చేయాల్సిందంతా చేశాం

జీవో 9 నిలబడుతుందనే నమ్మకముంది

ప్రభుత్వం తరపున అభిషేక్ సింఘ్వీ వాదిస్తారు

విచారణను బీసీ మంత్రులు పర్యవేక్షించాలి

ఇంప్లీడ్ అయినవారు అందుబాటులో ఉండాలి

మంత్రులతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైకోర్టు తీర్పు తర్వాత మరోసారి భేటీకి నిర్ణయం

ధాన్యం కొనుగోలుపై మంత్రులతో సీఎం చర్చ

పొన్నం, అడ్లూరి వివాదంపై రేవంత్ ఆరా



బీసీ రిజర్వేషన్లపై చర్చిస్తున్న రేవంత్, భట్టి, మీనాక్షి, పొంగులేటి, పొన్నం, మహేశ్, ఉత్తమ్, వాకిటి

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే విషయంలో చట్టపరంగా చేయాల్సిందంతా పద్ధతి ప్రకారం చేశామని, దీనిపై హైకోర్టులో జరిగే విచారణలో బలమైన వాదనలు వినిపిద్దామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. న్యాయస్థానాల సూచనలకు అనుగుణంగా కులగణన సర్వే నిర్వహించి.. ఎంపిరికల్ డాటా ఆధారంగా బీసీలకు రిజర్వేషన్ కల్పించామన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో 9 న్యాయసమీక్షకు నిలుస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. హైకోర్టులో బుధవారం విచారణ జరుగుతున్న సందర్భంలో బీసీ మంత్రులంతా అక్కడే ఉండి పర్యవేక్షించాలని సూచించారు. జీవో 9ను కొట్టివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు బుధవారం విచారించనున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రిజర్వేషన్‌కు అనుకూలంగా

మిగతా 13వ పేజీలో...

హైకోర్టు వద్ద మోహరిద్దాం.. కాంగ్రెస్ బీసీ నేతల భేటీలో నిర్ణయం



స్థానికంపై నేడు స్పష్టత!

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు విచారణ

జీవో 9 సుప్రీం తీర్పుకు విరుద్ధమంటూ హైకోర్టులో పిటిషన్లు

జీవోకు అనుకూలంగా కూడా పలువురు ఇంప్లీడ్

13

చూపులన్నీ హైకోర్టు నిర్ణయం వైపే





మాటల మంటలు

మంత్రి పొన్నం వ్యాఖ్యలతో వివాదం

తీవ్రంగా స్పందించిన మంత్రి అడ్లూరి

తీరు మార్చుకోవాలని పొన్నం ప్రభాకర్‌కు హెచ్చరిక

సోనియా, రాహుల్, ఖర్గేకు ఫిర్యాదు చేస్తానన్న అడ్లూరి లక్ష్మణ్

దళిత సంఘాల ఫైర్.. పొన్నం వ్యాఖ్యలను తప్పుబట్టిన శ్రీధర్‌బాబు

తాను అడ్లూరిని ఉద్దేశించి మాట్లాడలేదని మరోసారి పొన్నం వివరణ

ఇద్దరు మంత్రులకు పీసీసీ చీఫ్ ఫోన్.. నేడు వారితో సమావేశం!

హైదరాబాద్/కరీంనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యల వివాదం.. చినికి చినికి గాలివానగా మారుతోంది. పొన్నం వ్యాఖ్యల పట్ల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తీవ్రంగా స్పందిస్తూ మంగళవారం వీడియో విడుదల చేశారు. ఇందులో పొన్నంతోపాటు మరో మంత్రి వివేక్ వెంకటస్వామి తీరునూ తప్పుబట్టారు. మరోవైపు పొన్నం ప్రభాకర్‌కు వ్యతిరేకంగా రాష్ట్రంలో పలుచోట్ల దళిత సంఘాల నేతలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో అప్రమత్తమైన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్.. ఇటు పొన్నం ప్రభాకర్‌కు, అటు అడ్లూరి లక్ష్మణ్‌కు ఫోన్ చేసి వివాదాన్ని పరిష్కరించే ప్రయత్నం చేశారు. తిరిగి బుధవారం ఈ ఇద్దరు మంత్రులతో తన నివాసంలో సమావేశం కానున్నారు. ఆదివారం (ఈ నెల 5న) జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్ సందర్భంగా.. పొన్నం చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మొదలైంది. ఆయనతోపాటు మంత్రులు వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్న ఈ ప్రెస్‌మీట్ సందర్భంగా పొన్నం ప్రభాకర్ నోటి నుంచి వచ్చిన వ్యాఖ్యలు మంత్రి అడ్లూరిని.. బాడీ షేమింగ్ చేసేలా ఉన్నాయంటూ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ అదే రోజు

మిగతా 14వ పేజీలో...



కనీస పింఛన్ రూ.2500!

11 ఏళ్ల తర్వాత పెంపు దిశగా సంకేతాలు

10న ఈపీఎఫ్‌వో ట్రస్టీల భేటీలో నిర్ణయం!

7,500 చేయాలంటున్న ఉద్యోగ సంఘాలు

10 ఏళ్ల రెగ్యులర్ సర్వీసు, 58 ఏళ్లు పూర్తి చేసుకున్న వారు పింఛన్‌కు అర్హులు

న్యూఢిల్లీ, అక్టోబరు 7: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) త్వరలోనే ఈపీఎఫ్ చందాదారులకు శుభవార్త చెప్పనున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. 11 ఏళ్ల సుదీర్ఘ వేచిచూపుల అనంతరం పింఛను మొత్తాన్ని పెంచే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం ఉద్యోగుల పింఛను పథకం (ఈపీఎస్-95) కింద నెలవారీ రూ.1000 పింఛన్ ఇస్తున్నారు. ఈ మొత్తాన్ని 2014లో

మిగతా 2వ పేజీలో...

గ్రూప్-1 అధికారుల చేతికి

ఆస్పత్రుల పాలన!

బోధనాస్పత్రుల్లో వైద్యేతర బాధ్యతల పర్యవేక్షణ

ప్రయోగాత్మక అమలు.. ప్రభుత్వం ప్రాథమిక నిర్ణయం

కొత్తగా నియమితులైన వారిలో వైద్యశాఖకు 20 మంది.. సూపరింటెండెంట్లకు తగ్గనున్న పని భారం



హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యేతర పాలన బాధ్యతలను గ్రూప్-1 అధికారులకు అప్పగించాలని సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించింది. సర్కారీ దవాఖానాల్లో వైద్య, వైద్యయేతర పాలనా వ్యవహారాలన్నింటిని ప్రస్తుతం సూపరింటెండెంట్లే పర్యవేక్షిస్తున్నారు. దీంతో వారిపై పని భారం అధికంగా ఉంటోంది. పాలన వ్యవహారాలపై అనుభవం లేని సూపరింటెండెంట్లు తీసుకుంటున్న నిర్ణయాలతో ఆస్పత్రుల్లో అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థ గాడి తప్పుతోంది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కొత్తగా నియమితులైన గ్రూప్-1 అధికారులకు

మిగతా 10వ పేజీలో...



జూబ్లీహిల్స్ రేసులో

నవీన్ యాదవ్ ముందంజ!

తాను పోటీలో లేనన్న బొంతు రామ్మోహన్

నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, అంజన్ పేర్లతో అధిష్ఠానానికి టీపీసీసీ ప్రతిపాదన

నేడో రేపో అభ్యర్థిని ప్రకటించే అవకాశం

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రేసులో నవీన్ యాదవ్ ముందంజలో ఉన్నారా? కాంగ్రెస్ టికెట్ ఆయనకే దక్కనుందా? అంటే పార్టీ వర్గాలు అవుననే అంటున్నాయి. ఈ ఉప ఎన్నికకు అభ్యర్థి ఎంపిక కోసం టీపీసీసీ ముగ్గురి పేర్లను అధిష్ఠానానికి పంపింది. మంగళవారం జూమ్ ద్వారా భేటీ అయిన సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌లు ఇన్‌చార్జి మంత్రులు సూచించిన పేర్లపై సమీక్షించారు. నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్ పేర్లను అధిష్ఠానానికి

మిగతా 13వ పేజీలో...

నవీన్ యాదవ్‌పై కేసు.. ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్

జూబ్లీహిల్స్‌లో పోటీకి మజ్లిస్, టీడీపీ దూరం

13

ఆ రేటు హైరైజులకే చెల్లు!



ఎకరం రూ.177 కోట్లంటే గజం 3.75 లక్షలు

పక్కనే ఉన్నా.. చిన్న ప్లాట్లకు ఆ రేటు రాదు

వేలం ధరలో 50-60 శాతం పలికితే గొప్పే

45-50 అంతస్తులకు 5 లక్షల చదరపు అడుగులు

చదరపు గజంలోనే 100 ఎస్ఎఫ్‌టీ నిర్మాణం

1000 గజాల ప్లాటుకు గజానికి 24 ఎస్ఎఫ్‌టీనే

నాలుగింతల నిర్మాణం కాబట్టే ధర డబుల్

రాయదుర్గంలో ఎకరం రూ. 177 కోట్లు పలికిన నేపథ్యంలో స్థిరాస్తి వర్గాల్లో చర్చ

11



ఢిల్లీలో మీడియాతో కేంద్ర మంత్రులు గిరిరాజ్‌సింగ్, కిషన్‌రెడ్డి

చివరి కిలో వరకూ

పత్తి కొంటాం

రైతులకు కేంద్రం అండగా ఉంటుంది

పత్తి కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదు: గిరిరాజ్‌సింగ్

పత్తిని తక్కువకు అమ్మొద్దు: కిషన్‌రెడ్డి

గిరిజన భాషల్లోనూ బోధన అవసరం: ధర్మేంద్ర ప్రధాన్

సమ్మక్క- సారక్క గిరిజన వర్సిటీ లోగో ఆవిష్కరణ

న్యూఢిల్లీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని.. ఈ ఏడాది రాష్ట్రంలో పండిన పత్తి చివరి కిలో వరకు కూడా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా కొనుగోలు చేస్తామని కేంద్ర జౌళి మంత్రి గిరిరాజ్‌సింగ్ చెప్పారు. పత్తిని కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నా

మిగతా 11వ పేజీలో...



పాదచారుల భద్రతపై

నిబంధనలు రూపొందించండి

2

రాష్ట్రాలకు సుప్రీం ఆదేశం

భారత విద్యార్థులకు అమెరికా

మొండిచెయ్యి!

గతేడాదితో పోలిస్తే వీసాల్లో 44.5% తగ్గుదల

2

ఫ్రాన్స్‌కు వెళ్లే భారతీయ విద్యార్థుల్లో 17% పెరుగుదల

కన్ఫర్మ్ టికెట్లలో ప్రయాణ

తేదీ మార్చుకోవచ్చు

రైల్వే శాఖ ప్రకటన

11

వారి వివరాలు ఇవ్వండి



బిహార్ తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 3.66 లక్షల మంది పేర్లను రేపట్లోగా ఇవ్వండి

చేర్చిన పేర్లు గతంలో తొలగించినవా.. కొత్తవా?

ఆ వివరాలు వెల్లడించి గందరగోళం తొలగించండి

ఎన్నికల కమిషన్‌కు సుప్రీం కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, అక్టోబరు 7: బిహార్ తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 3.66 లక్షల మంది ఓటర్ల వివరాలను గురువారంలోగా ఇవ్వాలని సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ముసాయిదా జాబితాతో పోలిస్తే తుది జాబితాలో ఓటర్ల సంఖ్య పెరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. అందులో చేర్చిన పేర్లు గతంలో తొలగించినవా లేక కొత్త ఓటర్లవా అని ప్రశ్నించింది. ఈ విషయంలో

మిగతా 2వ పేజీలో...

భారత విద్యార్థులకు అమెరికా మొండిచెయ్యి!

- గత ఏడాది కంటే 44.5% తక్కువ వీసాలు జారీ
- ఫ్రాన్స్ వెళ్లే భారత విద్యార్థుల్లో 17% పెరుగుదల

న్యూఢిల్లీ, అక్టోబరు 7: విదేశీ విద్యార్థులకు అమెరికా జారీ చేసే వీసాలు భారీగా తగ్గుముఖం పట్టాయి. ఈ ఏడాది ఆగస్టులో అమెరికా దాదాపు ఐదో వంతు తక్కువ విద్యార్థి వీసాలను జారీ చేసిందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీని ప్రభావంతో అక్కడికెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. సాధారణంగా అమెరికాలో యూనివర్సిటీలు ఆగస్టులో ప్రారంభమవుతాయి. ఈ నెలకు గాను ట్రంప్ యంత్రాంగం 3,13,138 విద్యార్థి వీసాలను జారీ చేసింది. 2024 ఆగస్టుతో పోలిస్తే ఇది 19.1% తక్కువని ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ పేర్కొంది. గత ఏడాది అమెరికాకు వెళ్లిన విదేశీ విద్యార్థుల్లో భారత్ టాప్‌లో నిలిచింది. గత ఆగస్టుతో పోలిస్తే భారతీయులకు ఈసారి ఏకంగా 44.5% తక్కువ వీసాలు జారీ చేయడంతో మన దేశ విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. భారతీయ విద్యార్థులకు జారీ చేసిన వీసాల కంటే రెట్టింపు సంఖ్యలో చైనీయులకు 86,647 వీసాలు జారీ అయ్యాయి. మరోవైపు ఇరాన్ నుంచి కూడా ప్రవేశాలు 86% తగ్గాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలతో ఉన్నత విద్య కోసం ఆ దేశానికి వెళ్లాలని భావిస్తున్న భారతీయ విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. వందలాది మంది విద్యార్థుల వీసాలు రద్దు చేయడం, వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను నిలిపివేయడం, ఆంక్షలు, అరెస్టులు, సోషల్ మీడియా వెట్టింగ్, హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును పెంచడం వంటి చర్యలతో వీరంతా ఆందోళన చెందుతున్నారు.

ఢిల్లీలో 'చూజ్ ఫ్రాన్స్ టూర్-2025'

2024-25 సంవత్సరానికి గాను ఫ్రాన్స్‌కు వెళ్లే భారతీయ విద్యార్థులు 17% పెరిగారు. 2030 నాటికి వీరి సంఖ్యను 30వేలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఫ్రాన్స్ రాయబార కార్యాలయం తెలిపింది. తమ దేశంలో ఉన్నత విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలకు అవగాహన కల్పించేందుకు 'చూజ్ ఫ్రాన్స్ టూర్-2025' పేరిట మంగళవారం ఢిల్లీలో కార్యక్రమం నిర్వహించింది. అక్టోబరు 5న చెన్నైలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. 9న కోల్‌కతాలో, 11న ముంబైలో నిర్వహించనున్నారు. ఫ్రాన్స్‌లోని అగ్రశ్రేణి వర్సిటీలతో పాటు ఇంజనీరింగ్, బిజినెస్, ఆర్ట్స్ విభాగాల్లోని 50కి పైగా ప్రముఖ విద్యాసంస్థలు ఇందులో పాల్గొంటున్నాయి.

ఫేస్ రికగ్నిషన్.. ఫింగర్ ప్రింట్‌తోనూ ఇక యూపీఐ చెల్లింపులు

నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చిన ఎన్‌పీసీఐ

ముంబై, అక్టోబరు 7: యూపీఐ చెల్లింపుల ప్రక్రియ ఇకపై మరింత సురక్షితం, సులభతరం కానుంది. ఇప్పటిదాకా నాలుగు లేదా ఆరు అంకెల పిన్‌తో జరుపుతున్న యూపీఐ చెల్లింపులను ఇకపై ముఖ ధ్రువీకరణ (ఫేస్ రికగ్నిషన్), వేలిముద్రల (ఫింగర్ ప్రింట్స్)తో కూడా చేసే అవకాశాన్ని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కల్పిస్తోంది. మంగళవారం ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి ఎం.నాగరాజు ఈ నూతన విధానాన్ని ప్రారంభించారు. యూపీఐ చెల్లింపులకు ప్రస్తుతం ఉపయోగిస్తున్న పిన్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకొస్తున్న ఈ విధానం సురక్షితమైన, యూజర్ ఫ్రెండ్లీ విధానమని ఎన్‌పీసీఐ తెలిపింది. ప్రత్యేకించి యూపీఐ చెల్లింపుల విధానాన్ని వాడుతున్న కొత్త వినియోగదారులకు, వృద్ధులకు బయోమెట్రిక్ విధానం మరింత సులభతరమవుతుందని పేర్కొంది. వాస్తవానికి ప్రత్యామ్నాయ విధానం రూపొందించేందుకు మూడేళ్ల క్రితమే ప్ర యత్నాలు మొదలయ్యాయి. అయితే ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇచ్చిన ఆదేశాల మేరకు అత్యవసరంగా దీనిని అందుబాటులోకి తెచ్చారు. పిన్ ఆధారిత యూపీఐ చెల్లింపులతో దేశంలో పెద్ద ఎత్తున మోసాలు జరుగుతుండడంతో పిన్, ఓటీపీలకు ప్రత్యామ్నాయ విధానాన్ని తీసుకురావాలని ఆర్‌బీఐ అన్ని ఆర్థిక సంస్థలకు సూచించింది.



దుర్భేధ్యంగా సుప్రీంకోర్టు!

- 700 మంది భద్రతా సిబ్బంది
- సీజేఐకి జడ్ ప్లస్ కేటగిరీ భద్రత

అయినా.. సీజేఐపై దాడి యత్నం



న్యూఢిల్లీ, అక్టోబరు 7: దేశ సర్వోన్నత న్యాయస్థానం.. సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్‌పైకి సోమవారం ఓ న్యాయవాది బూటు విసిరే ప్రయత్నం చేయడం.. భద్రతా సిబ్బంది హుటాహుటిన స్పందించి నిలువరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు భద్రత, సీజేఐ సహా న్యాయమూర్తులకు కల్పిస్తున్న భద్రత వంటివి చర్చకు వచ్చాయి. దీనిపై స్పందించిన అధికారులు సుప్రీంకోర్టు.. అత్యంత దుర్భేధ్యమని వెల్లడించారు. 700 మంది భద్రతా సిబ్బంది నిరంతరం కంటికి రెప్పలా కాపాడుతున్నారని తెలిపారు. ప్రతి కోర్టురూమ్‌కు ప్రత్యేకంగా సాయుధ గార్డు ఉంటారని, ముఖ్యంగా జడ్ ప్లస్ కేటగిరీ భద్రతలో ఉన్న సీజేఐకి మరింత అదనపు భద్రత ఉంటుందని వివరించారు. ఢిల్లీ పోలీసులు సహా కేంద్ర భద్రతా ఏజెన్సీలకు చెందిన గార్డులు సుప్రీంకోర్టు ఆవరణలో భద్రతా విధులు నిర్వహిస్తారని తెలిపారు. న్యాయమూర్తులు, సిబ్బంది, అధికారులు సహా అందరి భద్రతను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. కాగా, సీజేఐపై బూటు విసరబోయిన న్యాయవాది రాకేశ్ కిశోర్ సుప్రీంకోర్టు లాయర్ కాదని, ఓ సీనియర్ అడ్వొకేట్ సాయంతో తాత్కాలిక పాస్‌ను సంపాయించుకుని కోర్టులోకి ప్రవేశించారని అధికారులు తెలిపారు.

ఏదైనా ఉంటే నా చెవిలో చెప్పండి: సీజేఐ

కోర్టులో కేసుల వాదనల సమయంలో న్యాయమూర్తులు చేసే మౌఖిక వ్యాఖ్యలపై జాగ్రత్తగా ఉండాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. మౌఖిక వ్యాఖ్యలకు ద్వంద్వార్థాలు తీసి.. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సహ న్యాయమూర్తి జస్టిస్ కె. వినోద్ చంద్రన్ ఓ కేసుపై వ్యాఖ్యలు చేసేందుకు ప్రయత్నించినప్పుడు.. ఆయనను నిలువరించారు. "ఏదైనా ఉంటే నా చెవిలో చెప్పండి. మౌఖిక వ్యాఖ్యలను వక్రీకరించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు" అని అన్నారు.

దేవుడే నాతో చేయించాడు!

- నేను నిమిత్త మాత్రుడిని
- సీజేఐపై బూటు విసిరేయత్నంపై

న్యాయవాది రాకేశ్ కిశోర్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, అక్టోబరు 7: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై కోర్టు రూమ్‌లో సోమవారం బూటు విసిరేసిన ఘటనపై(భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు.) న్యాయవాది రాకేశ్ కిశోర్ స్పందించారు. ఈ విషయంలో తనకు ఎలాంటి చింతా లేదని తెలిపారు. అంతేకాదు.. తన చర్యను సమర్థించుకున్నారు. "విష్ణు మూర్తి విగ్రహం' పిల్‌పై సీజేఐ చేసిన వ్యాఖ్యలతో నా మనసు గాయపడింది. 'వెళ్లు.. తలను పునరుద్ధరించమని ఆ విగ్రహాన్నే వేడుకో.' అని సీజేఐ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా బాధించాయి. ఇదొక్కటే కాదు. జల్లికట్టు, నూపుర్ శర్మ, ఉట్టి ఎత్తు(శ్రీకృష్ణ జన్మాష్టమి రోజు నిర్వహిస్తారు.)లపై దాఖలైన పిటిషన్లపై ఇచ్చిన ఆదేశాలు కూడా నన్ను మనోవేదనకు గురిచేశాయి. ఇతర మతాలకు సంబంధించిన పిటిషన్లపై మాత్రం కోర్టు భిన్నంగా స్పందిస్తోంది." అని రాకేశ్ వ్యాఖ్యానించారు. సనాతన ధర్మానికి సంబంధించిన పిటిషన్లలో పరిష్కారం చూపకపోయినా ఫర్వాలేదని, కానీ, అవహేళన మాత్రం చేయొద్దన్నారు. "తొలుత ఆయన సనాతనుడు. తర్వాత బౌద్ధంలోకి మారారు. ఇప్పుడు ఆయన దళిత బిడ్డనని చెప్పుకొంటారు. ఆయన దళితుడా?. ఇదీ వాళ్ల రాజకీయం" అని వ్యాఖ్యానించారు. "ఎట్టి పరిస్థితిలోనూ క్షమాపణలు చెప్పను. భగవంతుడే నాతో ఈ పనిచేయించాడు. ఆయనే (దేవుడు) నన్ను జైలుకు పంపించినా వెళ్తా. లేదా.. ఉరి వేయించినా భరిస్తా. అంతా ఆయన ఇష్టం" అని చెప్పారు.

పాదచారుల భద్రతకు నిబంధనలు రూపొందించండి: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పాదచారుల భద్రత, ఫుట్‌పాత్‌లు, రోడ్ డిజైన్ల కోసం మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 138 (1ఏ) కింద నిబంధనలు రూపొందించాలని సుప్రీంకోర్టు మంగళవారం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. ఆరు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. పాదచారుల క్రాసింగ్, కాలిబాటలకు సంబంధించి పలు కీలక ఆదేశాలు ఇచ్చింది. 2023నాటి రోడ్డు ప్రమాదాల నివేదికలో పేర్కొన్నట్టుగా 50 నగరాల్లోని ఫుట్‌పాత్‌ల ఆడిట్‌ను ప్రారంభించాలని ఆదేశించింది. ఇప్పటికే ఉన్న ఫుట్‌పాత్‌ల్లోని లోపాలను గుర్తించాలని, వెడల్పు, ఎత్తు ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని సూచించింది. రోడ్డు ప్రమాదాల సమస్యలపై కోయంబత్తూరుకు చెందిన డాక్టర్ రాజశేఖరన్ దాఖలు చేసిన 'పిల్'పై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు ఇచ్చింది.

బస్సుపై విరిగిపడిన కొండచరియలు హిమాచల్‌లో 18 మంది మృతి

సిమ్లా, అక్టోబరు 7: హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో కొండచరియలు విరిగి ప్రైవేటు బస్సు మీద పడిన ప్రమాదంలో 18 మందికి పైగా ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. కేవలం ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు బాలూఘాట్ కొండల్లో ఈ సంఘటన జరిగింది. ప్రమాద సమయంలో 30-35 మంది బస్సులో ఉంటారని అంచనా. శిథిలాల నుంచి ఇప్పటివరకు 18 మృతదేహాలను వెలికితీశారు. సోమవారం నుంచి ఈ ప్రాంతం లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. కొండ మొత్తం కూలిపడటంతో బస్సు పూర్తిగా శిథిలాల్లో కూరుకుపోయింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రధాని మోదీ ఈ సంఘటన పట్ల తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మృతులకు 2 లక్షల పరిహారం ప్రకటించారు.

అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన దేవెగౌడ

బెంగళూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవెగౌడ అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చేరారు. చలి జ్వరంతో ఇబ్బంది పడుతున్న ఆయన్ను కుటుంబ సభ్యులు సోమవారం హెచ్ఏఎల్ రోడ్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు.

బిహార్‌లో సీటు పోరు!

కూటముల్లో పెద్దన్న పాత్ర కోసం పార్టీల పట్టు.. సీట్ల పంపకంపై విస్తృతంగా చర్చలు



పట్నా/న్యూఢిల్లీ, అక్టోబరు 7: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంది. షెడ్యూల్ వెలువడిన మరుసటి రోజు నుంచే సీట్ల పంపకాల రాజకీయం మొదలైంది. పెద్దన్న పాత్ర కోసం కూటముల్లోని పార్టీల్లో ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఎన్డీయే కూటమిలో ప్రధానమైన బీజేపీ, జేడీయూ సమాన సంఖ్యలో సీట్లలో పోటీచేయాలనే భావనకు వచ్చినట్టు తెలిసింది. మరోవైపు మహాఘట్‌బంధన్ కూటమిలో సీట్ల లెక్కతోపాటు సీఎం అభ్యర్థి అంశమూ సందిగ్ధత రేపుతోంది. ఇక చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జేపీ తాజాగా ఎన్డీయే కూటమిని వీడి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్‌కిషోర్ జన సురాజ్ పార్టీతో జట్టుకట్టవచ్చనే ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే బిహార్ ఎన్నికలు మూడు కూటముల ముక్కోణపోటీగా మారవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బీజేపీ, జేడీయూ.. సమానంగా సీట్లు!

బిహార్‌లో ఎన్డీయే కూటమిలో బీజేపీ, జేడీయూతోపాటు లోక్‌జనశక్తి (ఎల్‌జేపీ), హిందుస్థానీ అవామీ మోర్చా (హెచ్ఏఎం), రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ (ఆర్ఎల్ఎం) భాగస్వాములుగా ఉన్నాయి. ఇందులో బీజేపీ, జేడీయూతోపాటు చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జేపీ కూడా కీలకం. ప్రతిసారి కూటమిలో భాగంగా బీజేపీ కంటే జేడీయూ ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తూ వస్తోంది. అయితే ఈసారి కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు కేటాయించే సీట్లు పోగా.. మిగతా సీట్లలో ఇరు పార్టీలు సమానంగా పోటీచేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఎల్‌జేపీకి 25, హెచ్ఏఎంకు ఏడు, ఆర్ఎల్ఎంకు ఆరు సీట్లు ఇస్తామని బీజేపీ, జేడీయూ ప్రతిపాదించినట్టు సమాచారం. ఎల్‌జేపీ ఎక్కువ సీట్లు ఇవ్వాలని కోరుతోందని, అదే జరిగితే హెచ్ఏఎం, ఆర్ఎల్ఎంల సీట్లకు కోతపడవచ్చని.. వాటికి రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవులు ఆఫర్ చేయవచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ఎన్డీయే కూటమి మళ్లీ గెలిస్తే ముఖ్యమంత్రి మార్పు ఉండవచ్చని చర్చ కూడా జరుగుతోంది. నితీశ్‌కుమార్ కాకుండా బీజేపీ నేత సీఎం అయ్యే అవకాశాలూ ఉన్నాయని, అందులో భాగంగానే బీజేపీ, జేడీయూ సమానంగా సీట్లలో పోటీచేయాలనే నిర్ణయానికి వచ్చాయని కమలం వర్గాలు పేర్కొంటున్నాయి.

మహాఘట్‌బంధన్‌లో సీఎం గిరీకి పోటీ!

విపక్ష మహాఘట్‌బంధన్ కూటమిలో సీఎం అభ్యర్థి ఎవరనే అంశంతోపాటు సీట్ల పంపకాల విషయంలోనూ భేదాభిప్రాయాలు పొడసూపుతున్నాయి. కూటమి తరఫున తేజస్వియాదవ్ సీఎం అభ్యర్థి అని ఆర్జేడీ ధీమాగా ఉండగా, కాంగ్రెస్ ఇంకా దీనికి బహిరంగంగా అంగీకారమేదీ తెలపకపోవడంతో సందిగ్ధత నెలకొంది. దీనికితోడు మంగళవారం బిహార్ కాంగ్రెస్ నేత ఉదిత్‌రాజ్ చేసిన చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోశాయి. "తేజస్వి యాదవ్ ఆర్జేడీ వాళ్లకు సీఎం అభ్యర్థి కావొచ్చు. కానీ కూటమి తరఫున సీఎం అభ్యర్థి ఎవరనేది అంతా కలిసి నిర్ణయం తీసుకుంటారు" అని వ్యాఖ్యానించారు. మరోవైపు బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌కు దీటుగా నిలబడేది తేజస్వియాదవ్ మాత్రమేనని ఆర్జేడీ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ బహిరంగంగా ఆ పార్టీ తరఫున ఎవరూ దీనిపై స్పందించలేదు.

రాజకీయాల్లోకి మైథిలీ ఠాకూర్!



అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా శబరిపై పాట పాడి, ప్రధాని మోదీ ప్రశంసలు పొందిన జానపద గాయని మైథిలీ ఠాకూర్‌ను బీజేపీ బిహార్ ఎన్నికల బరిలోకి దింపనుంది. ఇటీవల ఆమె బిహార్ బీజేపీ ఇన్‌చార్జి వినోద్ తావ్డే, కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్‌లతో సమావేశమయ్యారు కూడా. దీనిపై మీడియా ఆమెను ప్రశ్నించగా.. ఎన్నికల్లో పోటీపై తుది నిర్ణయమేదీ రాలేదన్నారు. తన స్వస్థలం బిహార్‌లోని మధుబని జిల్లా బేణిపట్టికి వెళుతున్నానని.. ప్రజలను కలిసి, మాట్లాడాలని చెప్పారు.

ప్రశాంత్ కిషోర్‌తో చిరాగ్ పాశ్వాన్ జట్టు?

జన సురాజ్ పార్టీతో తెరపైకి వచ్చిన ప్రశాంత్‌కిషోర్‌తో చిరాగ్ పాశ్వాన్ ఎల్‌జేపీ జట్టు కట్టవచ్చనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో ఉన్న ఎల్‌జేపీ ఈసారి ఎక్కువ సీట్ల కోసం డిమాండ్ చేస్తోంది. 25 సీట్లు ఇస్తామని బీజేపీ ప్రతిపాదించగా.. 40కిపైనే ఇవ్వాలని కోరుతున్నట్టు సమాచారం. రాష్ట్రంలోని ప్రతినియోజకవర్గంలో 20,25 వేల ఓట్లను తాము ప్రభావితం చేయగలమని.. తాము బయటికి వెళ్తే కూటమికి ఇబ్బందులు తప్పవని చిరాగ్ పాశ్వాన్ ఇప్పటికే స్పష్టంచేశారని ఎల్‌జేపీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు సీట్ల లెక్కపై సయోధ్య కుదరలేదని.. ఎన్డీయే నుంచి ఎల్‌జేపీ బయటికి రావొచ్చని అంటున్నాయి. అదే జరిగితే ప్రశాంత్ కిషోర్‌తో చిరాగ్ జట్టుకట్టి కూటమిగా ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని పేర్కొంటున్నాయి.

పెట్రోల్ వాహనాల ధరలకు సమానంగా ఈవీలు!

- మరో 4-6 నెలల్లో అందుబాటులోకి..
- కేంద్ర రోడ్డు రవాణా మంత్రి గడ్కరీ



న్యూఢిల్లీ, అక్టోబరు 7: మరో నాలుగు నుంచి ఆరు నెలల్లో దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీల) ధరలు పెట్రోల్ వాహనాల ధరలకు సమానం అవుతాయని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. శిలాజ ఇంధనాలపై ఆధారపడటం దేశానికి ఆర్థికంగా పెను భారంగా మారుతోందని, ఏటా ఆ ఇంధనాల దిగుమతికి రూ.22 లక్షల కోట్ల వ్యయం అవుతోందన్నారు. పర్యావరణ పరంగానూ శిలాజ ఇంధనాలు తీవ్ర సమస్యగా మారాయని.. ఈ నేపథ్యంలో, దేశ పురోగతికి కాలుష్య రహిత ఇంధనాల వాడకం కీలకమని గడ్కరీ పేర్కొన్నారు. ఫిక్కీ 20వ ఉన్నతవిద్యా సదస్సులో ప్రసంగిస్తూ ఆయన ఈ అంశాలను ప్రస్తావించారు. వచ్చే ఐదేళ్లలో భారత ఆటోమొబైల్ రంగాన్ని ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా మలచటం మన లక్ష్యమని గడ్కరీ ఉద్ఘాటించారు. తాను కేంద్ర రోడ్డు రవాణా మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు రూ.14 లక్షల కోట్లుగా ఉన్న దేశ వాహన రంగం ప్రస్తుతం రూ.22 లక్షల కోట్లకు చేరిందని వెల్లడించారు. అమెరికా వాహనరంగం విలువ రూ.78 లక్షల కోట్లు కాగా, చైనా వాహనరంగం విలువ రూ.47 లక్షల కోట్లని తెలిపారు. మొక్కజొన్న నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేయటం ద్వారా రైతులు సగటున రూ.45 వేల చొప్పున అదనంగా సంపాదించుకున్నారని గడ్కరీ పేర్కొన్నారు. వేరు పరిచిన ఘన వ్యర్థాలను 2027 నాటికి రోడ్ల నిర్మాణంలో పూర్తిగా వినియోగించే పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. యువతే భారతదేశ ప్రధాన బలమని, వారికి తగిన నైపుణ్య శిక్షణ, విద్య అందిస్తే ప్రపంచంలో మనకు తిరుగు ఉండదని ఆయన చెప్పారు.

కనీస పింఛన్ రూ.2500!

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించారు. అయితే, దీన్ని రూ.7500కు పెంచాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గత 11ఏళ్లుగా ఎలాంటి మార్పు లేకుండా ఉన్న కనీస నెలవారీ పింఛన్‌ను పెంచే అంశంపై ఈపీఎఫ్‌వో చర్చలు జరుపుతోంది. నెలవారీ పింఛన్‌ను రూ.2500కు పెంచనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 10, 11 తేదీల్లో బెంగళూరులో జరగనున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల సమావేశంలో ఈ అంశంపై ప్రధానంగా చర్చించనున్నారు. ఇందులో పింఛను పెంపుతోపాటు సేవలను డిజిటలీకరణ చేసే ఈపీఎఫ్‌వో 3.0 విధానం, పరిపాలనా సంస్కరణలపైనా చర్చించనున్నట్లు సమాచారం. ఉద్యోగ సంఘాలు పింఛన్‌ను రూ.7500కు పెంచాలని డిమాండ్ చేస్తుండగా.. ఈపీఎఫ్‌వో రూ.2500 చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. బెంగళూరులో జరిగే కీలక సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. బోర్డు సమావేశంలో పింఛను పెంపుపై నిర్ణయం తీసుకుంటే, దానికి కేంద్రం ఆమోదం తెలపాల్సి ఉంటుంది. కనీసం పదేళ్ల పాటు రెగ్యులర్ సర్వీస్ పూర్తి చేసుకోవడంతో పాటు 58 ఏళ్లు నిండిన వారు ఈపీఎస్ కింద నెలవారీ పింఛనుకు అర్హులు.

వారి వివరాలు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

గందరగోళం నెలకొందని, దాన్ని తొలగించాలంటే కొత్తగా చేర్చిన పేర్లను వెల్లడించాలని కూడా స్పష్టం చేసింది. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం మంగళవారం విచారణను కొనసాగించింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ముఖ్యమని, ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది వివరాలను కూడా సంబంధిత కార్యాలయాల్లో ఓటర్లకు అందుబాటులో ఉంచాలని ఆదేశించిన విషయాన్ని గుర్తుచేసింది. కాగా, తుది జాబితాలో చేర్చిన పేర్లు చాలావరకు కొత్త ఓటర్లవేనని ఈసీ తరఫున న్యాయవాది రాకేశ్ ద్వివేది తెలిపారు. తొలగించిన ఓటర్ల నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు. ఎన్నికల కమిషన్ ఆగస్టు 1న బిహార్ ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించింది. ఎస్ఐఆర్ అనంతరం వివిధ కారణాలతో 65 లక్షల పేర్లను తొలగించామని, రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 7.24 కోట్లుగా పేర్కొంది. ఎస్ఐఆర్‌కు ముందు రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 7.89 కోట్లుగా ఉంది. ఓట్ల తొలగింపుపై ప్రతిపక్షాల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. తొలగించిన ఓటర్ల వివరాలను వెల్లడించాలని కోర్టు ఆదేశించింది. ఎన్నికల కమిషన్ సెప్టెంబరు 30న తుది జాబితాను ప్రకటించింది. ఇందులో 21.53 లక్షల పేర్లను చేర్చగా.. 3.66 లక్షల పేర్లను తొలగించింది. దాంతో ముసాయిదా జాబితాలో కంటే ఓటర్ల సంఖ్య 17.87 లక్షలు పెరిగి.. 7.42 కోట్లకు చేరింది.

ప్రభుత్వాధినేతగా పాతికేళ్లు!

మోదీ అరుదైన ఘనత




న్యూఢిల్లీ, అక్టోబరు 7: ప్రధాని నరేంద్ర మోదీ అరుదైన ఘనత సాధించారు. ప్రభుత్వాధినేతగా పాతికేళ్లుగా అప్రతిహతంగా కొనసాగుతున్నారు. 2001 అక్టోబరు 7న గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. 2014 మే 22 వరకు ఆ పదవిలో ఉన్నారు. అదే నెల 26న ప్రధానమంత్రిగా ప్రమాణం చేసిన మోదీ 11 ఏళ్లకుపైబడి ఆ పదవిలో కొనసాగుతున్నారు. ఈ చరిత్రాత్మక ఘట్టంపై మంగళవారం ఆయన స్పందించారు. ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు.. ఇంత గొప్పదేశం పురోగతిలో పాలుపంచుకోవడానికి నిరంతరాయంగా తాను కృషి చేస్తున్నానని 'ఎక్స్'లో వరుస ట్వీట్లు చేశారు. 2001లో ఇదే రోజు తొలిసారి గుజరాత్ సీఎంగా ప్రమాణం చేశాను. మొదట స్వరాష్ట్రంలో.. ఇప్పుడు దేశంలో మార్పులకు శ్రమిస్తున్నాను. సహచర భారతీయులు నిరాటంకంగా ఆశీర్వదిస్తున్నందుకు ధన్యవాదాలు. ప్రభుత్వాధినేతగా 25వ ఏట అడుగుపెడుతున్నాను. భారత ప్రజలకు కృతజ్ఞుడిని' అని పేర్కొన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికలకు 2013లో బీజేపీ తనను ప్రధాని అభ్యర్థిగా ఎంపిక చేసేనాటికి దేశం పాలన, విశ్వాస సంక్షోభంలో పడి ఉందని చెప్పారు. యూపీఏ హయాంలో అవినీతి, ఆశ్రిత పక్షపాతం, విధాన పక్షవాతంతో విలవిలలాడిన భారత్.. ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థ, సామాజిక భద్రత పథకాలకు నెలవుగా మారిందన్నారు. 'దేశం స్వావలంబన సాధించేందుకు మన రైతులు కొత్త పుంతలు తొక్కుతున్నారు. భారత్ అన్ని రంగాల్లో స్వయంసమృద్ధి సాధించేందుకు (ఆత్మనిర్భర భారత్) ప్రభుత్వం విస్తృత సంస్కరణలు చేపడుతోంది. 'ఇది స్వదేశీ వస్తువని గర్వంగా చెప్పండి' అన్న నినాదంలో అవి ప్రతిబింబిస్తున్నాయి. 11 ఏళ్లుగా భారత ప్రజలందరం కలిసికట్టుగా పనిచేస్తున్నాం. ఎన్నో పరివర్తనలు తీసుకొచ్చాం. విప్లవాత్మక చర్యలతో దేశవ్యాప్తంగా వివిధ వర్గాలను.. ముఖ్యంగా నారీశక్తి, యువ శక్తి, అన్నదాతలను సాధికారత దిశగా నడిపిస్తున్నాం. 25 కోట్ల మందికిపైగా ప్రజలను పేదరికం నుంచి విముక్తి చేశాం. ప్రధాన ప్రపంచ ఆర్థిక శక్తుల నడుమ చోటు సంపాదించాం' అని మోదీ వివరించారు.

పుతిన్‌కు మోదీ పుట్టిన రోజు శుభాకాంక్షలు

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ప్రధాని మోదీ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం పుతిన్ 73వ జన్మదినం కావడంతో ఆయనకు ఫోన్ చేసి మాట్లాడారు.

క్వాంటమ్ టెక్నాలజీపై పరిశోధనకు భౌతికశాస్త్ర నోబెల్



జాన్ ఎం.మార్టినిస్, మైకేల్ హెచ్ డెవొరె, జాన్ క్లార్క్

- జాన్ క్లార్క్, మైకేల్ హెచ్ డెవొరె, జాన్ ఎం మార్టినిస్‌కు సంయుక్తంగా ప్రకటించిన నోబెల్ కమిటీ


స్టాక్‌హోం, అక్టోబరు 7: అడ్వాన్స్‌డ్ క్వాంటమ్ టెక్నాలజీపై పరిశోధనలు చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలను.. భౌతిక శాస్త్రంలో ఈ ఏటి నోబెల్ వరించింది. ఆ ముగ్గురూ.. బ్రిటన్‌కు చెందిన భౌతిక శాస్త్రవేత్త జాన్ క్లార్క్ (83), ఫ్రాన్స్‌కు చెందిన భౌతిక శాస్త్రవేత్త మైకేల్ హెచ్ డెవొరె (72), అమెరికాకు చెందిన జాన్ ఎం.మార్టినిస్ (67). డిజిటల్ టెక్నాలజీకి మరింత ఊతమిచ్చే క్వాంటమ్ టన్నెలింగ్‌పై వీరు 1980ల్లో కీలక పరిశోధనలు చేశారు. సాధారణంగా ఏదైనా ఒక కణం వెళ్లే మార్గంలో ఒక గోడలాంటిది ఉంటే.. ఆ కణం దాన్ని దాటి వెళ్లలేదు. కానీ క్వాంటమ్ మెకానిక్స్ ప్రకారం అయితే.. కణం ఆ అడ్డంకిని కూడా దాటి వెళ్లగలదు. అలా వెళ్లడాన్నే 'క్వాంటమ్ టన్నెలింగ్' అంటారు. అయితే, ఒకటికి మించిన అణువులు ఉన్నప్పుడు అలా వెళ్లలేవు (అంటే ఎక్కువ అణువులుంటే క్వాంటమ్ ప్రభావాలు కనపడవు). గరిష్ఠంగా ఎంత పరిమాణం వరకూ ఈ క్వాంటమ్ ప్రభావాలు కనపడతాయనే అంశంపై క్లార్క్, మైకేల్, మార్టినిస్ చేసిన పరిశోధనలకే నోబెల్ కమిటీ ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ప్రత్యేకమైన సర్క్యూట్ల సహాయంతో.. పెద్ద సంఖ్యలో కణాలు ఉన్నప్పటికీ, వాటి క్వాంటమ్ లక్షణాలు బయటపడతాయని 1984-85లో నిర్వహించిన ప్రయోగాల ద్వారా వారు నిరూపించారు. తమ ప్రయోగాల్లో భాగంగా వారు సూపర్‌కండక్టర్లతో ఒక ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌ను అభివృద్ధి చేశారు (సూపర్ కండక్టర్లంటే విద్యుత్తు ఏ అడ్డంకీ లేకుండా సులభంగా ప్రవహించే పదార్థం). ఆ సర్క్యూట్‌లో సూపర్‌కండక్టర్ల మధ్య అత్యంత పలుచనైన ఇన్సులేటర్ పొర (నాన్ కండక్టివ్ మెటీరియల్)ను పెట్టారు. దీన్ని 'జోసెఫ్‌సన్ జంక్షన్'గా వ్యవహరిస్తారు. అనంతరం ఆ సర్క్యూట్‌లోకి విద్యుత్తును ప్రవహింపజేయగా.. ఎలక్ట్రాన్లన్నీ విడివిడిగా కాకుండా ఒక సమూహంలా కదలడాన్ని గమనించారు. అంటే.. విడివిడిగా ఉండాల్సిన ఎలక్ట్రాన్లన్నీ ఒక్క పెద్ద కణంలా ప్రవర్తించాయన్నమాట.

ఈ ఆవిష్కరణ ఎలా ఉపయోగపడింది?

మనం వాడే సాధారణ కంప్యూటర్లలో ఉండే బిట్‌లకు భిన్నంగా.. క్వాంటమ్ కంప్యూటర్లలో 'క్విబిట్'లు ఉంటాయి. ఒక బిట్ అంటే.. 0 లేదా 1లో ఏదో ఒకటి మాత్రమే. కానీ క్విబిట్ ఒకే సమయంలో సున్నాగానూ, ఒకటిగానూ ఉండగలదు. అలాంటి క్విబిట్లను తయారుచేయడం జోసెఫ్‌సన్ జంక్షన్ వల్ల సాధ్యమవుతుంది. సూపర్‌కండక్టింగ్ సర్క్యూట్లను జోసెఫ్‌సన్ జంక్షన్‌తో నిర్మిస్తే అవి క్విబిట్లుగా ప్రవర్తిస్తాయి. ఇలా తయారుచేసిన క్విబిట్లతో శాస్త్రవేత్తలు క్వాంటమ్ ఆపరేషన్లు చేయగలిగారు. భవిష్యత్తులో ఇలాంటి క్విబిట్లను వందల సంఖ్యలో తయారుచేసి పెద్ద క్వాంటమ్ ప్రాసెసర్లను నిర్మించవచ్చు. ప్రస్తుతం గూగుల్, ఐబీఎం, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు తయారుచేస్తున్న క్వాంటమ్ కంప్యూటర్లకు గుండెభాగం ఈ జోసెఫ్‌సన్ జంక్షన్‌లే. ఉదాహరణకు.. గూగుల్ సంస్థ 2019లో సికమోర్ అనే క్వాంటమ్ కంప్యూటర్‌ను తయారుచేసింది. ఆ సికమోర్ చిప్‌లో మొత్తం 54 క్విబిట్లు ఉన్నాయి. వాటిలో 53 క్విబిట్లను ఉపయోగించి.. అత్యంత క్లిష్టమైన గణిత సమస్యను 200 సెకన్లలో పరిష్కరించారు. అప్పటికి ప్రపంచంలోనే అతిపెద్ద సూపర్ కంప్యూటర్‌ను ఉపయోగించి ఆ సమస్యను పరిష్కరించాలంటే 10 వేల సంవత్సరాలు పడుతుందని అంచనా! అంటే.. క్వాంటమ్ కంప్యూటింగ్ ఎంత శక్తిమంతమైనదో.. క్లార్క్, మైకేల్, మార్టినిస్ పరిశోధనలు ఎంత కీలకమైనవో అర్థం చేసుకోవచ్చు. వారు అప్పట్లో చేసిన పరిశోధనలు తదుపరి తరం క్వాంటమ్ సాంకేతికపరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి ఎంతగానో ఉపకరించాయని నోబెల్ కమిటీ కొనియాడింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డిజిటల్ టెక్నాలజీ మొత్తానికీ క్వాంటమ్ మెకానిక్సే పునాదిరాయి అని నోబెల్ కమిటీ ఫర్ ఫిజిక్స్ ఛైర్మన్ ఒల్లె ఎరిక్‌సన్ అన్నారు.

స్థానిక ఎన్నికల్లో భారీ ఆఫర్లు!

- ఏకగ్రీవంగా ఎన్నుకుంటే.. రూ.72 లక్షలతో అభివృద్ధి చేస్తా
- రూ.40 లక్షలు ఇస్తా.. సర్పంచ్‌గా గెలిపించండి
- గ్రామ పంచాయతీ ఖాతాలో 25 లక్షలు జమ చేస్తా
- సర్పంచ్ ఆశావాహుల హామీలు



నవాబ్‌పేట/షాద్‌నగర్/గంగారం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సర్పంచ్ అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించేందుకు భారీగా హామీల వర్షం కురిపిస్తున్నారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే, ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా సొంతంగా రూ.లక్షలు వెచ్చించి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ఆశావాహులు ప్రకటిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలోని కాకర్జాల గ్రామ పంచాయతీలో ఓ సర్పంచ్ అభ్యర్థి ఏకంగా రూ.72 లక్షలతో అభివృద్ధి పనులు చేస్తానని హామీ ఇచ్చారు. ఇదే మండలంలోని కాకర్లపాడ్‌లో మరో సర్పంచ్ అభ్యర్థి తనను ఏకగ్రీవంగా గెలిపిస్తే గ్రామాభివృద్ధికి రూ.40 లక్షలు అందజేస్తానని తెలిపారు. అలాగే, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం గిరాయిగుట్ట తండాకు చెందిన నార్లనాయక్ తనను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే తండా అభివృద్ధి కోసం రూ. 25 లక్షలు గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేస్తానని తెలిపారు. ఇటీవల సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి తండావాసులు నిర్వహించుకున్న సమావేశంలో ఆయన ఈ మేరకు ప్రకటించారు. ఇలా పరిషత్, పంచాయతీ ఎన్నికల ఆశావహులు ఒక్కో గ్రామంలో ఒక్కో విధంగా ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు.

స్థానిక ఎన్నికలు బహిష్కరిస్తున్నాం..

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపులో అన్యాయం జరిగిందంటూ మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం కోమట్లగూడెం పంచాయతీ పరిధిలోని పెద్దెల్లాపురం గ్రామస్థులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. త్వరలో జరగబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. కోమట్లగూడెం పంచాయతీలో బీసీలకు అన్యాయం జరిగిందని గ్రామకమిటీ సభ్యులు జున్ను అశోక్, రాధారపు కొమరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించినా, తమ గ్రామంలోని నాలుగు వార్డుల్లో ఉన్న 450 మంది బీసీ ఓటర్లకు చెందాల్సిన రిజర్వేషన్లను ఎస్టీలకు కేటాయించడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ అన్యాయానికి నిరసనగా ఎన్నికలను బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించామని తెలిపారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించినట్లు వారు వివరించారు.

ఆయుధాలు వీడుతాం

- 15 వరకు సమయం ఇవ్వండి
- సోనూ విజ్ఞప్తికి మద్దతు ఇస్తున్నాం
- మావోయిస్టు మాడ్ డివిజన్ కమిటీ లేఖ

చర్ల/చింతూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఆయుధాలు వీడుతామని ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ డివిజను కమిటీ కార్యదర్శి రాణిత అలియాస్ సునిత పేరిట ఓ లేఖ విడుదలైంది. ఈనెల 15 వరకు సమయం ఇవ్వాలని లేఖలో కోరారు. ఈనెల 4నే రాసినట్టు లేఖపై తేదీ కనిపిస్తోంది. అయితే అది మంగళవారం బయటకి వచ్చింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ అలియాస్ సోనూ విజ్ఞప్తులకు మాడ్ డివిజను కమిటీతో సహా పలు కమిటీలు మద్దతు ఇస్తున్నాయని రాణిత పేర్కొన్నారు. వాస్తవానికి ఏప్రిల్, మే నెలల్లోనే తమ నాయకుడి సూచన మేరకు ప్రభుత్వంతో చర్చల ప్రయత్నాలకు కూడా తాము మద్దతు ఇచ్చామన్నారు. ఆ సమయంలోనే సాయుధ పోరాటాలకు స్వస్తి పలకాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. తాజాగా కార్యకర్తలకు, ప్రజలకు సోనూ చేసిన విజ్ఞప్తిని, లేఖను చదివామని తెలిపారు. దేశంలో, ప్రపంచంలో మారుతున్న పరిస్థితులను గుర్తించడంలో, తదనుగుణంగా విప్లవ ఉద్యమంలో మార్పులు చేయడంలో కేంద్ర కమిటీ విఫలమైందన్నారు. అదే దశలో ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు ఉన్న అవకాశాలను కూడా అందిపుచ్చుకోవడంలో కూడా విఫలమైనట్లు తెలిపారు. తప్పుడు నిర్ణయాల వల్ల తమ ప్రయత్నాలేవీ సఫలం కాలేదన్నారు. ఈ క్రమంలో ఆయుధాలు వీడేందుకు నిర్ణయం తీసుకున్నామని, స్నేహపూర్వక సంస్థలతో కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి తీవ్రంగా ఉన్నందున తమ నిర్ణయాన్ని అర్థం చేసుకుని మద్దతు ఇవ్వాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో తమ నిర్ణయాన్ని తమ పార్టీకి, కార్యకర్తలకు వివరించాల్సి ఉందన్నారు. సాధ్యమైనంత తక్కువ సమయంలోనే దానిని పూర్తి చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించారు. కానీ కొనసాగుతున్న అణిచివేత మధ్య ఆ పనిని పూర్తి చేయలేమని పేర్కొన్నారు. దీని కోసం కొంతకాలం పోలీసు గస్తీ నిలిపివేయాలని కోరారు. ఈనెల 15లోపు ఆ పని పూర్తి చేస్తామన్నారు.

ఇంటర్ విద్యార్థినిపై హత్యాచారం

నల్లగొండ జిల్లా కేంద్రంలో దారుణ ఘటన.. నిందితుడిపై హత్య, అత్యాచారం, పోక్సో కేసు



నల్లగొండ క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళ్లొస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన ఇంటర్ విద్యార్థిని కొద్ది గంటల్లోనే లైంగిక దాడికి, హత్యకు గురైంది. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిందీ దారుణం. నల్లగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17) నల్లగొండలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. రోజూ ఆమె తమ ఊరి నుంచి ఆటోలో నల్లగొండకు వెళ్లి.. అదే ఆటోలో సాయంత్రానికి ఇంటికి చేరుకునేది. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే గడ్డం కృష్ణ అనే వ్యక్తి రోజూ అదే ఆటోలో వెళ్తుండేవాడని.. అతడితో ఆమెకు స్నేహం కుదిరిందని సమాచారం. ఈ క్రమంలో మంగళవారం కళాశాలకు బయలుదేరిన ఆమెను.. కృష్ణ తన స్నేహితుడి గదికి తీసుకెళ్లాడు. రెండు గంటల తర్వాత.. ఆ గదిలో బాలిక మృతిచెందినట్లు స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, గ్రామస్థులు కూడా సంఘటనా స్థలానికి పెద్దసంఖ్యలో తరలిరావడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు వారిని కట్టడి చేసి బాలిక మృతదేహాన్ని అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం నిందితుడే స్వయంగా టూటౌన్ పోలీసుల వద్దకు వెళ్లి బాలిక మృతిచెందిన విషయం చెప్పి లొంగిపోయినట్లు తెలిసింది. కాగా.. గడ్డం కృష్ణ తమ కుమార్తెకు మాయమాటలు చెప్పి అతని స్నేహితుడి గదికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడి, హత్య చేశాడని.. అతడికి అతడి స్నేహితుడు సహకరించాడని.. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూడో వ్యక్తి ప్రమేయంపై దర్యాప్తు

బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు.. గడ్డం కృష్ణపై అత్యాచారం, హత్య కేసులతో పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆమెపై కృష్ణ ఒక్కడే హత్యాచారానికి పాల్పడ్డాడా లేక మూడో వ్యక్తి ప్రమేయం ఇందులో ఉందా అనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై త్వరలోనే అన్ని వివరాలూ వెల్లడిస్తామని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు.

మెడికల్ షాప్ రెన్యూవల్‌కు 20 వేల డిమాండ్

- ఏసీబీ వలలో ఇద్దరు డ్రగ్ కంట్రోల్ అధికారులు, ఒక సహాయకుడు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని విజేత ఆస్పత్రి మెడికల్ షాపు డ్రగ్ లైసెన్సు రెన్యూవల్ కోసం రూ.20 వేలు డిమాండ్ చేసిన ఇద్దరు ఔషధ నియంత్రణ అధికారులు, వారి సహాయకుడిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏసీబీ కరీంనగర్ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం విజేత ఆస్పత్రి మెడికల్‌షాప్‌లో వార్షిక తనిఖీలు చేసిన డ్రగ్ కంట్రోల్ ఏడీ మర్యాల శ్రీనివాసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తిక్ భరద్వాజరెడ్డి.. దాని లైసెన్సు రెన్యూవల్ కోసం రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. దీనిపై ఏసీబీ అధికారులను సంప్రదించిన మెడికల్ షాపు యజమాని.. వారి సూచన మేరకు మంగళవారం సాయంత్రం రూ.20 వేలు ఇస్తానని మర్యాల శ్రీనివాసులు, కార్తిక్ భరద్వాజరెడ్డిలకు చెప్పాడు. ఇందుకోసం వారు తమ సహాయకుడు రామును విజేత ఆస్పత్రికి పంపారు. అలా మెడికల్ షాప్ నిర్వాహకుడి వద్ద రూ.20 వేలు లంచం తీసుకుంటున్న రామును అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు.. తర్వాత జిల్లా ఔషధ నియంత్రణాధికారి కార్యాలయంలో తనిఖీలు చేసి మర్యాల శ్రీనివాసులు, కార్తిక్ భరద్వాజరెడ్డిలను అరెస్టు చేశారు.

గ్రూపు-1పై సుప్రీం తీర్పు అమలు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి కల్వకుంట్ల కవిత డిమాండ్

హైదరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రూపు-1 ఉద్యోగ నియామకాలపై న్యాయస్థానాల్లో వివాదం తేలే వరకు అభ్యర్థుల మెయిన్స్ ఆన్సర్ షీట్లను తొందరపడి డిస్పోజ్ చేయొద్దని ప్రభుత్వాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. న్యాయస్థానాలు తుది తీర్పునిచ్చే లోపు వాటిని డిస్పోజ్ చేస్తే నిరుద్యోగులతో కలిసి టీజీపీఎస్సీని స్తంభింప చేస్తామని హెచ్చరించారు. గ్రూపు-1 నియామకాలపై సుప్రీంకోర్టు ఆదేశాలను తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఎక్స్ వేదికగా మంగళవారం ఆమె కోరారు. నియామక పత్రాలు అందజేసినా గ్రూపు-1 అభ్యర్థులకు ఆ ఉద్యోగాలపై ఎలాంటి హక్కు లేదని పేర్కొనడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేసిన తప్పులను సుప్రీంకోర్టు ఎత్తి చూపినట్లైనన్నారు. కాగా, కామారెడ్డి జిల్లా బీఎస్పీ నాయకులు సురేష్ గౌడ్, తలారి బాలరాజ్ తదితరులు కవిత సమక్షంలో తెలంగాణ జాగృతిలో చేరారు.

తిరుమలలో భక్తుల రద్దీ.. క్యూలైన్‌కు తాళం

తిరుమల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పెరిగిన రద్దీ కొనసాగుతునే ఉంది. రోజూ వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోతున్నాయి. క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్, బాటగంగమ్మ సర్కిల్, ఆక్టోపస్ భవనం వరకు దాదాపు 3 కి.మీ మేరకు క్యూ వ్యాపిస్తోంది. రద్దీ రోజుల్లో అర్ధరాత్రి దాటాక భక్తులు క్యూలైన్‌లోకి చేరి ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 3 గంటల తర్వాత బాటగంగమ్మ ఆలయ సర్కిల్ సమీపంలోని క్యూలైన్‌కు తాళం వేసి.. అర్ధరాత్రి తర్వాత భక్తులను క్యూలైన్‌లోకి అనుమతిస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత క్యూలైన్ వద్దకు వచ్చే భక్తులు అర్ధ రాత్రి వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక, క్యూలైన్‌లోకి ప్రవేశించిన భక్తులకు 14 నుంచి 20 గంటల దర్శన సమయం పడుతోంది.

మళ్లీ తెరుచుకున్న శ్రీశైలం, సాగర్ గేట్లు

- హైదరాబాద్‌లో భారీ వర్షం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్) : శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల గేట్లు మళ్లీ తెరుచుకున్నాయి. మంగళవారం శ్రీశైలం ప్రాజెక్టులోకి 2.14 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. దీంతో అధికారులు ఆరు గేట్లను తెరిచి 1,68,174 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 65,640 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. కాగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు 22 క్రస్ట్ గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద తగ్గడంతో ఈ నెల 5వ తేదీన గేట్లు మూసివేయగా మళ్లీ పెరగడంతో మంగళవారం గేట్లు ఎత్తారు. ఈ నీటి సంవత్సరంలో జూలై 29న మొదటిసారి, ఆగస్టు 13న రెండోసారి, సెప్టెంబరు 7న మూడోసారి, 21వ తేదీన నాలుగోసారి సాగర్ గేట్లు తెరిచారు. తాజాగా ఐదోసారి మంగళవారం గేట్లు ఎత్తారు. సాగర్ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా మంగళవారం సాయంత్రానికి 311.1 టీఎంసీల నీరు ఉంది. మొత్తం 2,29,422 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువ నుంచి 2,29,422 క్యూసెక్కుల నీరు చేరుతోంది. హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. లక్డీకపూల్, పంజాగుట్ట, ఖైరతాబాద్, బేగంపేట ప్రాంతాల్లో కురిసిన కుండపోత వర్షంతో ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. లక్డీకపూల్ ప్రధాన రహదారిలో మోకాలిలోతున నీరు నిలిచిపోవడంతో ద్విచక్రవాహనాలు, కార్లు సగానికిపైగా నీట మునిగాయి. ట్రాఫిక్ జాంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం రాత్రి 7 గంటల వరకు బహదూర్‌పురలో అత్యధికంగా 5.7 సెం.మీ, బండ్లగూడ కందికల్‌గేట్‌లో 6.6 సెం.మీ వర్షం కురిసింది. మరో రెండు రోజులపాటు నగరంలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. అలాగే రాష్ట్రంలో బుధ, గురువారాల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఇక సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు నల్గొండ జిల్లా కనగల్‌లో అత్యధికంగా 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

16 శ్రీశైలానికి ప్రధాని మోదీ

- భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారుల సమీక్ష

శ్రీశైలం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఈ నెల 16న శ్రీశైలం పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ప్రధాని పర్యటన స్పెషల్ అధికారి వీరపాండియన్, నంద్యాల కలెక్టర్ రాజకుమారి, శ్రీశైలం ఆలయ ఈవో శ్రీనివాసరావు, పోలీసు ఉన్నతాధికారులు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సున్నిపెంట హెలీప్యాడ్ పరిసరాలను, శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని పరిశీలించారు. మోదీ సున్నిపెంట హెలీప్యాడ్ నుంచి రోడ్డుమార్గాన శ్రీశైలానికి రానున్నారు. దీంతో ఈ రహదారికి మరమ్మతులు వేగవంతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీశైలం దేవస్థానం పరిపాలన భవనంలో ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు, ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు.

విద్యార్థి సర్టిఫికెట్లు నిలిపివేసిన సురభి కళాశాల చైర్మన్‌కు బెయిలబుల్ వారెంట్

- రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆదేశం

హైదరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థి సర్టిఫికెట్లను నిలిపివేసిన సిద్దిపేటలోని సురభి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైఖరిని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఒరిజినల్ సర్టిఫికెట్లు అక్రమంగా నిలిపివేయడంతో తాను పీజీ ప్రవేశానికి నిర్ణీత గడువులోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తును అప్‌లోడ్ చేయలేకపోయానంటూ డాక్టర్ మెరుగు కార్తీక్ చేసిన ఫిర్యాదుపై మంగళవారం మరోసారి విచారణ జరిపింది. ఆ విద్యార్థి విషయంలో గతంలో ఇచ్చిన ఉత్తర్వులను పాటించకపోవడమే కాకుండా, సమన్లు ఇచ్చినా పట్టించుకోలేదని గుర్తించింది. దాంతో ఆ కళాశాల చైర్మన్, ప్రిన్సిపల్‌లపై బెయిలబుల్ వారెంట్ జారీ చేయాలని కమిషన్ ఛైర్‌పర్సన్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ ఆదేశించారు. ఆ విద్యార్థి పీజీలో చేరేందుకు వీలుగా రెండు వారాలపాటు ఒరిజినల్ సర్టిఫికెట్ల సమర్పణకు ఒత్తిడి చేయొద్దని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కు సిఫార్సు చేసింది. .

పాప తల్లికి ఆర్థికసాయం అందించాలని సిఫార్సు

2020లో జగిత్యాల జిల్లా ధర్మపురి ప్రాంతానికి చెందిన చిన్నారి తిప్పర్తి సహస్ర మృతిపై కమిషన్ సుదీర్ఘంగా విచారణ జరిపింది. ఆల్బెండజోల్ మాత్ర తీసుకున్న తర్వాత ఆమె చనిపోయిందంటూ ఓ పత్రికలో ప్రచురితమైన కథనం ఆధారంగా సుమోటోగా కేసు నమోదు చేసింది. వైద్య నివేదికలను పరిశీలించిన అనంతరం పాప మృతికి ఆ మాత్ర కారణం కాదని తెలిపింది. ఆ పాప తల్లి తిప్పర్తి రాజిత ఎదుర్కొంటున్న తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని ఆర్థిక సహాయం అందించాలని జగిత్యాల కలెక్టర్‌కు సిఫార్సు చేసింది.

ఐటీ ఉద్యోగికి సైబర్ టోకరా.. 54 లక్షలు స్వాహా

పటాన్‌చెరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బ్రాండెడ్ వస్తువులకు రేటింగ్ ఇస్తే కమిషన్ ఇస్తామంటూ ఓ ఐటీ ఉద్యోగికి రూ. 54.67 లక్షలకు టోకరా వేశారు సైబర్ నేరగాళ్లు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు సీఐ రాజు కథనం ప్రకారం.. బాలానగర్ హెచ్‌సీఎల్ ఉద్యోగి సందీప్‌రెడ్డి ఇక్కడి ప్రణీత్ కాలనీలో ఉంటున్నారు. ఈ నెల 15న ఆయన ఫోన్‌లోని టెలిగ్రామ్‌కు ఓ మెసేజ్ వచ్చింది. లింక్ తెరిచి చూడగా బ్రాండెడ్ వస్తువులకు రేటింగ్ ఇస్తే కమిషన్ ఇస్తామని ఉంది. దీంతో సందీప్‌రెడ్డి లింక్‌లో ఉన్న విధంగా ఆన్‌లైన్ ఖాతా తెరిచి, ప్రారంభంలో రూ.5 వేలు వేశాడు. ఇందుకు రూ.12,500 లాభం చూపించారు. మరోసారి రూ.59,800 వేశాడు. క్రమేపీ రూ.7,14,180 జమ చేశారు. లాభాలు వెనక్కి తీసుకోబోతే క్రెడిట్ స్కోరు నిమిత్తం రూ.5 లక్షలు కట్టమన్నారు. వీఐపీ చానల్ ఓపెన్ చేయాలంటూ రూ.6 లక్షలు, డబ్బులు విత్‌డ్రా చార్జీలు రూ.12.5 లక్షలు అని మొత్తంగా రూ.54,67,488 ఖాతాలో జమ చేయించుకున్నారు. చివరగా మరో రూ.8 లక్షలు కడితే మొత్తం డ్రా చేసుకోవచ్చని ఆశ చూపడంతో సందీప్‌రెడ్డికి అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

పప్పు దినుసుల ట్రేడర్లపై ఐటీ దాడులు

తెలుగు రాష్ట్రాల్లో 25 చోట్ల సోదాలు.. ఐటీ రాడార్‌లో ప్రధానంగా రెండు కంపెనీలు

- రూ.300 కోట్ల పన్ను ఎగవేత ఆరోపణలు


హైదరాబాద్, అలంపూరు చౌరస్తా, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పప్పు దినుసుల ట్రేడింగ్‌లో దాదాపు రూ.300 కోట్లకు పైగా పన్ను ఎగవేతకు పాల్పడ్డారన్న ఆరోపణలపై హైదరాబాద్‌లోని ఆదాయం పన్ను(ఐటీ) శాఖ ఇన్వెస్టిగేషన్ వింగ్ అధికారులు తెలుగు రాష్ట్రాల్లోని 25ప్రాంతాల్లో మంగళవారం సోదాలు నిర్వహించారు. హైదరాబాద్, విశాఖపట్నం, కర్నూలు, విజయవాడ, కర్నూలులోని పలువురు వ్యాపారులు, హిందుస్థాన్ ట్రేడర్స్, వి కేర్ గ్రూపు కంపెనీల యజమానులు, వారి కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. 2022 నుంచి ఈ ట్రేడింగ్ కంపెనీల వారు ముఖ్యంగా కందిపప్పు అమ్మకాల లెక్కలు చూపించడంలో విఫలమయ్యారని, గిడ్డంగుల్లో ఉన్న సరుకు, ప్రభుత్వ నిత్యావసర వస్తువుల పంపిణీ పథకానికి ఇచ్చిన పప్పులకు సంబంధించిన లెక్కల్లో గోల్‌మాల్ జరిగిందని ఆదాయం పన్ను శాఖ అధికారులు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా ఏపీలో గత ప్రభుత్వ హయాంలో ఈ దాల్ ట్రేడర్స్ పెద్ద ఎత్తున బహిరంగ విక్రయాలు జరిపారని, గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇది జరిగిందనే అనుమానాలపై ఐటీ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారని సమాచారం. గత ప్రభుత్వ హయాంలో ఏపీలో పౌర సరఫరాల శాఖ కోసమంటూ కందిపప్పు ఆర్డర్లు తీసుకుని ఆ మొత్తాన్ని సేకరించి గిడ్డంగుల్లో దాచి, ప్రభుత్వానికి సరఫరా చేయకుండా బయట అమ్ముకున్నారనే ఆరోపణలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు తక్కువ ధరలో పప్పుదినుసులు అందించడం కోసం భారత్ దాల్ అనే పథకాన్ని ప్రారంభించి 18 రాష్ట్రాల్లో అమలు చేసింది. బహిరంగ మార్కెట్‌లో కిలో శనగపప్పు ధర రూ.90 ఉండగా భారత్ దాల్ పథకంలో కిలో రూ.60కి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ప్రతి రాష్ట్రంలో ఒక నోడల్ ఏజెన్సీకి ఈ బాధ్యతలు అప్పగించింది. ఇలా సబ్సిడీపై అందాల్సిన పప్పును ట్రేడర్లు దారి మళ్లించి బహిరంగ మార్కెట్‌లో అమ్మకాలకు పాల్పడ్డారనే విశ్వసనీయ సమాచారంతో ఐటీ అధికారులు రంగంలో దిగారు.

ఉండవల్లి వీకేర్ సీడ్స్ కంపెనీలో సోదాలు

గద్వాల జిల్లా ఉండవల్లిలోని వీకేర్ సీడ్స్ కంపెనీలో మంగళవారం ఆదాయం పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. వీ కేర్ సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, గోడౌన్లు, విత్తన ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈ కంపెనీ డైరెక్టర్లుగా వెంకట్రావు, వెంకట్‌రెడ్డి, కిరణ్‌కుమార్ వ్యవహరిస్తున్నారు. వీరు కంది, వేరుశనగ, సోయాబీన్, పప్పుశనగ తదితర వ్యవసాయ విత్తన, ఉత్పత్తుల హోల్‌సేల్ డీలర్లుగా కూడా ఉన్నారు. గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని 44వ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న వీ కేర్ సీడ్స్ గోడౌన్, విత్తన ప్రాసెసింగ్ యూనిట్ కార్యాలయంలో ఐటీ అధికారులు మంగళవారం దాడులు చేశారు.

చెరువులో దూకి అన్న ఆత్మహత్య


- కాపాడే ప్రయత్నంలో తమ్ముడి మృతి


నరేష్, నవీన్ (ఫైల్)

నిర్మల్ రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): చిన్న కలహం ఓ ఉమ్మడి కుటుంబానికి అంతులేని విషాదాన్ని మిగిల్చింది. ఇంట్లో జరిగిన గొడవతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోగా.. అతన్ని కాపాడేందుకు చెరువులో దూకిన అతని తమ్ముడు కూడా నీటి మునిగి ప్రాణాలు కోల్పోయాడు. నిర్మల్ శివారులోని బంగల్‌పేట్ చెరువులో మంగళవారం జరిగిన ఘటనలో నిర్మల్‌కు చెందిన నరేష్(38), నవీన్(36) అనే అన్నదమ్ములు ప్రాణాలు కోల్పోయారు. నిర్మల్ సీఐ ప్రవీణ్ కుమార్, స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నిర్మల్‌లోని నాయుడువాడకు చెందిన నరేష్(38), నవీన్(36)లు అన్నదమ్ములు. వీరు తమ తల్లిదండ్రులు, భార్యాబిడ్డలతో కలిసి ఒకే ఇంట్లో నివాసముంటున్నారు. ఓ ప్రైవేటు కళాశాల ఉద్యోగి అయిన నరేష్‌కు భార్య, కుమారుడు(7), కుమార్తె(3) ఉన్నారు. ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడైన నరేష్ సోదరుడు నవీన్‌కు భార్య, కుమార్తె(3) ఉన్నారు. ఉమ్మడి కుటుంబం కావడంతో ఇంట్లో చిన్నచిన్న గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో వంట విషయంలో మంగళవారం ఇంట్లో జరిగిన గొడవతో మనస్తాపానికి గురైన నరేష్.. క్షణికావేశంలో బంగల్‌పేట్ వినాయక సాగర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి వెనకాలే వెళ్లిన నవీన్.. అన్నను కాపాడేందుకు చెరువులో దూకాడు. దీంతో అన్నదమ్ములు ఇద్దరు చెరువులో మునిగి ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు జాలర్ల సాయంతో మృతదేహాలను బయటకు తీయించారు.

భార్యని చంపి భర్త ఆత్మహత్య

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘటన


గోపి, సునీత దంపతులు (ఫైల్)

జూలూరుపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దారుణం జరిగింది. దంపతుల మధ్య ఏం జరిగిందో తెలియదు కానీ వారిలో మద్యానికి బానిసైన భర్త తన భార్యను కత్తితో నరికి చంపాడు. ఆపై క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం పాపకొల్లు ముత్యాలమ్మ కాలనీలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ముత్యాలమ్మ కాలనీకి చెందిన ధారావత్ గోపి (44), సునీత(35) దంపతులకు 17 ఏళ్ల క్రితం వివాహమవ్వగా వారికి గౌరి, గీతాంజలి అనే కుమార్తెలున్నారు. కొంతకాలంగా గోపి మద్యానికి బానిసవ్వగా.. సునీత వ్యవసాయ పనులకు వెళుతోంది. ఈ క్రమంలో గోపి డబ్బు కోసం భార్యను తరచూ హింసించేవాడు. అతడి వేధింపులు భరించలేక సునీత బంధువుల ఇంట్లో తలదాచుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీలు కూడా జరిగాయి. కానీ గోపి తీరు మారలేదు. ఈ క్రమంలో తాము కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న పత్తి పొలానికి దంపతులిద్దరూ కలిసి ద్విచక్రవాహనంపై సోమవారం ఉదయం వెళ్లారు. దంపతుల మధ్య అక్కడ ఏం జరిగిందో తెలియదు కానీ.. కోటకత్తితో సునీత తలపై నరికిన గోపి అక్కడ నుంచి పరారయ్యాడు. సాయంత్రమైన తల్లిదండ్రులు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుమార్తెలు తమ బాబాయి గన్యాకు విషయం చెప్పారు. గన్యా పొలం వద్దకు వెళ్లి చూడగా సునీత రక్తపుమడుగులో పడి ఉంది. విషయం తెలిసి ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, భార్యను హత్య చేసి పరారైన గోపి.. క్రిమిసంహార మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జూలూరుపాడు మండలంలోని రాజారావుపేట గ్రామ సమీపంలో పొలంలో పడి ఉన్న గోపీని మంగళవారం ఉదయం గుర్తించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రక్షణ కవచం

జీవశాస్త్రంలో విప్లవాల గురించి తర్కిస్తూ 'ఏదైనా కొత్త విప్లవం స్వభావం ఎలా ఉంటుందని ఒకరు ముందుగా ఊహించలేరు. అయితే అవగాహన కొరవడిన శాస్త్ర అంశాలను అర్థం చేసుకోవడంలో మౌలిక మార్పు తప్పకుండా వస్తుందని ఆశించగలం' అని 1960లో వైద్య, శరీర ధర్మ శాస్త్రాలలో నోబెల్ పురస్కార గ్రహీత పీటర్ మెడావర్ అన్నారు. 2025 నోబెల్ పురస్కారానికి సంయుక్తంగా ఎంపిక అయిన షిమోన్ సకగుచి, మేరీ బ్రంకో, ఫ్రెడ్ రామ్స్ డెల్ మూడు దశాబ్దాల పరిశోధన జీవశాస్త్రంలో విప్లవాన్ని కాకపోయినప్పటికీ రోగ నిరోధక వ్యవస్థను అర్థం చేసుకోవడంలో మౌలిక మార్పును తీసుకువచ్చింది.

రోగనిరోధక వ్యవస్థను జీవ పరిణామ ఉత్కృష్ట కళాకృతిగా భావిస్తారు. నిత్యం మన దేహాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తుండే సంఖ్యానేక వైరస్‌లు, బేక్టీరియా, ఇతర సూక్ష్మజీవుల నుంచి రోగనిరోధక వ్యవస్థ మనలను రక్షిస్తూ ఉంటుంది. జీవితం ఒక వరమైతే, మనకు దాన్ని సుసాధ్యం చేస్తోంది రోగ నిరోధక వ్యవస్థే. ఈ జైవిక వ్యవస్థ అద్భుతాలలో ఒకటి రోగకారక సూక్ష్మజీవులను, గుర్తించి, ఇతర కణాల నుంచి వాటిని వేరుచేయగల సామర్థ్యం. మన శరీరంలోకి ప్రవేశించిన సూక్ష్మజీవులు వేర్వేరు రూపాలలో ఉంటాయి. మానవ కణాలతో సాదృశ్య రూపును నిగూఢంగా సంతరించుకుంటాయి. రోగనిరోధక వ్యవస్థ వ్యాధి కారకాలపై దాడి ఎలా చేయగలుగుతుంది? అదే సమయంలో ఆరోగ్యకరమైన మన జీవకణాలను ఎలా రక్షించగలుగుతుంది? ఈ భక్షణ, రక్షణ చర్యల మధ్య సమతౌల్యత ఉండేలా వ్యవహరిస్తుంది కాబట్టే రోగనిరోధక వ్యవస్థను జీవ పరిణామం సృష్టించిన అద్భుత కళాకృతిగా అభివర్ణిస్తారు. అయితే ఈ అద్భుతం ఎలా జరుగుతుందనే విషయమై జీవశాస్త్రవేత్తలు దశాబ్దాలుగా అధ్యయనం చేస్తున్నారు. ఎట్టకేలకు ఈ పరిశోధనలను కొత్త పుంతలు తొక్కించిన ఘనత ఈ ఏడాది వైద్యశాస్త్ర నోబెల్ పురస్కార విజేతలకు దక్కింది.

రోగ నిరోధక వ్యవస్థలోని టి సెల్స్ అనబడే తెల్ల రక్తకణాలు రోగ కారక క్రిముల కణాలు, ఆతిథేయి దేహ కణాల మధ్య తేడాను గుర్తించగలుగుతాయి. షిమోన్ సకగుచి 1995లో అంతకు ముందు ఎవరికీ తెలియని ఒక కొత్త రోగ నిరోధక కణాలను కనుగొన్నారు. ఆయన వాటిని నియంత్రిత టి కణాలుగా పిలిచారు. ఇవి, శరీరంపై దాడి చేయగలిగే రోగ నిరోధక వ్యవస్థలోని కొన్ని భాగాలను తొలగించే సంరక్షణ కణాలు. 2001లో బ్రంకో, రామ్స్‌డెల్‌లు వేర్వేరు ప్రయోగశాలల్లో స్వతంత్రంగా పనిచేస్తూ సకగుచి కనుగొన్న కణాలకు జన్యు ప్రాతిపదికలను ఆవిష్కరించారు. ఆ జన్యు ప్రాతిపదికలే తాను కనుగొన్న నియంత్రిత టి కణాలను నియంత్రిస్తాయని షిమోన్ సకగుచి నిర్ధారించారు. ఈ ముగ్గురి పరిశోధనలు రోగ నిరోధక వ్యవస్థ స్వరూపస్వభావాలను వినూత్నంగా, సమగ్రంగా అర్థం చేసుకునేందుకు విశేషంగా దోహదం చేశాయి. ఒక జీవిలోని రోగ నిరోధక కణాలు ఇతర కణాలను అన్యమైనవిగా, హానికరమైనవిగా గుర్తించకుండా, వాటితో సామరస్యంగా జీవించే ఒక సహజ ప్రక్రియ 'పరిధీయ సహనం' (పెరిఫెరల్ టాలరెన్స్)ను ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు వివరించారు. తద్వారా అప్పటి వరకు ఒక అమూర్త ఊహగా మాత్రమే ఉన్న రోగ నిరోధక సంయమనాన్ని అణు జీవశాస్త్ర భావనగా రూపొందించారు.

వైద్య, శరీర ధర్మశాస్త్రాలలో నోబెల్ పురస్కారం మొదటి నుంచీ మానవ ఆరోగ్యం, జైవిక వ్యవస్థల గురించిన అవగాహనను ప్రగాఢంగా ప్రభావితం చేస్తున్న ఆవిష్కరణలకు గుర్తింపుగా కీర్తికెక్కింది. 2025 పురస్కారం కూడా ఇందుకు భిన్నమైనది కాదు. కేన్సర్ చికిత్సలో ఇమ్యూనో థెరపీ, టార్గెటెడ్ థెరపీ మొదలైన వినూత్న చికిత్సలకు సకగుచి, బ్రంకో, రామ్స్ డెల్ పరిశోధనలు పునాదులు వేశాయి. అలాగే అవయవాల మార్పిడి ప్రక్రియలలో మార్పులకు కూడా అవి దోహదం చేశాయి. 'విజ్ఞానశాస్త్రం ప్రపంచాన్ని వివరించడమే కాకుండా మానవ జీవితాలను మార్చివేస్తుందని 2025 నోబెల్ వైద్యశాస్త్ర పురస్కారం మనకు స్పష్టం చేసిందన్న ఒక విజ్ఞుని వ్యాఖ్య పూర్తి సత్యం.

జాతి సంస్కారానికి భావోద్వేగాల కళంకం



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

కొన్ని సంఘటనలు యాదృచ్ఛికంగా జరగవు. అదే సమయంలో ఫలానా సంఘటన వెనుక కొన్ని ప్రేరేపిత శక్తులున్నాయని కూడా చెప్పడం సరైనది కాదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఒక న్యాయవాది బూటు విసిరేందుకు ప్రయత్నించిన సంఘటనకు కూడా ఇదే వర్తిస్తుంది. భారత దేశంలో ఎలాంటి భావోద్వేగ పరిస్థితులు నెలకొన్నాయో, ప్రజలు ఏ మనోభావాలకు ప్రేరితులవుతున్నారో చెప్పేందుకు ఇది ఉదాహరణ. అంతే కాదు, మీడియా ఒక వ్యాఖ్యను సమగ్రంగా ప్రసారం చేసేందుకు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఏం జరుగుతుందో కూడా ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయి.

విషయాన్ని సమగ్రంగా అర్థం చేసుకోలేనప్పుడు, దేశంలో ఉన్న ప్రజాస్వామిక సంస్కృతి, దాని చరిత్ర గురించి అవగాహన లేనప్పుడు, భారత రాజ్యాంగం స్ఫూర్తిని జీర్ణించుకోలేనప్పుడు ఇలాంటి సంఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉన్నది. కొన్ని వందల సంవత్సరాల పాటు అనేక శక్తులతో పోరాడిన తర్వాత దేశానికి ప్రజాస్వామిక వ్యవస్థ లభించింది. అనేక మంది మేధావులు చర్చించిన తర్వాత రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాం. రాజ్యాంగంలోని ప్రగతిశీల అంశాల ఆధారంగానే కాలం చెల్లిన దురాచారాల్ని, అన్యాయాల్ని అనేకం మనం వదుల్చుకోగలిగాం. నిజానికి మతాల్లోని దుర్మార్గాలను కూడా తొలగించుకుని కాలానికి తగ్గట్లుగా మార్చుకునేందుకు కూడా రాజ్యాంగ వ్యవస్థలే దోహదం చేశాయి. అందువల్లే మనం సంప్రదాయాల్ని పాటించినా ఆధునిక జీవన విధానాలను అనుసరిస్తున్నాం. నాయకులు రాజకీయ ప్రయోజనాలు ఆశించి కాలాన్ని వెనక్కి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తారు కానీ రాజ్యాంగం ప్రగతిశీలంగానే ఉంటుంది. అంతే కాదు, ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైనప్పటికీ అనేక దేశాల మాదిరి మన దేశంలో అల్లకల్లోలాలు, అస్థిరత ఏర్పడలేదంటే ఇది కొన్ని వేల శతాబ్దాలుగా మనం రూపొందించుకున్న వ్యవస్థలు ఎప్పటికప్పుడూ మారుతూ పరిపక్వంగా రూపొందుతున్నాయనే అర్థం. మన సంప్రదాయం సహనాన్ని బోధిస్తుంది. మన తత్వశాస్త్రం సహనాన్ని బోధిస్తుంది. మన రాజ్యాంగం సహనాన్ని ఆచరిస్తుంది. దీన్ని పలుచన చేయవద్దు.. అని జస్టిస్ చిన్నప్పరెడ్డి అన్నారు. ఎందుకో కానీ దేశంలో అసహనం విపరీతంగా పెరిగిపోతున్నదని కొన్ని సంఘటనలు నిరూపిస్తున్నాయి.

మన దేశానికి ప్రజాస్వామ్యం కొత్తది కాదని, బుద్ధుడి కాలంలోనే సంఘాలు పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానాలను పాటించాయని అంబేడ్కర్ రాజ్యాంగ సభలో చెప్పారు. తమిళనాడులో కంజీవరం సమీపంలోని గ్రామాల్లో అనేక ఆలయాల గోడలపై బ్యాలెట్ బాక్స్ బ్యాలెట్ పేపర్ల గురించి ప్రస్తావన ఉన్నదని టంగుటూరి ప్రకాశం కూడా రాజ్యాంగ సభలో తెలిపారు. ఆధునిక ప్రజాస్వామ్య పద్ధతులు దేశానికి కొత్త కాదని అన్నారు. నిజానికి జనసంఘ్ సిద్ధాంతకర్త దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రజాస్వామ్యం సహజంగా ఇమిడిపోయినందువల్లే దేశం ఇంత సజావుగా నడుస్తోందని అభిప్రాయ పడ్డారు. వేదిక్ సభలు, సమితిలు ప్రజాస్వామ్యయుతంగా జరిగేవని ఆయన చెప్పారు. దేశ సమైక్యతకు ప్రజాస్వామ్యం ఒక సమర్థమైన సాధనమని దీనదయాళ్ చెప్పారు. కాని ఈ ప్రజాస్వామిక స్ఫూర్తి రోజురోజుకూ తగ్గిపోతోందా?

నిజానికి జస్టిస్ గవాయ్ ఎక్కడా ఒక మతాన్ని విమర్శించినట్లు దాఖలాలు లేవు. మధ్యప్రదేశ్‌లో ఖజురాహో శిల్ప కళాఖండాలలో భాగమైన జవారీ ఆలయంలో ఏడు అడుగుల ఖండిత విష్ణుమూర్తి విగ్రహాన్ని పునరుద్ధరించాలని దాఖలైన పిటిషన్‌ను విచారిస్తూ ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలను పూర్తిగా ఉటంకించనందువల్లే ఈ వివాదం తలెత్తింది. ఈ విగ్రహాన్ని మళ్లీ యథాతథంగా పునర్నిర్మించి ప్రాణప్రతిష్ఠ చేయాలని రాకేశ్ దలాల్ అనే వ్యక్తి గత కొంతకాలంగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖకూ, ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకూ వినతిపత్రాలు సమర్పిస్తూనే ఉన్నారు. నిరసన ప్రదర్శనలు కూడా నిర్వహించారు. చివరకు సుప్రీంకోర్టు తలుపు కూడా తట్టారు. 'ఇది ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిధిలోనిది. అలాంటిది ఆ సంస్థ అనుమతిస్తుందో లేదో తెలియదు. అందులో అనేక అంశాలు ఇమిడి ఉన్నాయి' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సెప్టెంబర్ 16న స్పష్టంగా చెప్పారు. అంతటితో ఊరుకోకుండా 'వెళ్లి మీ దేవుడినే ఏమైనా చేయమని అడగండి.. మీరు విష్ణు భగవానుడి పరమభక్తుడైతే ఆయననే ప్రార్థించి ధ్యానం చేయండి.. లేకపోతే ఖజురాహోలో అతి పెద్ద శివలింగం ఉన్నది కదా.. మీరు శైవమతానికి వ్యతిరేకం కాకపోతే అక్కడకు వెళ్లి ప్రార్థన చేయొచ్చు' అని సలహా ఇచ్చారు. గవాయ్ మనస్ఫూర్తిగానే ఈ సలహా ఇచ్చి ఉండవచ్చు. ఖజురహో నిజానికి ఒక తత్వానికి కట్టుబడి ఉన్నది కాదు. అక్కడి శిల్పాల్లో వైష్ణవం, శైవంతో పాటు, జీవితంలో ఇమిడిపోయిన ప్రేమ, ప్రకృతి, కామం, స్వలింగ సంపర్కం, తంత్ర మొదలైనవన్నీ మిళితమై ఉంటాయి. మొత్తం భారతీయ జీవన విధానం, సంస్కృతి, స్వేచ్ఛలకు అది ప్రతిబింబం. దట్టమైన అడవుల్లో మునిగిపోయిన ఈ అమూల్యమైన శిల్పసంపద గురించి మనకు బ్రిటిష్ వారే తెలిపారు. మతపరమైన భావోద్వేగాల కంటే మన భారతీయ సంస్కృతిలోని ఔన్నత్యానికి మనం ప్రాధాన్యత నీయాల్సిన అవసరం ఉన్నది.

> **మతపరమైన భావావేశాల కంటే భారతీయ సంస్కృతిలోని ఔన్నత్యానికి మనం ప్రాధాన్యత నీయాల్సిన అవసరం ఉన్నది. రాజ్యాంగ విలువలైన న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అధికారంలో ఉన్నవారిపై లేదా?**



నిజానికి గవాయ్ వ్యాఖ్యలు సంచలనం కావాల్సిన అవసరం లేదు. కేసుల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూనే ఉంటారు. అయోధ్య కేసులో విచారణ జరుగుతున్నప్పుడు శ్రీరాముడు కచ్చితంగా ఎక్కడ పుట్టారో చెప్పగలరా? రఘువంశానికి చెందినవారెవరైనా అక్కడున్నారా? ఆ ప్రాంతానికి దైవత్వం ఎందుకు ఆపాదిస్తున్నారు? అన్న ప్రశ్నలు వేశారు కాని అప్పుడెవరూ న్యాయమూర్తులను నిందించ లేదు. శబరిమల కేసులో సుప్రీంకోర్టు భక్తి శ్రద్ధల విషయంలో లింగవివక్ష కూడదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఎన్నో వాద వివాదాలు జరిగాయి. నాడు జస్టిస్ గొగోయ్, జస్టిస్ దీపక్ మిశ్రాలపై ఎవరూ దాడి చేయలేదు. కాని ఇప్పుడెందుకు గవాయ్‌పై దాడి జరిగింది? ఆయన దళితుడైనందుకా అన్న ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. జస్టిస్ గవాయ్ సాధారణ నేపథ్యం ఉన్న వ్యక్తి కాదు. ఆయన తండ్రి ఆర్ఎస్ గవాయ్ అంబేడ్కర్‌తో పాటు బౌద్ధమతాన్ని స్వీకరించిన వేలాది మందిలో ఒకరు. జస్టిస్ గవాయ్ కూడా బౌద్ధ మతస్థుడే. నిజానికి బుద్ధుడిని కూడా దశావతారాల్లో ఒకరిగా హిందూమతం స్వీకరించింది.

జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలు చేసిన రోజునుంచే సోషల్ మీడియాలో ఆయనపై దాడులు మొదలయ్యాయి. నిజానికి ఆయన మాటల్ని ఎవరూ పూర్తిగా ఉటంకించ లేదు. ప్రధాన న్యాయమూర్తి హిందూ మనోభావాలను దెబ్బతీశారని, సీజేఐ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఒక న్యాయవాది ఆయనకు లేఖ కూడా రాశారు. ఇలాంటి వ్యాఖ్యలు హిందూయేతర మతాలపై ఆయన చేయగలరా? అని ప్రశ్నించిన వారూ ఉన్నారు. విషయంలోని తీవ్రతను గ్రహించిన జస్టిస్ గవాయ్ తన మాటలకు సెప్టెంబర్ 18న కోర్టులోనే వివరణ ఇచ్చారు. సోషల్ మీడియాలో తన మాటలను వక్రీకరించారని, తాను అన్ని మతాలనూ గౌరవిస్తానని చెప్పారు. కోర్టులోనే ఉన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా సోషల్ మీడియాలో అతిగా ప్రతిస్పందనలు వస్తున్నాయి అని చెప్పారు.

కానీ సోమవారం కోర్టు గదిలో రాకేశ్ కిశోర్ అనే సీనియర్ న్యాయవాది తన స్పోర్ట్ షూస్‌లో ఒకటి విప్పి ప్రధాన న్యాయమూర్తిపై విసిరేందుకు ప్రయత్నించడంతో భద్రతా సిబ్బంది ఆయనను నిలువరించారు. సనాతన ధర్మాన్ని అవహేళన చేశారని ఆయన ఆరోపించారు. అయితే ఆయనను వదిలివేయమని జస్టిస్ గవాయ్ చెప్పడంతో ఆయనను పోలీసులు అరెస్టు చేయకుండా వదిలివేశారు.. భావోద్వేగాల వల్ల జరిగిన సంఘటనలను మరింత ప్రేరేపించడం మంచిది కాదని ఆయన భావించి ఉండవచ్చు. గతంలో బాబ్రీ మసీదు కట్టడాన్ని కూల్చివేయకుండా కాపాడతానని మాట ఇచ్చి మరీ విఫలమైన ముఖ్యమంత్రి కల్యాణ్ సింగ్‌ను లాంఛనంగా ఒకరోజు నిర్బంధించి రూ. 20వేల ఫైన్ వేసి వదిలేసిన సంఘటన ముందు ఇదెంత? నిజానికి కేంద్రంలోనూ, మధ్యప్రదేశ్‌లోనూ బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉన్నది. కేంద్ర ప్రభుత్వం చేతిలోనే ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఉన్నది. మధ్యప్రదేశ్‌లో ఖజురాహో ఆలయాల సముదాయాల్లో దెబ్బతిన్న విష్ణుమూర్తి ప్రతిమనొకదానికి ప్రాణప్రతిష్ఠ చేసి అతి పెద్ద ఆలయాన్ని నిర్మించడం బీజేపీ తలుచుకుంటే పెద్ద పని కాదు. కాని అక్కడ పురాతత్వ శాఖకు ఏ నిబంధనలు అడ్డువచ్చాయో తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది.

నిజానికి ఇవాళ దేశ రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం వ్యవస్థలు ఎంతో కొంత సవ్యంగా నడుస్తున్నందువల్లే దేశం చెక్కుచెదరకుండా ఉన్నది. ఎమర్జెన్సీలో రాజ్యాంగ వ్యతిరేకంగా వ్యవహరించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించారు. దేశంలో అనేక చోట్ల నియంతృత్వ ప్రభుత్వాలను ప్రజలు మార్చివేశారు. రాజ్యాంగ బద్ధంగా నిర్వహించిన ఎన్నికల వల్లే ఇవాళ మెజారిటీ ప్రజలు భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారు. మూడు సార్లు బీజేపీ అధికారంలోకి రావడానికి రాజ్యాంగం ఏర్పర్చిన వ్యవస్థలే కారణం. ఈ విషయం తెలిసినందువల్లే ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండించారు. ప్రతి భారతీయుడికీ ఈ చర్య ఆగ్రహం తెప్పించిందని, ఇలాంటి గర్హనీయమైన చర్యలకు మన సమాజంలో స్థానం లేదని అన్నారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ కూడా ఈ చర్య నిందనీయమని, ఏ భారతీయుడూ దీనికి మద్దతు నీయడని చెప్పారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ సంఘటనలో వ్యవహరించిన తీరు చాలా హుందాగా ఉన్నదని ఆయన అన్నారు. వాట్సాప్ యూనివర్సిటీల విద్యే అసలైన విద్యగా చలామణి అవుతున్న కాలంలో అదే రాజ్యాంగం ప్రమాదంలో పడకుండా, రాజ్యాంగ విలువలైన న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అధికారంలో ఉన్నవారిపై ఉంటుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఈసారి సాహిత్య నోబెల్ ఎవరికి?

ఇదొక గమ్మత్తయిన ప్రశ్న. చాలా సంవత్సరాలుగా ఈ ప్రశ్నకు సమాధానంగా అంచనాలు కట్టినవారంతా కచ్చితంగా నూటికి నూరు శాతం తప్పుగానే రుజువయ్యారు. ఫలానావారికి సాహిత్య నోబెల్ రాబోతోంది అని వార్తల్లో ఎక్కువగా నలిగిన ఏ పేరూ పురస్కారం అందుకున్న చరిత్ర లేదు. 2024లో హన్ కాంగ్ పేరును ఎవరూ ఊహించనేలేదు, అంచనా కట్టలేదు. అదీ నోబెల్ కమిటీ అంటే! నోబెల్ నామినేషన్లు అత్యంత గోప్యంగా ఉంటాయి కనుక అంచనాలూ అంతే ఎక్కువగా ఉంటాయి.

అక్టోబర్ 9న సాహిత్య నోబెల్ పురస్కారాన్ని ప్రకటిస్తారు. గెరాల్డ్ మర్నేన్, లాస్లో క్రాస్నహోర్కాయ్, క్రిస్టినా రివెరా గార్జా, హరుకి మురకామీ, మిర్చియా కార్తారెస్కు, ఎన్రికే విలా మటాస్, థామస్ పించన్, కేన్ ష్యాయ్, మిగెల్ హౌల్బెక్, అలక్సిస్ రైట్ ఈసారి వినిపిస్తున్న పేర్లు. గూగీ వా థియాంగో కూడా జాబితాలో ఉన్నాడు.

ఈసారి మురకామీ పేరు ఎక్కువ వినపడుతోంది. వార్తల్లో ఉన్న పేరు వెనక్కు వెళ్లిపోతుంది అనే మూఢనమ్మకం ప్రకారం మరి మురకామీకీ రాకపోవచ్చు. పైగా నోబెల్ కమిటీ ఆలోచనలు వేరుగా ఉంటాయి. మురకామీ తరహా రచనలు నోబెల్ కమిటీ ఇష్టాలకు తగినవి కావు. గార్షియాకు వచ్చినప్పుడు మురకామీకి ఎందుకు రాదూ అన్నది మరో వాదన. నోబెల్ కమిటీకి కేవలం సాహిత్యమే కాక రాజకీయ, భౌగోళిక లెక్కలు కూడా ప్రధానం. నిజానికి నోబెల్ సాహిత్య పురస్కారాన్ని చాలా సందర్భాలలో సాహిత్యం కంటే రాజకీయాలే ఎక్కువ ప్రభావితం చేస్తాయి. "మోస్ట్ అవుట్‌స్టాండింగ్ వర్క్" అంటూనే "ఇన్ ఐడియల్ డైరెక్షన్" అని



నిజానికి నోబెల్ సాహిత్య పురస్కారాన్ని చాలా సందర్భాలలో సాహిత్యం కంటే రాజకీయాలే ఎక్కువ ప్రభావితం చేస్తాయి. "మోస్ట్ అవుట్‌స్టాండింగ్ వర్క్" అంటూనే "ఇన్ ఐడియల్ డైరెక్షన్" అని కూడా ఆల్‌ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో రాసిన వాక్యం రచయిత ఎంపికలో చాలా కీలకం.

కూడా ఆల్‌ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో రాసిన వాక్యం రచయిత ఎంపికలో చాలా కీలకం. శైలీ నైపుణ్యం, ప్రజాదరణ మాత్రమే కాక, మానవతా విలువల ప్రతిరూపంగా ఉన్న రచనలకే నోబెల్ కమిటీ ప్రాధాన్యతనివ్వాలి. ఈ "ఐడియల్ డైరెక్షన్" అనే మాటకు కమిటీ తనదైన అర్థాలను చెపుతూంటుంది. అయినప్పటికీ ఇప్పటి వరకూ అధిక సంఖ్యలో పురస్కారాలు అందుకున్నది యూరోపియన్లే. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు దక్కింది చాలా తక్కువ. ఇంగ్లిష్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ ఆధిపత్యం ఎక్కువ.

ఈసారి పురస్కారం విషయంలో కమిటీ రాజకీయ కోణంలో ఆలోచిస్తే గార్జాకు, సృజనాత్మకత కోణంలో ఆలోచిస్తే అనీ కార్సన్‌కు ఊహించని పేర్ల జాబితాలో చోటు దక్కే అవకాశం ఉంది. సల్మాన్ రష్దీ పేరు కూడా జాబితాలో ఉంది. కానీ ఆయనకు వచ్చేదయితే ఈ పాటికే వచ్చివుండాలి. రాలేదు కనుక ఇప్పుడూ రాదు అని ఒక అంచనా. పైగా గత దశాబ్ద కాలంగా రష్దీ పేరు ప్రధానంగా వినపడడమే తప్ప, ఎప్పుడూ తుది జాబితాకు చేరింది లేదు. గత సాహిత్య నోబెల్ మహిళకు వచ్చింది కనుక ఈ విడత పురుషుడిదే అన్నది మరో తర్కం. కొన్ని మినహాయింపులతో నోబెల్ కమిటీ ఒకసారి మహిళ, ఒకసారి పురుషుడు అనే సమతుల్యాన్ని పాటిస్తూ ఉంటుంది. గత రెండు పురస్కారాలు వరుసగా మహిళలకే దక్కాయి. అయితే చైనాకు చెందిన కాన్క్సు ఈ అడ్డంకులను అధిగమించి పురస్కారం అందుకోగల శక్తి ఉన్న రచయిత్రి అని ఒక వాదన. ఆమె రచనల్లోని తాత్వికత, సంస్కృతీ ప్రతిఫలనాలు, గాఢత, మానవీయ విలువలు కమిటీని కొన్ని సంప్రదాయాలను దూరం పెట్టేట్టుగా చేస్తాయని సాహిత్య లోకం నమ్ముతోంది. ఇటీవలి పురస్కారాలు ఆసియాకు దక్కాయి కనుక ఈసారి యూరప్, దక్షిణాఫ్రికా, లాటిన్ అమెరికా, ఇటలీ, ఆఫ్రికన్ సృజనకారులకు ఎక్కువ అవకాశాలున్నాయి. కవి, గాయకుడిగా బాబ్ డిలాన్ విషయంలో జరిగిన గొడవ నేపథ్యంలో క్నౌస్గార్డ్ పేరు తుది జాబితాలో పరిశీలనకు రావడం కష్టమే. కార్తారెస్కుకు యూరోపియన్ సాహిత్య ప్రపంచంలో పెద్ద పేరు. గొప్ప గౌరవం. అంతేగాక గత మూడేళ్లుగా ఈ పేరు జాబితాలోని మొదటి మూడు స్థానాల్లో ఉండడంవల్ల అవకాశం ఎక్కువగా ఉందన్న చర్చ జరుగుతోంది.

అంచనాల్లో ఉన్న పేర్లన్నింటిలో మురకామీకి పురస్కారం దక్కితే భారతీయులు ఎక్కువ సంతోషిస్తారేమో. ఎందుకంటే ఆయన ఇండియాలో అత్యంత ఎక్కువమంది పాఠకులను సంపాదించుకున్న రచయిత.


ఒక ఆశ్చర్యం ఏమిటంటే– ఎక్కడో చివరనే కావచ్చు, స్టేక్స్ తక్కువే కావచ్చు కానీ– అంచనాల జాబితాలో స్టీఫెన్ కింగ్ పేరు కూడా ఉంది. మన జ్ఞానపీఠం జాబితాలో యండమూరి లాంటి పేరు ఊహించగలమా. ఇదీ అలాంటిదే!

మొత్తంగా చూస్తే ఎంత అంచనాలు కట్టి, ఎన్ని ఊహాగానాలు చేసినా నోబెల్ కమిటీ సాహిత్య ప్రపంచాన్ని ప్రతీసారీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తూనే ఉంటుంది. ఆ ఆశ్చర్యం ఏమిటో తెలియడానికి మరో 36 గంటలు. అంతే.

• ప్రసేన్

భారతీయ విద్యార్థులకు రక్షణ లేదా?

అమెరికా ఎందరో భారతీయ విద్యార్థులకు, నిపుణులకు ఉన్నత భవిష్యత్తును అందించే కలల దేశం. టెక్నాలజీ, వైద్యం, విద్య, వ్యాపారం వంటి కీలకమైన రంగాల్లో అమెరికా అభివృద్ధికి భారతీయులు ఎనలేని సేవలందిస్తున్నారు. తమ మేధస్సుతో, కృషితో ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఇటీవలి కాలంలో ఆశావహులకు ఈ 'అమెరికన్ డ్రీమ్' ఒక పీడకలగా మారుతోందా? అనే ఆందోళనలు తీవ్రమవుతున్నాయి. భారతీయ విద్యార్థులపై పెరుగుతున్న నేరాలు, జాతి వివక్ష దాడులు వారి భద్రతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.



అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఒక భారతీయ మేనేజర్‌ను అత్యంత కిరాతకంగా శిరచ్ఛేదం చేసిన ఘటన, మాస్టర్స్ డిగ్రీ చదువుతున్న ఒక తెలుగు దంత వైద్యుడిని గ్యాస్ స్టేషన్‌లో కాల్చి చంపిన విషాద ఘటనలు కేవలం వార్తలు కావు. అవి అమెరికాలో నివసిస్తున్న భారతీయ వలసదారుల ప్రమాదకర పరిస్థితులకు నిలువుటద్దం. తుపాకులు సులభంగా లభించే సమాజంలో, ఆత్మరక్షణకు పరిమిత అవకాశాలున్న భారతీయ విద్యార్థులు ఎంత బలహీనంగా ఉన్నారో ఈ విషాద ఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

అమెరికా రాజ్యాంగ రెండో సవరణ ప్రకారం, అమెరికన్ పౌరులు చట్టబద్ధంగా తుపాకులను కలిగి ఉండవచ్చు. కానీ ఎఫ్-1 వీసాలపై ఉన్న అంతర్జాతీయ విద్యార్థులకు ఆ హక్కు లేదు. కేవలం శాశ్వత నివాసితులు (గ్రీన్‌కార్డ్ హోల్డర్లు) మాత్రమే తుపాకులను చట్టబద్ధంగా కొనుగోలు చేయగలరు. చిన్న నేరస్థులు కూడా తేలికగా ఆయుధాలు పొందగలిగే దేశంలో ఈ అసమానతే విదేశీ విద్యార్థులను నిస్సహాయ బాధితులుగా మారుస్తోంది. ఈ నేపథ్యంలో పౌరులు తుపాకులను కలిగి ఉండటాన్ని అమెరికా పూర్తిగా నిషేధించాలి, లేదా విదేశీ విద్యార్థులకు కూడా పరిమితంగానైనా ఆత్మరక్షణ హక్కును కల్పించాలి. ఈ పరిమితుల మధ్య కూడా విద్యార్థులకు ఆత్మరక్షణ కోసం కొన్ని చట్టబద్ధమైన మార్గాలు అందుబాటులో ఉన్నాయి. పెప్పర్ స్ప్రే, స్టన్‌గన్, టేజర్ వంటి ప్రాణాంతకం కాని పరికరాలు అమెరికాలోని చాలా రాష్ట్రాల్లో చట్టబద్ధమైనవి. ఇవి దాడి చేసేవారిని తాత్కాలికంగా నిలువరించి, బాధితులు తప్పించుకోవడానికి లేదా సహాయం కోసం అరవడానికి విలువైన సమయాన్ని అందిస్తాయి. ఈ పరికరాలు ఉపయోగించడానికి సులభమైనవి, సురక్షితమైనవి.

భారతీయులు బాగా సంపాదిస్తారని, శారీరకంగా బలహీనులని, ఎదురు తిరగరని ఒక ప్రమాదకరమైన అపోహ దుండగులలో ప్రచారంలో ఉంది. ఈ కారణంగానే భారతీయులను సులభ లక్ష్యాలుగా ఎంచుకుంటున్నారు. ఈ దృక్పథం మారాలి. అమెరికా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న భారతీయులు కేవలం ఆర్థిక వనరులు కాదు, ఆ దేశ సమాజంలో అంతర్భాగం. కేవలం పెప్పర్ స్ప్రేలు, స్టన్‌గన్‌లు మాత్రమే దీనికి శాశ్వత పరిష్కారం కాదు. కాబట్టి భారతీయ సమాజం సంఘటితంగా తమ భద్రతపై గళం విప్పాలి. భారత ప్రభుత్వం కూడా అమెరికా ప్రభుత్వంతో దౌత్యపరమైన మార్గాల ద్వారా ఈ సమస్య తీవ్రతను తెలియజేసి, తమ పౌరుల రక్షణకు కఠినమైన చర్యలు తీసుకునేలా ఒత్తిడి తీసుకురావాలి. అమెరికాలో భారతీయులు కేవలం అతిథులు కారు, ఆ దేశ ప్రగతిలో భాగస్వాములు. వారి భద్రతను నిర్లక్ష్యం చేయడం అంటే, ఆ దేశం తన భవిష్యత్తును తానే ప్రమాదంలో పడేసుకోవడమే.

– శ్రీనివాస్ మాధవ్

తరం తరం సమాజ మేధోవనరు

తెలుగు నేలకు, హక్కుల ప్రజానీకానికి పరిచయం అవసరం లేని పేరు బాలగోపాల్. హక్కుల దిక్సూచిగా, ప్రజల న్యాయవాదిగా ఆయన సాధించిన మైలురాళ్ళు ఎన్నో; ప్రజా విజయాలు, ప్రజాధర్మానికి గీటురాయిగా నిలిచిన సందర్భాలు మరెన్నో. నేను 2021 నుంచి మానవ హక్కుల వేదికతో పని చేస్తున్నాను. బాలగోపాల్ సంస్మరణ సభలకు 2019 నుంచి వెళ్తున్నాను. ప్రతి సంవత్సరం అక్టోబర్‌లో బాలగోపాల్ సార్ యాదిలో మానవ హక్కులవేదిక హైదరాబాద్‌లో నిర్వహించే సంస్మరణ సభకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి సామాజిక కార్యకర్తలు హాజరవుతారు. మనల్ని వదిలివెళ్లి పదహారేళ్ళయినా బాలగోపాల్ సార్‌కు ఉన్న కరిష్మా అది.

అయితే ఎప్పుడూ ఒక ప్రశ్న నన్ను వేధిస్తూ ఉండేది. బాలగోపాల్ గురించి ఇప్పటి యువతకు తెలుసా? విశ్వవిద్యాలయాలలో చదువుతున్న విద్యార్థులకు ఆయన చేసిన వందలాది నిజనిర్ధారణల గురించి అవగాహన ఉందా? ప్రజాసమస్యల పట్ల పాతతరం ఒక ఎరుకతో ఉండేది, ఏదో ఒక ప్రజా ఉద్యమంతో పని చేయటం వల్ల వారికి బాలగోపాల్ గురించి కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. కానీ ఇప్పుడున్న యువత మాటేమిటి? ఆయన వేసిన కొత్త దారులు, రాసిన రాతలు, చేసిన పోరాటాలు, గెలిచిన కేసులు.. వాటి గురించి వీరికి ఎంత తెలుసు అనిపించేది. ఆయన్ని పోగొట్టుకున్న రోజు విషాదంతో కూరుకుపోయిన తెలుగునేల గురించి, ఆయన విలువ గురించి తర్వాతి తరాలకు ఎప్పటికైనా పూర్తిగా తెలుస్తుందా? అనుకునేవాడిని.

గత సంవత్సరం సంస్మరణ సభకు ముందు హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయాల్లో పోస్టర్స్ అతికించే కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు, నాకు మరింత స్పష్టంగా జవాబులు దొరికాయి. 'టిస్'కు వెళ్ళినపుడు, అక్కడి విద్యార్థులకు ఆయన ఒక ప్రజా మేధావిగా పరిచయం అని అర్థమయింది. ఈపీడబ్ల్యూలో రాసిన వ్యాసాల వల్ల కూడా వారికి ఆయన సుపరిచితుడే. ఆయన గురించి తెలిసిన విద్యార్థులు చాలామందే కనిపించారు. అలాంటి అభిప్రాయాలే మేం 'ఇఫ్లూ'లో కూడా విన్నాం. 'హెచ్‌సీయూ'లో బాలగోపాల్ ఆదివాసుల కోసం చేసిన పనుల వల్ల ఎక్కువ పరిచయం. లెఫ్ట్ సంఘాలకు ఆయన రాసిన మార్క్సిజం రచనలతో పరిచయం. దళిత సంఘాలకు ఆయన వారి గురించి చేసిన రచనల వల్ల పరిచయం. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులకు సంఘ్ పరివార్‌కి వ్యతిరేకంగా రాసిన రచనల వల్ల, సచార్ కమిటీ నివేదికపై వ్యాసాల వల్ల, కశ్మీర్‌పై చేసిన పనుల వల్ల పరిచయం.

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల స్పందన నాకు ఎక్కువ ఆశ్చర్యాన్ని కలిగించింది. మండల్ ఉద్యమ సమయంలో రిజర్వేషన్ల మీద రాసిన వ్యాసాల వల్ల, దళితుల కోసం, ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన కృషి వల్ల అక్కడి విద్యార్థులకు బాలగోపాల్ సుపరిచితుడు.

ఒక విద్యార్థి మాట్లాడుతూ "ఆర్ట్స్ కాలేజీ లాన్‌లో మా సీనియర్ పాలస్తీనా ప్రజాపోరాటం వ్యాసం మొత్తం చదివి వినిపించాడు" అని చెప్పాడు. చివరగా నల్సార్‌కి వెళ్ళినపుడు అక్కడి బి.ఎ+ఎల్.ఎల్.బి చదివే మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా బాలగోపాల్ వాదించిన కేసుల వివరాలు తెలుసు. మేమందరం బాలగోపాల్‌కి రుణపడి ఉన్నాం అని చెప్పకనే చెప్పారు. అదీ, ఆయనకు ఇప్పటి తరంతో ఉన్న అనుబంధం. ఆయన ఆలోచనలకు ఇప్పటి విద్యార్థుల దగ్గర కూడా ఎంత ప్రాసంగికత ఉన్నదో అర్థమైంది.

> **బాలగోపాల్ చేసిన పనులు చాలా విస్తారమైనవి. వైవిధ్యమైనవి, విలక్షణమైనవి. ఎక్కువ మంది కార్యకర్తలు ఒక నేపథ్యంతో కూడుకున్న సమస్యల మీదనే పని చేయడానికి ఇష్టపడతారు, దానికి వాళ్లకు ఉన్న కాలపరిమితి కూడా ఒక ముఖ్య కారణం. కానీ బాలగోపాల్ ఆ అడ్డంకులు అధిగమించి కాలానికే పరిమితి పెట్టే విధంగా పనిచేశారు.**



బాలగోపాల్ చేసిన పనులు చాలా విస్తారమైనవి. వైవిధ్యమైనవి, విలక్షణమైనవి. ఎక్కువమంది కార్యకర్తలు ఒక నేపథ్యంతో కూడుకున్న సమస్యల మీదనే పని చేయడానికి ఇష్టపడతారు, దానికి వాళ్లకు ఉన్న కాలపరిమితి కూడా ఒక ముఖ్య కారణం. కానీ బాలగోపాల్ ఆ అడ్డంకులు అధిగమించి కాలానికే పరిమితి పెట్టే విధంగా పని చేశారు. ఆదివాసులు, దళితులు, మైనారిటీలు, మహిళలు, నక్సలైట్ల గురించి మాట్లాడుతూనే అభివృద్ధి విధ్వంసం, పర్యావరణం, అణచివేత, విస్థాపన, నదులు, సైన్స్, సాహిత్యం, కోర్టు తీర్పులు ఇలా దేనినీ వదలలేదు. కశ్మీర్ నుంచి కందమాల్ వరకు నిజ నిర్ధారణలు చేయడమే కాక, పాలస్తీనాతో పాటు అనేక అంతర్జాతీయ విషయాల మీద కూడా రచనలు చేసారు.

బాలగోపాల్ మరణించిన తరువాత ఆయన రచనలను పుస్తక రూపంలో అందుబాటులోకి తెచ్చిన పబ్లిషర్స్ కృషి ఎనలేనిది. అవి అందుబాటులోకి రావడం మూలానే ఆయన కొత్త తరానికి చేరువవుతున్నారు. బాలగోపాల్ చేసిన పనిని అధ్యయనం చేసి, వారి ఆశయాలను మున్ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం ఇంకా జరగాలి, ఈ తరానికి అది సాధ్యమే. ఇప్పటితరం దృష్టిలో ఆయన ఖ్యాతి ఎవరూ ఊహించనిది, ఎవరూ సాధించనిది కూడా. బహుశా అమరత్వం అంటే ఇదేనేమో!

నేడు బాలగోపాల్ వర్ధంతి. కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో, నల్సార్ వీసీ శ్రీకృష్ణ దేవరావు వక్తగా బాలగోపాల్ స్మారకోపన్యాసం జరుగుతుంది. 12వ తేదీన బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నందిని సుందర్, యోగేంద్ర యాదవ్, అపర్ గుప్తా, పి.ఎస్. అజయ్‌కుమార్ వక్తలుగా మానవహక్కుల వేదిక ఆధ్వర్యంలో సంస్మరణ సభ. బాలగోపాల్ పుస్తకం 'రాజ్యాంగాన్ని ఎలా చూడాలి' ఆవిష్కరణ, పాలస్తీనా మీద లఘుచిత్ర ప్రదర్శన ఉంటాయి.

■ రోహిత్ తాళ్ళ
మానవ హక్కుల వేదిక

'ఆరోగ్యశ్రీ'తో దందా

- కో పేమెంట్ పేరుతో ప్రైవేటు ఆస్పత్రుల వసూళ్లు
- స్టంట్ల పేరుతో రోగుల నుంచి దోపిడీ
- ఆర్థోలో టైటానియం ప్లేట్ల పేరుతో మాయ
- పట్టించుకోని ఆరోగ్యశ్రీ అధికారులు

7

వస్తున్నారదిగో వారసులు..



కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, పొంగులేటి స్వప్ని, దొమ్మాటి మౌనిక, వేం కృష్ణభార్గవ్ రెడ్డి, కుంజ కుసుమ

- అధికార కాంగ్రెస్‌లో రాజకీయ సందడి
- జడ్పీ పీఠాలపై నేతల నజర్
- వారసులను రాజకీయాల్లోకి తెచ్చేందుకు కసరత్తు
- జడ్పీ చైర్మన్ పదవిని రాజకీయ భవిష్యత్తుకు పునాదిగా భావిస్తున్న నేతలు
- రిజర్వేషన్ కలిసిరాని చోట వైస్‌చైర్మన్ పదవిపై కన్ను
- జడ్పీటీసీ స్థానం నుంచి పోటీకి ప్రణాళిక
- జిల్లా చైర్మన్ పదవి దక్కితే ఎమ్మెల్యే టికెట్ రేసులోకి రావచ్చనే ఆలోచన

స్థానిక ఎన్నికల భేరి ఉమ్మడి జిల్లాలో సరికొత్త రాజకీయ వాతావరణానికి తెరతీస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీలో నవ యువ రక్తంతో కూడిన వారసుల సందడి కనిపిస్తోంది. అనేక ఏళ్లుగా రాజకీయాల్లో స్థిరపడిన నేతలు తమ వారసుల రాజకీయాలకు దారులు వేస్తున్నారు. ఎన్నికల్లో బరిలో నిలిపేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. జడ్పీ పీఠంపై కన్నేసి తమ వారసులను బరిలోకి దించేందుకు కసరత్తు చేస్తున్నారు. రిజర్వేషన్లు కలిసిరాకుంటే జడ్పీ వైస్ చైర్మన్ పదవిని దక్కించుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు. భవిష్యత్తు రాజకీయాలకు స్థానికసంస్థల ఎన్నికలే కీలకంగా భావిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, గత ఎన్నికల్లో ఓడిపోయిన నేతలు, టికెట్ రాని నేతలు.. తమ రాజకీయ వారసుల కోసం పావులు కదుపుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం ఉమ్మడి జిల్లాలోని అన్ని జడ్పీ చైర్మన్ స్థానాల్లో హస్తం పాగా వేయాలని నేతలకు టార్గెట్ పెట్టింది. దీంతో ఓరుగల్లులో స్థానిక సంస్థల ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి.

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు తమ వారసులను రాజకీయాల్లోకి తెచ్చేందుకు ఆరాట పడుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. తన కుమార్తె కావ్యను ఎంపీ బరిలో దించి గెలిపించుకున్నారు. కడియం శ్రీహరిని చాలామంది నేతలు స్ఫూర్తిగా తీసుకుని దీపం ఉండగానే ఇల్లు చక్క పెట్టుకునేలో పనిలో పడ్డారు. తమ వారసులను రాజకీయ అరంగేట్రం చేసేందుకు స్థానిక ఎన్నికలను టార్గెట్‌గా చేసుకున్నారు. తమ వారసుల రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా జడ్పీ చైర్మన్ లాంటి కీలకమైన పదవిపై దృష్టి సారించారు.

ప్రధానంగా ఎస్సీ మహిళకు రిజర్వు అయిన హనుమకొండ జడ్పీ చైర్‌పర్సన్ స్థానంపై కాంగ్రెస్ సీనియర్ నేత దొమ్మాటి సాంబయ్య.. తన కూతురు దొమ్మాటి మౌనికను బరిలో దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. టీపీసీసీకి చేరిన జాబితాలో మౌనిక పేరును జిల్లా పార్టీ నేతలు ప్రతిపాదించినట్లుగా సమాచారం. పరకాల జడ్పీటీసీ స్థానం జనరల్‌గా ఉండటంతో ఇక్కడి నుంచి తన కూతురిని బరిలో దించేందుకు దొమ్మాటి రంగంలోకి దిగారు. సొంత మండలం కావటంతో పాటు దొమ్మాటికి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్, లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ టికెట్ చేజారాయి. దీంతో పార్టీలో మౌనిక విషయంలో ఎలాంటి విభేదాలు లేకుండా జడ్పీ చైర్‌పర్సన్‌గా అంగీకారం తెలిపినట్లుగా ప్రచారం జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారనే వార్తలు వినిపిస్తున్నాయి. హనుమకొండ జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలతో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి సైతం చర్చలు జరిపారని విశ్వసనీయ సమాచారం.

ఇక ములుగు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి ఎస్టీ మహిళకు రిజర్వు అయింది. తొలుత మంత్రి సీతక్క.. తన కుమారుడు సూర్యను రాజకీయాల్లోకి తీసుకవచ్చేందుకు జడ్పీ ఎన్నికలను అవకాశంగా తీసుకుంటారని ప్రచారం జరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సూర్యకు పినపాక అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని సీతక్క పట్టుపట్టారు. అయితే రాజకీయ సమీకరణలో సూర్యకు టికెట్ దక్కకుండా పోయింది. జడ్పీ చైర్‌పర్సన్ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వు కావటంతో సూర్య సతీమణి కుసుమను బరిలోకి దించుతారనే ప్రచారం జరుగుతోంది. ములుగు జడ్పీటీసీ స్థానం ఎస్టీ జనరల్‌గా రిజర్వు కావటంతో కుసుమను బరిలో దించి జడ్పీ చైర్‌పర్సన్ చేస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఎస్టీ మహిళల్లో ఈ స్థాయిలో పదవిని చేపట్టే నాయకురాలు లేరని, కాంగ్రెస్ కేడర్ కూడా కుసుమ వైపు మొగ్గు చూపుతున్నారనే చర్చ (మిగతా 7లో..)

టార్గెట్ అసెంబ్లీనే...

స్థానిక సంస్థల ఎన్నికల బరిలో తమ వారసులను బరిలో దించుతున్న నేతల అసలు టార్గెట్ అసెంబ్లీ ఎన్నికలే అనే ప్రచారం ఉంది. 2028లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరుగనుంది. కొత్తగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు, నాలుగు స్థానాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. కొత్త అసెంబ్లీ స్థానాలతో పాటు పాత అసెంబ్లీ స్థానాల రిజర్వేషన్ల మార్పు, సరిహద్దుల మార్పులు జరుగున్నాయి. అంతేకాకుండా మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు కానుంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజన పూర్తయ్యే వరకే క్రియాశీలక రాజకీయాల్లో ఉంటే.. ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు టికెట్ అడిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. తమతో పాటు వారసులకు కూడా అదృష్టం ఉంటే పోటీ చేసే అవకాశం దొరుకుతుందనే లెక్కల్లో నేతలు ఉన్నారు.

పెళ్లి కల చెదురుతోందని...

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- ప్రియుడు మృతి.. చికిత్స పొందుతున్న ప్రియురాలు
- పెళ్లి చేసుకోవడానికి తరచూ ఏదో ఒక ఆటంకంతో మనస్తాపం
- జనగామ జిల్లా తాటికొండలో ఘటన

7



గడ్డిమందు తాగి ఇంటి ఆవరణలో కింద పడిపోయిన ప్రేమజంట

అన్వేష్ (ఫైల్)

44 ఏళ్ల అజ్ఞాతానికి వీడ్కోలు



వివరాలు వెల్లడిస్తున్న సీపీ, వెనుకాల లొంగిపోయిన మావోయిస్టు రూబెన్

- పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టు నక్సల్ మంద రూబెన్
- రూ.8 లక్షల రివార్డు అందజేసిన సీపీ సన్‌ప్రీత్ సింగ్
- పలు ఘటనల్లో నిందితుడిగా ఉన్న రూబెన్

7

అరైజ్ సిటీస్ ఫోరం సదస్సుకు మేయర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరుగనున్న అరైజ్ సిటీస్ ఫోరం-2025 సదస్సులో పాల్గొనేందుకు వరంగల్ మేయర్ గుండు సుధారాణికి అరుదైన అవకాశం లభించింది. ఈనెల 8, 9 తేదీలలో జరుగనున్న సదస్సుకు సుధారాణి మంగళవారం సాయంత్రం బయలుదేరనున్నారు. కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో ఐసీఎల్ఈఐ (సౌత్ ఆసియా నేషన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్) ఎన్ఐయూఏ సంయుక్తాధ్వర్యంలో పర్యావరణహితమే ప్రధాన ఎజెండాగా అంతర్జాతీయ స్థాయిలో రెండురోజులపాటు ఈ సదస్సు జరుగనుంది. వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ నుంచి మేయర్ గుండు సుధారాణి హాజరవుతున్నారు.

డిసెంబరులోగా స్మార్ట్‌సిటీ పనులు

స్మార్ట్‌సిటీ బోర్డు చైర్మన్ కె.శ్రీదేవి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మునిసిపల్ కార్పొరేషన్‌లలో కొనసాగుతున్న స్మార్ట్ సిటీ పనులు డిసెంబరు నెల వరకు పూర్తి చేయాలని స్మార్ట్‌సిటీ బోర్డు చైర్మన్ కె.శ్రీదేవి సూచించారు. 29వ స్మార్ట్ సిటీ బోర్డు సమావేశం మంగళవారం వర్చువల్‌గా జరిగింది. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ కాన్ఫరెన్స్‌లో గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ నుంచి మేయర్ గుండు సుధారాణి, మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీదేవి మాట్లాడుతూ.. స్మార్ట్‌సిటీ పనులకు సంబంధించి ఆన్ గోయింగ్ ప్రాజెక్ట్‌లకు బోర్డులో ఆమోదం పొందాయన్నారు. పూర్తి చేసిన పనులకు బిల్లుల మంజూరు కోసం అక్టోబరు వరకు గడువును పొడిగించామన్నారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్‌సిటీ బోర్డు సభ్యులు భాస్కర్‌రెడ్డి, టౌన్, కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సీడీఎంఏ డైరెక్టర్ పణికుమార్‌లు పాల్గొన్నారు.

వేయిస్తంభాల గుడి అభివృద్ధికి రూ.5 కోట్లు

- కల్యాణ మండపంలో మిగిలిపోయిన పనులు పూర్తి
- ప్రాచీన కోనేరుకు మరమ్మతులు
- అంగీకరించిన కేంద్ర పురావస్తుశాఖ అధికారులు
- ఫలించిన ఎంపీ కావ్య చొరవ
- కేంద్ర పురావస్తు అధికారులతో సమీక్ష



వేయిస్తంభాలగుడి కల్యాణమంపంలో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను ఎమ్మెల్యేతో కలిసి పరిశీలిస్తున్న ఎంపీ కావ్య

హనుమకొండ, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలో చారిత్రక సుప్రసిద్ధమైన వేయిస్తంభాలగుడిని రూ.5కోట్ల వ్యయంతో అభివృద్ధిచేసేందుకు కేంద్ర పురావస్తు శాఖ అధికారులు అంగీకరించారు. ఆలయ ఆవరణలోని కల్యాణ మండంప మిగిలిపోయిన పనులు పూర్తి చేయడానికి, ప్రాచీన కోనేరుకు మరమ్మతు పనులు చేయడానికి గుడి చుట్టూరా గ్రీనరీని అభివృద్ధి చేయడానికి, గుడి విస్తరణలో భాగంగా భూసేకరణ తదితర పనులకు ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తారు. మంగళవారం హనుమకొండ కనుదుర్గ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో పురావస్తు శాఖ అధికారులతో ఎంపీ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య అత్యంత పురాతనమైన వేయిస్తంభాల గుడిని సర్వతోముఖంగా అభివృద్ధి చేయడానికి ప్రసాదు పథకం కింద రూ.75కోట్లు ఇవ్వాలని కేంకోరారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించవలసిందిగా కోరారు. ఈ నిధులు మంజూరయ్యేలా తాను కృషి చేస్తానని తెలిపారు. ఇందుకే కేంద్ర పురావస్తు శాఖ అధికారులు సుముఖత వ్యక్తం చేశారు. రూ.17కోట్ల వ్యయంతో పునరుద్ధరించిన కల్యాణ మండపం దక్షిణ ద్వారం మెట్ల నిర్మాణం, పైకప్పు ఇతరత్రా పనులు, ఆలయ ఆవరణలో గ్రీనరీ అభివృద్ధి తదితర అంశాలను కేంద్ర పురావస్తు శాఖ అధికారుల దృష్టికి ఎంపీ తీసుకువచ్చారు. ఇందుకు అధికారులు స్పందిస్తూ గుడి ఆవరణలో అసంపూర్తిగా మిగిలిపోయిన కల్యాణ మండపం పనులు, ప్రాచీన కోనేరు ఇతర అభివృద్ధి పనులను రూ.5కోట్ల వ్యయంతో త్వరలో చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చారిత్రక ఆలయాలు, కాకతీయుల వారసత్వ సంపదను పునరుద్ధరించాలని పురావస్తు శాఖ అధికారులను కోరారు. హనుమకొండలోని వేయిస్తంభాలగుడి కల్యాణ మండపం మరమ్మతులు, విగ్రహ ప్రతిష్ఠాపన, శ్రీభద్రకాళి ఆలయం, చిల్పూరులోని బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు భూపాలపల్లి జిల్లాలోని నపాక ఆలయం, కోటగుళ్లు, రెడ్డిగుడి, ప్రత్యేక శిలలపై నిర్మితమైన ఆలయాల పునరుద్ధరణకు పైలట్ ప్రాజెక్టు కింద పనులు వేగవంతం చేయాలని సూచించారు. అలాగే వరంగల్ కోటలో ఉన్న 14 ఆలయాల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలన్నారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలోని శంభునిగుడి, గణపేశ్వర స్వామి దేవాలయం (కోటగుళ్లు), ఏకవీర (ఎల్లమ్మ) ఆలయం, త్రికూటాలయాలు, కోట బురుజులు, సర్వాయిపాపన్న కోట, పాండవుల గుట్ట, (మిగతా 6లో..)

అది న్యాయదేవతపై దాడి

- చీఫ్ జస్టిస్‌పై దాడికి నిరసనగా న్యాయవాదుల ఆందోళన
- విధులు బహిష్కరించి కోర్టు ఎదుట ధర్నా



కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

వరంగల్ లీగల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశ సర్వోన్నత న్యాయస్థానం చీఫ్ జస్టిస్ బీఆర్.గవాయ్‌పై దాడి చేయడం రాజ్యాంగ విరుద్ధమని న్యాయవాదులు ముక్త కంఠంతో ఖండించారు. చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో దాడికి నిరసనగా నినాదాలు చేస్తూ ర్యాలీగా జిల్లా కోర్టు ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ మాట్లాడుతూ.. చీఫ్ జస్టిస్‌పై దాడి న్యాయ దేవతపై దాడిగా అభివర్ణించారు. దళిత సామాజిక నేపథ్యం నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎదగడం జీర్ణించుకోలేని వ్యతిరేక శక్తులు ఈదాడికి పాల్పడ్డాయని ఆరోపించారు. ఇది కేవలం వ్యక్తిపై దాడి కాదని, దేశ న్యాయవ్యవస్థ గౌరవంపై జరిగిన దాడిగా చూడాలని వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మైదం జైపాల్, ప్రధాన కార్యదర్శులు కొత్త రవి, డి.రమాకాంత్, కోశాధికారి సిరిమల్ల అరుణ, ఇతర ప్రతినిధులు గుండా కిశోర్, ఇజ్జగిరి సురేష్, బార్ కౌన్సిల్ సభ్యుడు భైరపక జయాకర్, సీనియర్ న్యాయవాదులు ఎం.సహోదర్‌రెడ్డి, కె.అంబరీష్‌రావు, ఒద్దిరాజు గణేష్, జీవన్ గౌడ్, గంధం శివ, ఆశీర్వాదం, సిద్ధూనాయక్, వెంకట్‌రత్నం, అబ్దుల్ నబీ, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ధర్నా, నిరసన ప్రదర్శనలు 7

కప్పం కోసమే అప్పులు



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య

- 22 నెలలకాంగ్రెస్ పాలనలో కేసీఆర్ పథకాలే అమలు
- మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య
- కాంగ్రెస్ బాకీ కార్డుల ఆవిష్కరణ

హనుమకొండ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం పదవి నిలబెట్టుకునేందుకు, రాహుల్‌గాంధీకి కప్పం కట్టడం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి అప్పులు తీసుకొస్తున్నారని మాజీ ఉపముఖ్యమంత్రి, తాటికొండ రాజయ్య విమర్శించారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, చల్లా ధర్మారెడ్డిలతో కలిసి కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని పథకాల బాకీ కార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ రూ.2లక్షల 20వేల కోట్లు అప్పు చేసి దేశంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి సీఎం పదవి కాపాడుకోవడం కోసం, రాహుల్ గాంధీకి కప్పం కట్టడం కోసమే అప్పులు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి 22నెలలు గడిచినా ఒక్క కొత్త ప్రాజెక్టు ప్రారంభించకపోగా (మిగతా 6లో..)



విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వినతి పత్రం తీసుకుంటున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఫీజులను చెల్లించాలి

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

హనుమకొండ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల మంది బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో విద్యను అభ్యసిస్తున్నారని, వారికి పెండింగ్‌లో ఉన్న రూ.180కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని వినోద్‌కుమార్ నివాసంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను విద్యార్థుల తల్లిదండ్రులు వినోద్‌కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థులు చదువుకుంటున్న 200 బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు మేడిపెల్లి శోభన్‌బాబు, రమేష్ బాబు, ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆపరేటర్ పోస్టులు భర్తీ చేయాలి

టీటీఎస్‌సీఐఏ జనరల్ సెక్రెటరీ ఎం.డి. మసూద్ అలీ

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో ఖాళీగా ఉన్న ఆపరేటర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ టైప్ రైటింగ్ షార్ట్ హ్యాండ్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్ (టీటీఎస్‌సీఐఏ) జనరల్ సెక్రెటరీ మసూద్ అలీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ సుబేదారిలోని శ్రేయ టైప్ రైటింగ్ షార్ట్ హ్యాండ్ ఇనిస్టిట్యూట్‌లో మంగళవారం మసూద్ అలీ మాట్లాడారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో ఆపరేటర్లుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కూడా వారినే మళ్లీ విధులలో కొనసాగించడం సరికాదన్నారు. కొత్తగా ఐటీఐ ఎలక్ట్రీషియన్ చేసిన నిరుద్యోగులకు అవకాశం ఇవ్వకుండా ఉద్యోగ విరమణ పొందిన వారిని కొనసాగించడం అన్యాయమన్నారు. మహబూబాబాద్, ములుగు, పరకాల, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, హనుమకొండ, భూపాలపల్లి సబ్‌స్టేషన్‌లలో రిటైర్ అయిన వారిని తొలగించి కొత్తవారిని ఎన్నుకోవాలన్నారు. ఈ సమావేశంలో రమేష్, ఏడుకొండలు, టైపిస్టు నిరుద్యోగులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరిపై కేసు

ఎల్కతుర్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అకినపల్లి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. హనుమకొండ పట్టణంలోని అలంకార్ జంక్షన్‌కు చెందిన జె.అహ్మద్‌ఖాన్, ఉదయ్‌కిరణ్ అలియాస్ చిన్నలు స్కూటీపై ఎల్కతుర్తి మండలకేంద్రంలోని ఎస్బీఐ బ్యాంక్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు తారసపడ్డారు. పోలీసులను చూసి ఉదయ్ పారిపోగా అహ్మద్‌ఖాన్‌ను పట్టుకొని సోదాచేయగా 240 గ్రాముల గంజాయి లభించింది. దీని విలువ సుమారు రూ.6వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయితోపాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని పారిపోయిన ఉదయ్‌కిరణ్‌కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

● వరంగల్ జిల్లా వ్యాప్తంగా 184 కొనుగోలు కేంద్రాలు ● లక్ష్యం 2,50,000 మెట్రిక్ టన్నులు

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో 184 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వానకాలం సీజన్‌లో మొత్తం 2 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేలా ప్రణాళికలు రూపొందించారు. పౌర సరఫరాల సంస్థ, వ్యవసాయశాఖ, రైస్ మిల్లర్స్ మార్కెటింగ్ శాఖ, డీఆర్‌డీఏ, సహకార శాఖలు సమన్వయంతో పనిచేసి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సత్యశారద సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో ధాన్యం సేకరణకు దిశా నిర్దేశం చేశారు. వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు, రైతు సంఘాల నాయకులు, రైస్ మిల్లర్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చే సమస్యలను పరిష్కరించి ధాన్యం కొనుగోలును పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

184 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు

వరంగల్ జిల్లా పరిధిలోని 13 మండలాల్లో మొత్తం 184 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచారు. అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా మండల స్థాయి అధికారులను ఎప్పటికప్పుడు పరిశీలించే విధంగా ఏర్పాట్లు చేశారు. ధాన్యం కొనుగోలుకు 72 ఐకేపీ కేంద్రాలను ఏర్పాటుచేయగా, పీఏసీఎస్ కేంద్రాలు 103, మెప్మా 1, ఎఫ్‌పీవో 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు.



2,50,000 మెట్రిక్ టన్నులు లక్ష్యం

జిల్లావ్యాప్తంగా ఈసీజన్‌లో సుమారు 2,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా యంత్రాంగం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ. 2389, కామన్ రకానికి రూ.2369 ప్రభుత్వం ధర నిర్ణయించిందని, సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా ప్రభుత్వం చెల్లిస్తున్న క్రమంలో అన్ని కేంద్రాల్లో సన్న రకం, దొడ్డు రకం ధాన్యం గుర్తింపులో జాగ్రత్తలు చేపట్టారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారు.

వాతావరణ మార్పులకు అనుగుణంగా ఏర్పాట్లు

ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారుతుండటంతో కొనుగోలు కేంద్రాల్లో అదనంగా టార్పాలిన్లు నిలువ చేస్తున్నారు. కేంద్రాల్లో ఎక్కువగా ధాన్యం నిలువలు ఉండకుండా ఎప్పటికప్పుడు రవాణా చేసేందుకు వీలుగా సరిపడా వాహనాలను ఏర్పాటు చేశారు. రైతులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

సంధ్యారాణి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు 184 కేంద్రాలను ఏర్పాటు చేశాం. సన్న రకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా సేకరించేందుకు కేంద్రాల్లోనే ఏర్పాట్లు పూర్తి చేశాం. కొనుగోలు కేంద్రాలలో ప్యాడి క్లీనర్లు, డ్రైయ్యర్లు, తాగునీరు, టార్పాలిన్స్, గన్నీ బ్యాగులు, తేమ సాంద్రత కొలిచే యంత్రాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా 62.50 లక్షల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా, ప్రస్తుతం 35 లక్షలు అందుబాటులో ఉన్నాయి. మిగతా వాటిని కూడా సకాలంలో సరఫరా చేస్తాం. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్లు అందించాం.

కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

ఈసీ మార్గదర్శకాలపై అధికారులకు సూచనలు



ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్యశారద క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డితో కలిసి వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డులో పర్యటించారు. జిల్లాలోని 11 మండలాలకు సంబంధించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించి పటిష్టంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. మార్కెట్ యార్డులోని గోడౌన్ నెంబర్ 17ఏ, 17బీ, 17సీ, 17డీ గదులను పరిశీలించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. పోలింగ్ అనంతరం జిల్లాలోని 11 మండలాల బ్యాలెట్ బాక్స్‌లను భద్రపర్చడానికి స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్ల పక్కపక్కనే ఉండేలా చూడాలన్నారు. ప్రతీ కౌంటింగ్ హాలులో మండలానికి సుమారు 14 టేబుళ్ల చొప్పున 11 మండలాలకు కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేయాలని, ఏ విధంగా అమరిస్తే సౌకర్యంగా ఉంటుందో పక్కా ప్రణాళిక చేయాలని సూచించారు. కౌంటింగ్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు సమీక్షించుకోవాలన్నారు. కౌంటింగ్ కోసం సిబ్బంది, ఏజెంట్లు, ప్రవేశం, బయటకు వెళ్లేదారి, బారికేడ్లతో ఉండాలని, విద్యుత్, వీఐపీ పార్కింగ్, తాగునీరు, టాయిలెట్స్ సౌకర్యం కల్పించడంతోపాటు సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచాలని తెలిపారు. పటిష్టమైన భద్రత, మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీవో కల్పన, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, హౌసింగ్ పీడీ గణపతి, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల తర్వాత రైతు కుటుంబానికి బీమా సొమ్ము

వినియోగదారుల రాష్ట్ర ఫోరం తీర్పు

హనుమకొండ, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): రైతు బీమా నిబంధనలతో బీమా సొమ్ము కోల్పోయిన రైతు కుటుంబానికి మూడేళ్ల అనంతరం న్యాయం జరిగింది. వినియోగదారుల రాష్ట్ర ఫోరం తీర్పుతో రూ.5 లక్షల సొమ్ము రైతు కుటుంబానికి అందింది. వివరాల్లోకి వెళితే.. జనగామ జిల్లా చిల్పూర్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన రైతు కొలిపాక యాదమ్మ 2022 నవంబరు 5న చనిపోయింది. రైతు బీమా పథకం డబ్బుల కోసం కుటుంబసభ్యులు దరఖాస్తు చేసుకున్నారు. ఆధార్ కార్డులో ఒకరకంగా, రైతు బీమా పాలసీ బాండ్‌లో ఒకరకంగా పుట్టిన తేదీ నమోదైంది. దీంతో బీమా సొమ్ము అందకుండా పోయాయి. దీంతో కుటుంబసభ్యులు హనుమకొండకు చెందిన న్యాయవాది రాచకొండ ప్రవీణ్ కుమార్‌ను సంప్రదించారు. ఆయన హైదరాబాద్‌లోని రాష్ట్ర వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. అన్ని వివరాలను పరిశీలించిన రాష్ట్ర వినియోగదారుల ఫోరం బాధిత కుటుంబానికి బీమా సొమ్ము పూర్తిగా చెల్లించేలా గత నెల 29న తీర్పు వెలువరించింది. దీంతో ఆ రైతు కుటుంబానికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగింది.

మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం బీవోఎస్‌గా రాధిక

కేయూ క్యాంపస్ అక్టోబరు (ఆంధ్రజ్యోతి): కేయూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ చాడ రాధికను మరో రెండేళ్లపాటు కొనసాగిస్తూ మంగళవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో రాధికకు ఉత్తర్వులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు అందచేసి అభినందనించారు.

అంతర్జాతీయ సదస్సుకు ఇద్దరికి ఆహ్వానం

కేయూ క్యాంపస్ అక్టోబరు (ఆంధ్రజ్యోతి): కేయూ తెలుగు విభాగం కాంట్రాక్టు అధ్యాపకుడు, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, వర్సిటీ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్రా రాజుగౌడ్‌కు అంతర్జాతీయ తెలుగు సదస్సుకు ఆహ్వానం లభించింది. తమిళనాడులోని మధురై కామరాజ్ వర్సిటీలో అక్టోబరు 9, 10,11 తేదీల్లో జరిగే మూడు రోజుల తెలుగు అంతర్జాతీయ సదస్సుకు ఎంపికయ్యారు. చిర్ర రాజుగౌడ్ లక్షరాన్ని అవాహన చేసుకున్న - కవి వాసిలి ' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పిస్తారు. ఈ సందర్భంగా రాజును పలువురు అభినందించారు. అలాగే కేయూ తెలుగు విభాగం కాంట్రాక్టు అధ్యాపకుడు డాక్టర్ కర్రె సదాశివ్ సైతం ఈ తెలుగు అంతర్జాతీయ సదస్సుకు ఎంపికయ్యారు. 'సదాశివ్ విశ్వర్షి వాసిలి వాఙ్మయం-దృక్పథాలు- ఆవిష్కరణ' అనే అంతర్జాతీయ సదస్సులో 'ఆదర్శన దాంపత్య రహస్యాలు' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పిస్తారు. ఈ సందర్భంగా సదాశివ్‌ను పలువురు అభినందించారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి..

కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదుట ధర్నా

వరంగల్ మెడికల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఉద్యోగులకు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కేఎంసీ ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదుట తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యాదనాయక్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు పద్ధతిలో ఐదేళ్లుగా పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్స్ ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ ఆఫీసర్లు, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లు, పీఆర్‌ఓలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇతర సిబ్బందికి ఆరునెలలుగా వేతనాలు అందకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి వేతనాలు అందించాలన్నారు. ధర్నా అనంతరం ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌కు, కేఎంసీ ప్రిన్సిపాల్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి జె.సుధాకర్, సిబ్బంది శోభ, సంధ్య, భానురేఖ, విక్రమ్, కోమల, సంతోష్ కుమార్, లావణ్య, మౌనిక, స్రవంతి, హిమబిందు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా సందర్భంగా మాట్లాడుతున్న యాదనాయక్



రాస్తారోకో చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

రిజర్వేషన్లను అడ్డుకునే యత్నాలను రెడ్లు విరమించుకోవాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ ● కాళోజీ జంక్షన్‌లో ధర్నా, దిష్టిబొమ్మ దహనం

బాలసముద్రం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని రెడ్డి జాగృతి చూస్తుంటే ప్రధాన పార్టీల అధినాయకులు ఎందుకు స్పందించడం లేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రఅధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ ప్రశ్నించారు. మంగళవారం హనుమకొండలోని కాళోజీ జంక్షన్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ వ్యతిరేకులను ఖండిస్తూ రాస్తారోకో, నిరసన ధర్నా చేపట్టి రెడ్డి జాగృతి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రవికృష్ణగౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ మొదటి నుంచి రెండు నాలుకల ధోరణిలో వ్యవహరిస్తూ బీసీలను ధోకా చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర గవర్నర్ బీసీ రిజర్వేషన్ చట్టాన్ని ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో గవర్నర్ రాజీనామా చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు పెద్ద ఎత్తున ఉద్యమించవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. రెడ్డి సామాజిక వర్గం బీసీలకు రాజకీయ శత్రువులుగా మారవద్దని ఆయన సూచించారు. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు అగ్రకులాలు రాజకీయంగా బద్ధ శత్రువులుగా వ్యవహరిస్తూ అడ్డుపడుతున్నారని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం పద్మజాదేవి, జిల్లా అధ్యక్షురాలు మడిశెట్టి అరుంధతి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తడక సుమన్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కప్పం కోసమే అప్పులు

(5వ పేజీ తరువాయి)

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అన్నారు. ఇప్పటికే కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు చేస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే కాంగ్రెస్‌ను ప్రజలు తరిమికొడుతారని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ప్రజాపాలన అని చెప్పి ప్రజా వ్యతిరేక పాలన చేస్తూ హైదరాబాద్‌లో పేదల ఇళ్లను హైడ్రా పేరుతో కూల్చివేస్తున్నారని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద కాళేశ్వరం ప్రాజెక్టుపై అవమానకరంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ నాయకులపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ విడుదల చేసిన కాంగ్రెస్ బాకీ కార్డులపై చర్చించడానికి కాంగ్రెస్ నాయకులు సిద్ధమా? అని అడిగారు. కాంగ్రెస్ అంటేనే మోసమని విమర్శించారు. కోర్టులను అడ్డుపెట్టుకొని ఎన్నికలను ఆపాలని చూస్తున్నారని, దమ్మంటే ఎన్నికలు జరపాలని సవాల్ విసిరారు. గ్రామాలలో కాంగ్రెస్‌కు ఎంపీటీసీలు, జడ్పీటీసీల అభ్యర్థులు దొరకడం లేదని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్లలో దొంగ లెక్కలు చేసి తండాలలో బీసీలకు, గ్రామాలలో ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. గత ప్రభుత్వంలో పెట్టిన పథకాలు, శిలాఫలకాలకు పేర్లు తీసి రంగులు వేసి కాంగ్రెస్ నాయకుల పేర్లు పెట్టుకోవడం సిగ్గుచేటని అన్నారు. దమ్మంటే స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, జనార్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో తెలుగు కూలీలను ఆదుకోండి

ఎమ్మెల్యే నాయినికి సటా వైస్‌ప్రెసిడెంట్ విజ్ఞప్తి



ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న నూరుద్దీన్

హనుమకొండ, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌లో తెలుగు కూలీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ (సాట) వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ నూరుద్దీన్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని అభ్యర్థించారు. మంగళవారం ఎమ్మెల్యేను హనుమకొండలో ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కూలీలు ప్రధానంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను నాయిని దృష్టికి తీసుకువచ్చారు. వీసా, ట్రాన్స్‌ఫర్, కొన్ని కొత్త నియమాల వల్ల తెలుగు కూలీలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గల్ఫ్‌లో పని చేస్తున్న తెలుగు కూలీలు తమ పిల్లల చదువుకు సంబంధించిన సరైన మార్గదర్శనం పొందలేకపోతున్నారన్నారు. సాట కొన్నేళ్లుగా తెలుగు సమాజానికి అందిస్తున్న సేవలను నూరుద్దీన్ ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సాటా వ్యవస్థాపకుడు మల్లేశ్, సాటా రియాద్, అధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్, కోర్ టీం సభ్యులు శర్వాణి, విద్యాధరణి, కోకిల ఒదెలూరి, ప్రీతి, తాళ్ల లోకేష్, నరేష్ సింగ్, శహబాజ్ అహ్మద్, మహ్మద్ అబ్దుల్ ఘఫ్ఫార్, మిథున సురేష్, ముదిగొండ శంకర్, వీరవెల్లి యోగేశ్వరరావు, బూసి మురళి క్రిష్ణ, నయీం, ఆయాజ్, మిజామిలుద్దీన్, శ్రీ చరణ్, అస్లాం రోజదార్, కె.అయ్యగారి ఫణి, ఇలియాస్ తదితరులు ఉన్నారు.

వేయిస్తంభాల గుడి అభివృద్ధికి రూ.5 కోట్లు

(5వ పేజీ తరువాయి)

సర్వతోభద్ర దేవాలయం, వేణుగోపాలస్వామి ఆలయం, పద్మాక్షి ఆలయం, పంచకూల ఆలయాలను ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియాకు కేటాయిస్తే ఆలయాల అభివృద్ధి మరింత జరుగుతుందని అన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళతానని ఎంపీ తెలిపారు. అనంతరం పురావస్తు శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి వేయిస్తంభాల గుడిని ఎంపీ డాక్టర్ కావ్య స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్కియాలజీ సూపరింటెండెంట్ నిహిల్ దాస్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రోహిణీ పాండే ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతుల కోసం ధర్నా చేస్తే కేసులు పెట్టడం సరికాదు

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా ఇవ్వడం లేదని రైతుల పక్షాన యూరియా కొరతకు నిరసనగా ఇటీవల బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో రాస్తారోకోలు చేస్తే పోలీసులు నాన్ బెయిలెబుల్ కేసులు పెట్టడం సరికాదని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హనుమకొండ పోలీసులు నోటీసులు ఇవ్వడంపై వినయ్ భాస్కర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. నాన్ బెయిలెబుల్‌కేసులు పెడితే భయపడమని అన్నారు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆపేది లేదని హెచ్చరించారు.

ఆరోగ్యశ్రీతో దందా

- కో పేమెంట్ పేరుతో ప్రైవేటు ఆస్పత్రుల వసూళ్లు
- స్టంట్ల పేరుతో రోగుల నుంచి దోపిడీ
- ఆర్థోలో టైనానియం ప్లేట్ల పేరుతో మాయ
- పట్టించుకోని ఆరోగ్యశ్రీ అధికారులు



వరంగల్ మెడికల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ సేవల్లో అవకతవకలు రాజ్యమేలుతున్నాయి. పేరుకే ఆరోగ్యశ్రీ ఉచిత వైద్యంగా కనబడుతున్నప్పటికీ.. తెర వెనుక అమ్యామ్యాలు ఇస్తేనే వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 25 ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు 72 ప్రయివేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులను కలుపుకొని మొత్తం 97 ఆస్పత్రుల్లో వివిధ విభాగాల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుతున్నాయి. ఇందులో ప్రధానంగా హనుమకొండ జిల్లాలో ఐదు ప్రభుత్వ ఆస్పత్రులు, 45 ప్రయివేట్ ఆస్పత్రులు కలుసుకొని 50 ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ సేవలు పొందుతున్నారు. వరంగల్ జిల్లాలో ప్రభుత్వ 5, ప్రయివేట్ 14, జనగామ జిల్లాలో ప్రభుత్వ 6, ప్రయివేట్ 4, జయశంకర్ భూపాపల్లిలో ప్రభుత్వ 3, ప్రయివేట్ 2, మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ 3, ప్రయివేట్ 7, ములుగు జిల్లాలో కేవలం మూడు ప్రభుత్వ ఆస్పత్రులలో మాత్రమే ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగుతున్నాయి. సహజంగా పేద రోగులు ఏ సమస్య వచ్చినా ఆరోగ్యశ్రీ ఉందనే నమ్మకంతో వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రులను సందర్శిస్తుంటారు. కానీ ఆరోగ్యశ్రీలోని కొన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ చికిత్స పేరుతో కొన్ని ప్రయివేట్ ఆస్పత్రులు మరో దందాకు తెరలేపాయి. అదే కో పేమెంట్.

కో పేమెంట్

కో పేమెంట్ అంటే.. ఒక చికిత్స గానీ, ఆపరేషన్ గానీ ఆరోగ్యశ్రీలో నిర్వహించే వెసులుబాటు ఉంటుంది. ఇది కొన్ని ప్రయివేట్ ఆస్పత్రులకు వరంగా మారింది. హనుమకొండ జిల్లాకు చెందిన నర్సయ్య అనే ఒక వ్యక్తి గుండె సంబంధిత వ్యాధితో సుబేదారిలోని ఓ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి ఇటీవల వెళ్లారు. అంజియో పరీక్ష నిర్వహించాక రెండు స్టంట్లు వేయాల్సి ఉంటుందని అక్కడి వైద్యులు వివరించారు. ఆరోగ్యశ్రీ కింద రెండు స్టంట్లకు రూ.85 వేలు మాత్రమే వస్తాయని వైద్యులు సూచించారు. ఈ స్టంట్లు ఇండియాకు సంబంధించినవని, నాసిరకంగా ఉంటాయని రోగికి కౌన్సెలింగ్ చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా వేసే స్టంట్లకు లైఫ్ ఉండదంటూ నమ్మబలికారు. ఇలా మాయమాటలు చెప్పి యూఎస్ స్టంట్ల పేరుతో మరో రూ.లక్ష అదనంగా కోపేమెంట్‌గా తీసుకున్నారు. ఇలా కొన్ని ఆస్పత్రులలో ఈ కోపేమెంట్‌ల దందా కొనసాగుతోంది. కానీ డిశ్చార్జి సమ్మరీలతోపాటు రోగి కేస్‌షీట్‌లో మాత్రం ఆరోగ్యశ్రీ కిందనే స్టంట్లు వేసినట్లు నమోదు చేశారు. అదనంగా రూ.లక్ష తీసుకొని ఆరోగ్యశ్రీ కింద స్టంట్ వేశారని ప్రశ్నించిన నర్సయ్యకు చేదు అనుభవమే ఎదురైంది. అసలు ఇండియన్ స్టంట్ వేశారో, యూఎస్ బ్రాండ్ స్టంట్ వేశారో అర్థం కాక నర్సయ్య తలబాదుకుంటున్నారు.

రశీదు ఇవ్వరు..

కో పేమెంట్ పేరుతో వసూలు చేస్తున్న వేలాది రూపాయలకు కొన్ని ప్రయివేట్ ఆస్పత్రులు ఎలాంటి రశీదులు కూడా ఇవ్వడం లేదని బాధితులు వాపోతున్నారు. కనీసం డిశ్చార్జి సమ్మరీలో కూడా ఏ రకమైన స్టంట్ అనేది స్పష్టంగా చెప్పడం లేదని బాధితులు చెబుతున్నారు. నగరంలోని 8 ప్రయివేట్ ఆస్పత్రులతోపాటు ఎంజీఎం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో స్టంట్ల సేవలు అందిస్తున్నారు.

కొంద రు వైద్యులు ఆరోగ్యశ్రీ కలిగిన వ్యక్తులను ప్రయివేట్ వైపునకు దారి మళ్లిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి ఆర్థో విభాగంలో టైటానియన్ ఇంప్లాట్స్ పేరుతో వేల రూపాయలు గుంజుతున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా పక్షవాత రోగులకు ఎంఆర్ఐ స్కాన్ ఉచితంగా చేయాల్సి ఉన్నప్పటికీ సుమారు రూ.6వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

ఆరోగ్యశ్రీ అధికారుల మౌనం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం అధికారులను నియమించారు. ఈ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వర్తిస్తూ ఆరోగ్యశ్రీ సేవలను విస్తృతపర్చాల్సిన అవసరం ఉంటుంది. కానీ సదరు అధికారులు.. ఏమాత్రం ప్రయివేట్ ఆస్పత్రుల వైపు చూడటం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి నెలనెలా సదరు ఆస్పత్రుల నుంచి రూ.10లక్షలకు పైగా మామూళ్లను స్వీకరిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఆరోగ్యశ్రీ సేవలు అందించని ఆస్పత్రుల నుంచి కూడా 'మీ అనుమతులను డిలిస్ట్ చేస్తాం..' అంటూ అక్రమమార్గంలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరంతా ఆరోగ్యశ్రీ అధికారులుగా కొనసాగుతూ అనారోగ్య సంపాదనకు పునాదులు వేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా విజిలెన్స్‌తోపాటు ఏసీబీ అధికారులు రికార్డులను పరిశీలిస్తే భారీ మొత్తంలో నెల నెలా చేతులు మారుతున్నట్లు స్పష్టమవుతుందని ఆరోగ్యశ్రీ బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ధాన్యం కొనుగోళ్ల పేరిట స్వాహా

- కాట్రపల్లిలో రూ.94 లక్షలు మాయం?
- సివిల్ సప్లయీస్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు

శాయంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంతోపాటు కాట్రపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో భారీ అవినీతి జరిగినట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు సివిల్ సప్లయీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు సివిల్ సప్లై, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమ, మంగళవారాలు సంయుక్తంగా మండల సమాఖ్య కార్యాలయంలో విస్తృతంగా తనిఖీలు చేసి సంబంధిత అధికారులను విచారణలు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శాయంపేట, కాట్రపల్లి గత రబీ సీజన్ వరి కొనుగోలు కేంద్రాలలో నిర్వాహకులు ధాన్యం లేకుండానే ట్రక్ షీట్లు రాసి, ఆన్‌లైన్ ఎంట్రీ చేయడం, మిల్లర్ దిగుమతి లేకుండానే మిల్లులలో దిగుమతి అయినట్లుగా ఆన్‌లైన్ ఎంట్రీలు చేయడంతో చెల్లింపులు జరిగినట్లు తెలుస్తోంది. ఇందుకుగాను మండలానికి సంబంధం లేని వారికి సుమారు రూ.94 లక్షలు చెల్లింపులు అయినట్లు విశ్వసనీయ సమాచారం. ఇందుకుగాను మిల్లర్‌పై కేసు కూడా నమోదైనట్లు తెలిసింది. ఈ తతంగానికి సంబంధించి సెంటర్ నిర్వాహకులు, మండల వ్యవసాయ అధికారి గంగాజమున, ఏఈవో అర్చన, ఏపీఎం వేణుగోపాల్‌రావులను ఒక్కొక్కరిగా విచారణ చేసి, వారి వాఙ్మూలాలను రాయించుకున్నట్లు సమాచారం. దీనిపై అధికారులను సంప్రదించగా ఇట్టి వివరాలు గోప్యంగా ఉంచుతూ, సాధారణ తనిఖీలు చేశామని మాట దాటవేశారు. ఈ తనిఖీలలో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ టీం, సివిల్ సప్లయీస్ డీఎం మహేందర్, డీటీలు భద్రునాయక్, సదానందం పాల్గొన్నారు.

ఇదేం నిర్మాణం!?

- కడుతుండగానే కూలిన అంగన్‌వాడీ భవనం పిల్లర్



పడిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పిల్లర్

గీసుగొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం గ్రామ శివారులోని గట్టుకిందిపల్లెలో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనం నిర్మాణ దశలో ఉండగానే ఓ పిల్లర్ పడిపోయింది. నాణ్యత లోపం వల్లనే ఓ పిల్లర్ పడిపోగా మరో రెండు పిల్లర్ ఊగుతున్నట్లు గ్రామస్థులు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే ... గట్టుకిందపల్లెలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.20 లక్షల ఈజీఎస్ నిధులు కొద్ది నెలల కిందట మంజూరయ్యాయి. దీంతో కొద్ది రోజుల కిందట భవన నిర్మాణం కోసం ఆరు పిల్లర్‌లతో చేపట్టారు. అయితే గుంతలు తీసిన అనంతరం ఫుట్టింగ్ చేశారు. అనంతరం 5 ఫీట్ల ఎత్తువరకు పిల్లర్లను లేపారు. కాగా, ఆదివారం పిల్లర్‌లు ఊగుతున్నాయని స్థానికులు కాంట్రాక్టర్‌కు తెలిపారు. అయితే పిల్లర్ గుంతలో పిల్లర్ చుట్టు మళ్లీ కాంక్రీట్ పోసి కొన్నింటిని గుంతను పూడ్చివేశారు. ఈ క్రమంలో ముందు భాగంలోని ఓ పిల్లర్ పూర్తిగా ఓ వైపు పడిపోయింది. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు పనులు నిలిపి వేయించినట్లు తెలిపారు. నాణ్యత లోపంతో భవనం కట్టి అంగన్‌వాడీ పిల్లల ఉసురు తీస్తారా అంటు స్థానికులు మండిపడుతున్నారు. ఈ విషయమై ఏఈని వివరణ అడుగగా నిర్మాణ పనులను ఆపించినట్లు చెప్పారు.

44 ఏళ్ల అజ్ఞాతానికి వీడ్కోలు

- పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టు నక్సల్ మంద రూబెన్
- రూ.8 లక్షల రివార్డు అందజేసిన సీపీ సన్‌ప్రీత్ సింగ్
- పలు ఘటనల్లో నిందితుడిగా ఉన్న రూబెన్

వరంగల్ క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): 44 ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసిన మంద రూబెన్ అలియాస్ కన్నన్న, మంగన్న, సురేశ్ మంగళవారం పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఎదుట లొంగిపోయాడు. కమిషనరేట్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు.

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామానికి చెందిన రూబెన్ 1979లో అప్పటి ఆర్‌ఈసీలోని మెస్ విభాగంలో పనిచేశాడు. ఆ సమయంలో రాడికల్స్ యూనియన్ నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ఆకర్షితుడయ్యాడు. మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, ఆర్‌ఈసీ పూర్వ విద్యార్థి నంబాల కేశవరావు పిలుపునందుకొని అజ్ఞాతంలోకి వెళ్లాడు. 1981 నుంచి 86వరకు నేషనల్ పార్క్ దళ కమాండర్ లంక పాపిరెడ్డి నాయకత్వంలో దళ సభ్యుడిగా కుంట, బస్తర్ ప్రాంతాల్లో పనిచేశాడు. 1987లో ఏరియా కమిటీ సభ్యుడిగా పార్టీ నాయకత్వం నియమించింది. 1991లో అనారోగ్య కారణంగా చికిత్స కోసం కొత్తగూడెం వెళ్తున్న క్రమంలో చత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేసి జగదల్పూర్ జైలుకు తరలించారు. యేడాది అనంతరం రూబెన్ మరో ముగ్గురు ఖైదీలతో కలిసి జైలు నుంచి తప్పించుకున్నాడు. అనంతరం ఏరియా కమిటీ సభ్యుడిగా కుంట, అబూజ్‌మడ్ ప్రాంతాల్లో 1999 వరకు పనిచేశాడు.

అదే సంవత్సరం సెంట్రల్ కమిటీ సభ్యుడు రావుల శ్రీనివాస్ అలియాస్ రామన్న, గోపన్న నేతృత్వంలో బీజాపూర్ జిల్లా గుండ్రాయి గ్రామానికి చెందిన పొడియం భీమేతో రూబెన్‌కు వివాహం జరిగింది. డివిజన్ కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్న సమయంలో 2005లో అనారోగ్యానికి గురి కావడంతో పార్టీ ఆదేశాలతో గుండ్రాయి గ్రామంలో భార్య, పిల్లలతో నివాసం ఉంటూ కోళ్ల, గొర్రెల ఫారాలు నిర్వహిస్తూ స్థానిక గ్రామ కమిటీలతో కలిసి చురుకుగా పనిచేసే వాడు. అదే సమయంలో మావోయిస్టు నాయకులు, దళ సభ్యులకు షెల్టర్ కల్పిస్తూ, పోలీసుల కదలికలను మావోయిస్టులకు చేరవేసేవాడు. ఈ క్రమంలోనే ఆరోగ్యం సహకరించకపోవడం, మావోయిస్టులపై వ్యతిరేకత రావడం, తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకం ద్వారా ప్రశాంతంగా జీవించొచ్చని లొంగిపోయారని సీపీ వెల్లడించారు. ఈ సందర్భంగా రూబెన్‌పై ఉన్న రూ.8లక్షల రివార్డును అందజేశామన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్‌జోన్ డీసీపీ సలీమా, కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి, ఏసీపీ జాన్ నర్సింహులు, కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీపీ, వెనుకాల మావోయిస్టు రూబెన్

పలు నేరాల్లో నిందితుడు

పోలీసులకు లొంగిపోయిన రూబెన్ పలు ఘటనల్లో నిందితుడిగా ఉన్నారు. కుంట దళసభ్యుడిగా పని చేసే సమయంలో పెద్ద కెడువాల్, పండోడు, పిడిమాల్, బండారిపాడు గ్రామాలకు చెందిన దళ సభ్యులతో కలిసి హత్యలు చేయడంతో పాటు ఎలమకొం దా గ్రామ సర్పంచ్‌ను హత్య చేసిన ఘటనలో నిందితుడు. 1988లో గొల్లపల్లి-మారాయిగూడ మార్గంలో పోలీసుల కాన్వాయ్‌పై మావోయిస్టులతో కలిసి 20 మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులను దారుణంగా హత్యచేసి వారి ఆయుధాలను తీసుకపోయిన ఘటనలో నిందితుడిగా ఉన్నారు. 1990లో సెంట్రల్ కమిటీ సభ్యుడు గోపన్నతో కలిసి తుర్లపాడు పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసిన ఘటనలో పోలీసులు నిందితుడిగా చేర్చారు.

పెళ్లి కల చెదురుతోందని..

- జనగామ జిల్లాలో ప్రేమజంట ఆత్మహత్యాయత్నం
- ప్రియుడు మృతి.. చికిత్స పొందుతున్న ప్రియురాలు
- పెళ్లి చేసుకోవడానికి తరచూ ఆటంకాలతో మనస్తాపం

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇద్దరి మనసులు కలిశాయి.. పెళ్లి చేసుకుని ఆనందంగా జీవించాలని భావించారు.. ప్రియురాలిని సైతం ఇంటికి తీసుకొచ్చాడు.. ఇక పెళ్లి బాజా మోగిద్దామని భావించిన ప్రతీసారీ ఆ జంటకు ఏదోఒక ఆటంకం ఎదురైంది.. మూడునెలలుగా ఇదే దుస్థితి.. ఇక పెళ్లి కాదని భావించారేమో.. ఒకే సామాజిక వర్గానికి (దళిత)చెందిన వారు పురుగుల మందు తాగారు.. దీంతో ప్రియుడు మృతిచెందగా, ప్రియురాలు ఆస్పత్రిపాలైంది. ఒకే సామాజిక వర్గానికి (దళిత) ఈ విషాదకరమైన ఈ ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండలో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తాటికొండకు చెందిన మారపాక అంజయ్య, రేణుక దంపతుల కుమారుడు మారపాక అన్వేష్(22) ఇంటర్ వరకు చదువుకొని గ్రామంలో ఉంటూ కూలి పనులు చేస్తున్నాడు. తల్లిదండ్రులూ కూలినాలి చేసుకుని జీవిస్తున్నారు. కాగా, హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఓ గ్రామానికి చెందిన 20ఏళ్ల యువతితో పరిచయం ఏర్పడింది. ఇంటర్ పూర్తి చేసి, హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆమె పని చేస్తోంది. యువతి తండ్రి రెండేళ్ల క్రితం మృతి చెందగా, తల్లి కూలీ పనులు చేస్తూ పోషిస్తోంది. సమీప బంధువుల ఫంక్షన్‌లో వీరికి పరిచయం ఏర్పడింది. ఇదిలాఉండగా ఒకే సామాజిక వర్గానికి(దళిత) చెందిన వారు కావడంతో అదిప్రేమగా మారింది.

3 నెలల క్రితం ఇంటికి తీసుకొచ్చి..

ఈ క్రమంలోనే మూడు నెలల క్రితం యువతిని అన్వేష్ తాటికొండలోని తన ఇంటికి తీసుకొచ్చాడు. వివాహం చేసుకునేందుకు సిద్ధమై కలి సి జీవిస్తున్నారు. అయితే వివాహం చేసుకోవడానికి పలుమార్లు ప్రయత్నించినా ఏదో ఒక అడ్డం కి ఎదురైంది. వినాయచవితి పండుగ, అన్వేష్ సోదరికి కుమారుడు జన్మించి చనిపోవడం, దసరా పండుగ, అన్వేష్ పాలివాళ్ల మృతి చెం దడం లాంటి అటంకాలు ఎదురయ్యాయి. పెళ్లికి సిద్ధమైన ప్రతీసారీ ఏదోఒక ఆటంకం వచ్చి ఆగిపోతుండటంతో మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో పెళ్లి విషయమై సోమవారం ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తాయని తెలుస్తోంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన జంట మధ్యాహ్నం 3గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డిమందు తాగారు.

పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన అన్వేష్ తల్లి రేణుక... ఇద్దరూ కిందపడిపోయి ఉండటాన్ని గమనించి లబోదిబోమంటూ ఇంటిపక్కల వారిని పిలిచింది. వారు ఇద్దరినీ ఆటోలో స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతున్న అన్వేష్ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. యువతి చికిత్స పొందుతోంది. అన్వేష్ తండ్రి అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

వస్తున్నారదిగో వారసులు...

(5వ పేజీ తరువాయి)

నడుస్తోంది. ఇదిలావుండగా ములుగు జడ్పీ స్థానం నుంచి సీతక్క మేనకోడలు భవాని పేరు కూడా వినిపిస్తోంది. ప్రతి ఎన్నికల్లో సీతక్కకు సహాయంగా భవాని పని చేస్తుందని, కుసుమ పోటీకి ఏమైనా సాంకేతిక సమస్యలు వస్తే భవానిని బరిలో దించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

ఇక జనగామ జడ్పీచైర్మన్ స్థానం ఎస్సీకి రిజర్వు చేశారు. రాజకీయ అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్న జనగామ మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి రిజర్వేషన్ కలిసిరాలేదు. దీంతో జడ్పీ వైస్‌చైర్మన్ పదవిని దక్కించుకుని క్రియాశీలక రాజకీయాల్లో ఉండాలనే ఆలోచనలో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీంతో బచ్చన్నపేట జడ్పీటీసీ స్థానం నుంచి బరిలో దిగేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. కొమ్మూరి వారసుడిగా ప్రశాంత్‌రెడ్డి పరిషత్ ఎన్నికల బరిలో దిగుతారని ప్రచారం జరుగుతోంది.

వరంగల్ జడ్పీ చైర్మన్ ఎస్టీ జనరల్‌కు రిజర్వుడు అయింది. ఇక్కడ వారసుల దృష్టి పెద్దగా లేదు. అయితే నర్సంపేట జడ్పీటీసీ ఎస్టీ మహిళకు, ఖానాపూర్ జడ్పీటీసీ ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయ్యాయి. జడ్పీ చైర్మన్ కావాలంటే ఈ రెండు చోట్ల నుంచి జడ్పీటీసీగా ఎంపిక కావాల్సి ఉంది. ఈ రెండు జడ్పీటీసీ స్థానాలు నర్సంపేట నియోజకవర్గంలో ఉన్నాయి. ఇక్కడి నుంచి ఎవరు పోటి చేస్తారనేది క్యాడర్‌లో కూడా స్పష్టత లేదు. కాగా, పర్వతగిరికి చెందిన మాజీ జడ్పీటీసీ ఒకరు ఇక్కడి నుంచి కాంగ్రెస్ తరపున పోటి చేసేందుకు ఆసక్తి చూపుతున్నారనే ప్రచారం జరుగుతోంది.

ఇక బీఆర్‌ఎస్‌లో కూడా వారసుల సందడి కనిపిస్తోంది. ప్రధానంగా పదేళ్లుగా రాజకీయాల్లో ఉన్నప్పటికీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉం టున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి కుమారుడు సిరికొండ ప్రశాంత్ ఈసారి బరిలో దిగుతారనే ప్రచారం జరుగుతోంది. భూపాలపల్లి జడ్పీ చైర్మన్ బీసీ జనరల్ కావటంతో భూపాలపల్లి జడ్పీటీసీగా పోటీ చేస్తారని సిరికొండ వర్గీయులు పేర్కొంటున్నారు.

మొత్తంగా నేతలు తమ రాజకీయ వారసులను పరిషత్ ఎన్నికల బరిలో దించేందుకు అడుగులు వేస్తున్నారనే చర్చ నడుస్తోంది. ఇప్పటికే కొందరికి అధిష్ఠానం ఆశీస్సులు లభించగా, మరికొందరు పదవి కోసం లాబీయింగ్ చేస్తున్నారు. దీంతో ఓరుగల్లు స్థానిక సంస్థల ఎన్నికల రసవత్తరంగా మారుతున్నాయి.

అలాగే భూపాలపల్లి జడ్పీ చైర్మన్ సీటుపై మాజీ మావోయిస్టు నేత గాజర్ల అశోక్ అలియాస్ ఐతూ దృష్టి పెట్టారనే వార్తలు గుప్పుమంటున్నాయి. చిట్యాల జడ్పీటీసీ స్థానం నుంచి పోటీకి సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. అలాగే జనగామ జడ్పీ చైర్మన్ సీటు స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి గత ఎన్నికల్లో ఓడిపోయిన శనిగపురం ఇందిర పేరు వినిపిస్తోంది. అలాగే మహబూబాబాద్ జడ్పీ చైర్మన్ పదవి నుంచి వేం నరేందర్ రెడ్డి కుమారుడు తప్పుకుంటే మరో నాయకుడు వెన్నం శ్రీకాంత్‌రెడ్డికి దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది.

మహబూబాబాద్ తెరపైకి ఇద్దరు వారసులు..

మహబూబాబాద్ జడ్పీ చైర్మన్ స్థానం జనరల్‌కు కేటాయించారు. అయితే సీఎం సలహాదారుడు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి.. తన కుమారుడు వేం కృష్ణభార్గవ్‌రెడ్డిని బరిలో దించుతారనే ప్రచారం జరిగింది. అయితే తన సొంత మండలం కేసముద్రం జడ్పీటీసీ ఎస్టీ జనరల్‌కు రిజర్వుడు కావటంతో పోటీకి విముఖత చూపుతున్నారని తెలుస్తోంది. మహబూబాబాద్‌లో 18 జడ్పీటీసీలు ఉండగా, ములుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గంగారం జడ్పీటీసీ మాత్రమే జనరల్‌కు కేటాయించారు. దీంతో మహబూబాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి కాకుండా గంగారం నుంచి పోటీ చేయటంపై పెద్దగా ఆసక్తి చూపటం లేదని సమాచారం. నామినేషన్లకు సమయం ఉండటంతో నరేందర్ రెడ్డి తీసుకునే నిర్ణయంపై కేడర్‌లో ఉత్కంఠ నెలకొంది. అయితే వచ్చే ఏడాది అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో కేసముద్రం లేదా నెక్కొండ కేంద్రంగా కొత్త అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడుతుందని, అక్కడి నుంచి వేం తన వారసుడిని బరిలో దించుతారనే ప్రచారం జరుగుతోంది.

మహబూబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ రేసులో మరో వారసురాలి పేరు తెరపైకి వస్తోంది. రెవెన్యూ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుమార్తె సప్ని పేరు వినిపిస్తోంది. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కోడలైన సప్నిని జడ్పీ పీఠంపై కూర్చోబెట్టి రాజకీయ అరంగేట్రం చేయించాలనే ఆలోచనలో వున్నట్టు తెలుస్తోంది. గార్ల జడ్పీటీసీ స్థానం జనరల్ మహిళకు రిజర్వు కావడంతో అక్కడి నుంచి సప్నిని బరిలోకి దించుతారని టాక్ వినబడుతోంది.

జస్టిస్ గవాయ్‌పై దాడి దుర్మార్గం

- న్యాయవాది రాకేష్ కిశోర్‌ను వెంటనే అరెస్టు చేయాలి
- ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ వెంకటనారాయణ
- అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వడ్డెపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా (సీజేఐ) బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేష్ కిశోర్‌ను వెంటనే అరెస్టు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్‌కూరపాటి వెంకటనారాయణ, భారత్ బచావో హనుమకొండ జిల్లా చైర్మన్ ఎస్. రామబ్రహ్మం, వరంగల్ జిల్లా చైర్మన్ దొమ్మాటి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. జస్టిస్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా, నిరసన ప్రదర్శన నిర్వహించారు. భారత్ బచావో రాష్ట్ర నేత డాక్టర్ వెంగల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో వారితో పాటు టీపీఎస్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జనగాం కుమారస్వామి, ఎర్రగట్టు స్వామి, భారత్ బచావో నేతలు రాజ్‌మహ్మద్, టీపీఎఫ్ రాష్ట్ర నాయకురాలు బి. రమాదేవి, న్యూ డెమోక్రసీ నేత నున్నా అప్పారావు మాట్లాడారు. దేశంలో మతోన్మాద శక్తుల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని దుయ్యబట్టారు. దళితుడైన సీజేఐపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యవాదులంతా ముక్తకంఠంతో ఖండించాలని అన్నారు. ఈ ధర్నాలో ప్రజా సంఘాల నాయకులు చారువాక, యాడాల రవీందర్, ఎం.కళ, అయూబ్ అలీ, అలి, కొంగా కుమారస్వామి, జుబేర్, సుబాన్, రమేష్‌చందర్, బ్రహ్మాచారి, ఓంబ్రహ్మం, మీర్జా అజిజుల్లా బేగ్, రంజిత్, రఘువీర్, వాంకుడోత్ వీరన్న, నయీమొద్దీన్, గుగులోత్ కిషన్ నాయక్, కె. చంద్రమౌళి, మంద శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడి రాజ్యాంగంపై దాడియేనని డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు.హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన ప్రదర్శన నిర్వహించారు. దాడికి బాధ్యుడైన రాకేష్ కిశోర్‌ను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో ప్రజా సంఘాల నేతలు ఎం.చుక్కయ్య, కొమ్ముల కరుణాకర్, డాక్టర్ మంద వీరస్వామి తదితరులు పాల్గొన్నారు. గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా, నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా నాయకులు చుక్కయ్య, వెంకట్, వాంకుడోత్ వీరన్న, తిరుపతి, మంజుల, మానస, లచ్చమ్మ, రమాదేవి, రాధిక తదితరులు పాల్గొన్నారు సీజేఐపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మైనారిటీ సెల్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ నయీమొద్దీన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. దాడికి పాల్పడిన న్యాయవాది రాకేష్ కిశోర్‌పై చట్టపరమైన చర్య తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ నేతలు ఇస్మాయిల్, సర్వర్, సందాని, రషీద్, షాహీన్, మహ్మద్ నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని సంస్థలపై చర్యలు తీసుకోవాలి

వినియోగదారుల మండలి ప్రతినిధులు ఫిర్యాదు

హనుమకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విదేశీ చికెన్ ముక్కలు, విదేశీ కూల్‌డ్రింక్స్ వ్యాపారంపై మంగళవారం వినియోగదారుల మండలి జాతీయ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచెర్ల సుదర్శన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావుల రంజిత్ కుమార్‌లు లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పి.రాజేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. విదేశీ ఆన్‌లైన్ ఆహార వ్యాపార సంస్థలు ప్యాకింగ్‌పై చికెన్ ముక్కల బరువు, ధర, నాణ్యత వివరాలు పేర్కొనకపోవడం, 200 ఎంఎల్ కూల్ డ్రింక్స్ బాటిల్ రూ.99లకు అమ్మడం, ఎక్కువ కాలం నిల్వ చేసిన చికెన్ స్టోరేజ్ సమాచారం గోప్యంగా ఉంచడం తదితర అంశాలు లీగల్ మెట్రాలజీ చట్ట నిబంధనలను ఉల్లంఘించి, వినియోగదారులను మోసగిస్తున్నారని వినియోగదారుల ప్రతినిధులు రాజేశ్వర్‌కు విన్నవించారు. విదేశీ ఆన్‌లైన్ ఆహార వ్యాపార సంస్థలు చికెన్ ఫ్రైడ్ ముక్కల్లో గ్లూటామేట్ మోనో సోడియం అధిక శాతం కలపడం వల్ల చిన్న పిల్లలు, గర్భిణులకు హానికరమని, చక్రపాణి, సుదర్శన్ పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటానని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేశ్వర్ హామీ ఇచ్చారు.



లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పి. రాజేశ్వర్‌కు ఫిర్యాదు చేస్తున్న సాంబరాజు చక్రపాణి, ఎం. సుదర్శన్

నేరాల నియంత్రణకు సహకరించాలి

వరంగల్ క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సహకరించాలని షీటీం హెడ్ కానిస్టేబుల్ బి.సూర్యనారాయణ అన్నారు. హనుమకొండలోని రోజరీ హైస్కూల్‌లో మంగళవారం షీటీం ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలను పంచుకోవడంలో జాగ్రత్తలు పాటించాలని, టీ-సేఫ్ యాప్‌పై అవగాహన పెంచుకొని ప్రయాణాలు చేస్తున్నప్పుడు వినియోగించాలని సూచించారు. ఆకతాయిలు వేధిస్తే వెంటనే సీపీ వాట్సాప్ నెంబర్ 8712685257, షీటీం సీఐ 8712685142 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ పూర్ణ, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

వరంగల్ క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 34 మందిని మంగళవారం కోర్టులో హాజరుపరచగ న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ ఇద్దరికి జైలుశిక్ష విధించి మిగతా 32 మందికి రూ.31,300 జరిమానా విధించారని హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 10మంది వ్యక్తులను కోర్టులో హాజరుపరచగా రూ. 6,900 జరిమానా విధించడం జరిగిందన్నారు.



వాల్మీకి జయంతి ఉత్సవాల్లో హారతి తీసుకుంటున్న ఎంపీ కావ్య

వాల్మీకి సద్గుణాలను ఆచరించాలి

వరంగల్ ఎంపీ కడియం కావ్య

మడికొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి సద్గుణాలను సమాజంలోని ప్రతీ ఒక్కరు ఆచరించాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. కాజీపేట మండలం మడికొండలో వాల్మీకి మహర్షి జయంతి స్వర్ణోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి ఆలయంలో స్వామివారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ అభివృద్ధి, సాంస్కృతిక విలువల పరిరక్షణలో వాల్మీకి మహర్షి ఉపదేశాలు యుగయుగాలకు మార్గదర్శకం కానున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు బోగి శ్రీనివాస్, బోగి లింగమూర్తి, నిగ్గుల సతీష్, పేర్ల సురేష్, కుర్ల మోహన్, కంచనపల్లి వెంకటయ్య, బోగి లింగయ్య, బోగి కుమారస్వామి, కాంగ్రెస్ శ్రేణులు నార్లగిరి కుమారస్వామి, బిల్లా రవీందర్, పైడిపాల రవిచందర్, గుర్రం జ్యోతి అమర్‌నాథ్, వస్కుల శంకర్, కుర్ల మోహన్, పల్లపు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్ అభివృద్ధికి కృషి చేస్తా

రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున్‌రావు



మధ్యకోటలోని మ్యూజియంను పరిశీలిస్తున్న అర్జున్‌రావు అధికారులు

ఖిలావరంగల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చారిత్రక ప్రసిద్ధిగాంచిన ఖిలా వరంగల్ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పురావస్తుశాఖ డైరెక్టర్ కె.అర్జున్ రావు అన్నారు. మధ్యకోటలో మ్యూజియం, శ్రీస్వయంభూ-శంభులింగేశ్వర స్వామి దేవాలయాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు కలెక్టర్‌తో చర్చించి అభివృద్ధి పనులను త్వరలో పూర్తిచేయిస్తానని, వరంగల్ మ్యూజియంలో ఉన్న కాకతీయుల కాలంనాటి వస్తువులు, వారి ఆయుధాలు, పరికరాలు, శిల్పసంపదను ఖిలావరంగల్ మ్యూజియంకు తరలిస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శీలమంతుల శంభులింగం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు, అడిషనల్ డైరెక్టర్ డి.బుజ్జి, పర్యాటకశాఖ జిల్లా అధికారి శివాజీ, ఏఈ విజయ్ పాల్గొన్నారు.

కేయూలో ఆర్టీఐపై అవగాహన సదస్సు

కేయూ క్యాంపస్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్సిటీ వీసీలు, రిజిస్ట్రార్లు ఇతర ఉన్నతాధికారులతో ఆన్‌లైన్ జూమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ సెనెట్ హాల్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరిరామచంద్రంలు పాల్గొన్నారు. ఆర్టీఐ వారోత్సవాలను పురస్కరించుకుని అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు వర్సిటీ ఉన్నతాధికారులు తెలిపారు.

భక్తి ప్రపత్తులతో బ్రహ్మోత్సవాలు

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామి కల్యాణానికి హాజరైన కార్పొరేటర్ అభినవ్ భాస్కర్, భక్తులు

వడ్డెపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 60వ డివిజన్‌లోని వడ్డెపల్లి టీచర్స్ కాలనీ- ఫేస్1, ఎస్‌బీహెచ్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం 26వ బ్రహ్మోత్సవాలను నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ చిర్ర రఘుపతి రెడ్డి, వైస్ ఛైర్మన్లు బి.సత్యనారాయణ, పింగిళి స్వరూపరాణి, ప్రధాన కార్యదర్శి డి.జితేందర్‌రెడ్డి, కోశాధికారి బి.రవీందర్, సంయుక్త కార్యదర్శులు చిరంజీవులు, వి.నవనీత పర్యవేక్షణలో మంగళవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా రుత్వికులు కలకోట సీతారామాచార్యులు, కలకోట వెంకటరమణలు స్వామివారి కల్యాణ తంతును అత్యంత వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా శ్రీవేంకటేశ్వర స్వామికి ఆరగింపు, తీర్థ ప్రసాదగోష్ఠి, సామూహిక భోజనాలను నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని రథంలో అధిరోహింప చేసి బాజా భజంత్రీలు, సన్నాయి మేళాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. టీచర్స్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పింగిళి రాంరెడ్డి తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని వేంకటేశ్వర స్వామిని దర్శించుకొని కొలిచారు.

కొమురంభీమ్ ఆశయాల సాధనకు పాటుపడాలి

కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): కొమురంభీమ్ ఆశయాల సాధనకు అందరూ పాటుపడాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కేయూ జువాలజీ సెమినార్ హాల్‌లో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అధ్యక్షతన కొమురంభీమ్ 85వ వర్ధంతిని నర్వహించారు. ఈ సందర్భంగా వీసీ కొమురభీమ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాటంతో చైతన్యం తెచ్చారని కొనియాడారు. ఆదివాసీ పిల్లల కోసం ఏటూరునాగారం ప్రాంతంలో కేయూ పీజీ కళాశాల ఏర్పాటుకు ప్రయత్నిస్తామని అన్నారు. ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ.. వర్సిటీ క్యాంపస్‌లో కొమురంభీమ్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వై.వెంకయ్య, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాది ఆర్.పాపారావు, పొద కృష్ణప్రసాద్, జి.సన్నారావు, సువర్ణపాక సమ్మయ్య, వాసం ఆనంద్, జి.వీరయ్య, డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్, బొల్లేపాక ప్రభాకర్‌తో పాటు ఇతర ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీ పోరు బిడ్డ కొమురం భీం

హనుమకొండ టౌన్: ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలపై పోరాడిన పోరు బిడ్డ, జల్ జంగల్ జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీం అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, తాటికొండ రాజయ్యలతో కలిసి కొమురంభీం వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పులి రజినీకాంత్, జోరిక రమేష్, జనార్దన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దోచుకున్న డబ్బుతో ఓటు చోరీ

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



సంతకాల సేకరణ పత్రాలు చూపిస్తున్న నాయకులు

కాజీపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా దోచుకున్న డబ్బుతో బీజేపీ నాయకులు ఓట్లను చోరీ చేస్తూ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు కుట్రలు చేస్తున్నారని, వీరికి రాష్ట్రంలో బీఆర్ఎస్ వంత పాడుతోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేటలో చౌరస్తాలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ మాట్లాడారు. ఓటు చోరీ అనేది సమాజానికి పెద్ద ప్రమాదకరం అన్నారు. బీజేపీ దొంగ ఓట్లపై పెద్దఎత్తున అడ్డుకోవాలని చెప్పారు. కాజీపేట అభివృద్ధిలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందే బీఆర్ఎస్ అని అన్నారు. ఆర్వోబీ బస్టాండ్‌ను నిర్మించి పూర్తిచేసి తీరతామని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ఓటు చోరీపై రాహుల్ గాంధీ ఒక పెద్ద యుద్ధమే చేస్తున్నారని, అందుకు మనమంతా సంఘీభావం తెలిపి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. అనంతరం స్థానికులు ఓటు చోరీపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, జాతీయ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి సాగరిక రమాకాంత్ రెడ్డి, పులి అనిల్, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ తోట వెంకన్న, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమార్, సుంచు అశోక్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్‌రావు, పీసీసీ సభ్యులు బట్టి శ్రీనివాస్, మహిళా జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, కాంగ్రెస్ నాయకులు పసునూరి మనోహర్, దొంగల కుమార్, మమత, నీలక్క, సుకన్య, దువ్వ రేవతి, సిరిల్ లారెన్స్, తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావును సన్మానిస్తున్న విజయలక్ష్మి

స్థానిక నాయకుల సేవలు గుర్తించాలి

బీజేపీ మాజీ ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి

రాంగనర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలోపేతం కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకులను గుర్తించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావును బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి కోరారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర చీఫ్‌ను హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. పార్టీలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న సీనియర్లను సైతం గుర్తించి గౌరవించాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిని గ్రామాల్లోకి తీసుకెళ్లే విధంగా కార్యకర్తలు, ఇన్‌చార్జిల్లో ఉత్సాహన్ని నింపి ముందుకు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. సంస్థాగతంగా పార్టీ బలోపేతం అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని ఆయనను విజయలక్ష్మి కోరారు.

'వేతనాలు మంజూరు చేయండి'

శంభునిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 140 మంది సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేసే పార్ట్ టైమ్ ఉపాధ్యాయులు సోమవారం హైదరాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల బోర్డ్ ప్రధాన కార్యాలయానికి తరలివెళ్లారు. చీఫ్ సెక్రెటరీ అందుబాటులో లేకపోవటంతో జాయింట్ సెక్రెటరీ కిరణ్మయి, అడిషనల్ సెక్రెటరీ గీతకు వినతి పత్రాలు అందించి తమ సమ్యలను చెప్పుకున్నారు. మూడు నెలల నుంచి వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నా మని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఈ సంవత్సరం పార్ట్ టైమ్ ఉపాధ్యాయుల రెన్యూవల్ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, ప్రభుత్వం జీవో విడుదల చేశాకే జీతాలు విడుదల అవుతాయని సంబంధిత అకౌంటింగ్ సెక్షన్ అధికారులు తెలిపారు. దీంతో మైనారిటీ, బీసీ, ఎస్టీ సొసైటీ పాఠశాలల్లో సమయానికి వస్తుంటే ఎస్సీ వెల్ఫేర్ సొసైటీలో ఇలా ఎందుకు జరుగుతోందని ప్రశ్నిస్తూ సొసైటీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పార్ట్ టైమ్ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల జీతాలు ఒకేసారి విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, సంబంధిత ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

సీకేఎం సూపరింటెండెంట్‌గా లక్ష్మీదేవి

గిర్మాజిపేట, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ సీకేఎం ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.లక్ష్మీదేవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ బేబీరాణి సెలవుపై వెళ్లడంతో ఆమె స్థానంలో ఆస్పత్రి గైనకాలజీ సీనియర్ ప్రొఫెసర్ లక్ష్మీదేవిని నియమిస్తూ కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆర్ఎంవోలు మురళి, సృజన్‌బాబు, రమేష్, ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 వనిత, ఆస్పత్రి సిబ్బంది లక్ష్మీదేవికి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ కబడ్డీ ఎంపిక పోటీలు



జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీల్లో తలపడుతున్న బాలికలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-19 ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లోని కబడ్డీ కోర్టులో మంగళవారం ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-19 బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీలను హనుమకొండ డీఐఈవో ఎ.గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడల్లో సాధన చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. విశిష్ట అతిథిగా ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహపూర్వక సంబంధాలు పెంపొందుతాయన్నారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి జిల్లాకు కీర్తి, ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 జిల్లా క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి నరేడ్ల శ్రీధర్ మాట్లాడుతూ.. అండర్-19 బాలబాలికల విభాగంలో నిర్వహించిన కబడ్డీ ఎంపిక పోటీల్లో వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి 120మంది బాలికలు, 180మంది బాలురు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 10, 11, 12 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం కొమ్ములవంచలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 రాష్ట్రస్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎస్ఏపీఈ) హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎ.ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఏపీఈలు సతీష్ గోపి, సునీల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం హనుమకొండలోని పలుసబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని నయీంనగర్, లష్కర్‌సింగారం, రాజాజీనగర్ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, కిషన్‌పుర, నయీంనగర్, శంకర్‌నగర్, కేయూ జంక్షన్ ఏరియాలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4గంటల వరకు, న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని కనకదుర్గ కాలనీ, వాసవి కాలనీ, హంటర్‌రోడ్డు, అంజేయులు టెంపుల్ ఏరియా, టెంపుల్ ట్రీ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన



విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

కాజీపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరుపేద పిల్లలు చదివే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు రెండు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. కాజీపేటలోని బోడగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పునాది విద్య బలోపేతానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు విద్యా వికాస ప్రేరణ ఫౌండేషన్, స్ప్రింగ్ స్వచ్ఛంద సంస్థలు మంగళవారం పాఠశాలను సందర్శించాయి. పాఠశాలకు అవసరమైన వనరులను కల్పించేందుకు అంచనాలను రూపొందించారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ కమ్యూనిటీ కోఆర్డినేటర్ బోయినపల్లి రాధ, ఇంజనీర్ పెండ్లి ఉపేందర్‌రెడ్డి పాఠశాల విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ సామగ్రి, బోధన చార్టులను అందజేశారు. విద్యా బోధనలో అనుసరించాల్సిన వినూత్న ప్రక్రియల గురించి వారు వివరించారు. పిల్లలతో జంక్ ఫుడ్, కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.

ప్రొఫెసర్ అర్జున్‌రావుకు సన్మానం

కేయూ క్యాంపస్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర అర్కియాలజీ, మ్యూజియం నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ అర్జున్‌రావును మంగళవారం కేయూ వీసీ చాంబర్‌లో శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందచేసి సన్మానించారు. వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం అర్జున్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, హిస్టరీ విభాగాధిపతి డాక్టర్‌చిలువేరు రాజ్‌కుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, రిటైర్డు ప్రొఫెసర్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



క్రీడా దుస్తులు, డైరీలను విద్యార్థులకు ఇస్తున్న ఎంఈవో శ్రీనివాస్

హసన్‌పర్తి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల నిర్వాహణకు కృషి చేస్తున్నట్లు మండల విద్యా శాఖ అధికారి ఎ.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అనంతసాగర్ ఎంపీయూపీఎస్ పాఠశాల విద్యార్థులకు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు రవిందర్‌రెడ్డి ఆర్థిక సహాయంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు, డైరీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా ఎంఈవో, ఎల్లాపూర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సంపత్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల రక్షణ కోసం ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

హనుమకొండ చౌరస్తా, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాల రక్షణ కోసం నిరంతరం ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభలో రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మిక చట్టాల రక్షణ, ప్రభుత్వ వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు జరిపే ఇన్సూరెన్స్ స్కీంలను ప్రైవేటు కంపెనీలకు ఇచ్చే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించే వరకు నిరంతర పోరాటాలు చేయాలని రమేష్ కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు పాటు పడుతున్నాయని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పనిని 10 గంటలకు పెంచగా, కేంద్ర ప్రభుత్వం 12 గంటల పెంచుతుందని ఆయన మండిపడ్డారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఎన్నికలను నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఉప్పలయ్య, తాళ్ల సారంగపాణి, యాకయ్య, పెండ్యాల రవి, పుల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కుడా ఛైర్మన్‌ను కలిసిన హైర్ బస్‌ల కమిటీ



వెంకట్రాంరెడ్డిని సన్మానిస్తున్న హైర్ బస్సుల కమిటీ సభ్యులు

హనుమకొండ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రీజియన్ పరిధిలోని టీజీఎస్ఆర్టీసీ హైర్ బస్సుల పార్కింగ్ స్థలం కేటాయించడంపై కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డిని మంగళవారం హైర్ బస్ వెల్ఫేర్ అసోసియేషన్ రీజియన్ అధ్యక్షుడు మారుపెల్లి రాంరెడ్డి ఆధ్వర్యంలో కలిసి ఇనగాల వెంకట్రాంరెడ్డి వారి నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు. హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవచారి గ్రౌండ్‌ను దీపావళి పర్వదినం తర్వాత పార్కింగ్ స్థలం కేటాయిస్తున్నట్లు ఇనగాల వెంకట్రాంరెడ్డి తెలిపినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైర్ బస్సుల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లక్కం ప్రభాకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం
8 అక్టోబరు 2025



ఫ్యాషన్

చిట్టిపొట్టి 'ప్రిన్సెస్'

వేడుకల్లో ఆడపిల్లలకు వేసే డ్రస్సులు వినూత్నంగా ఉండాలంటే ప్రిన్సెస్ గౌన్స్ ఎంచుకోవాలి. చూడముచ్చటగా కనిపించే ప్రిన్సెస్ గౌన్స్ నేడు ఎన్నో రకాల డిజైన్లలో రూపొందుతున్నాయి. ఈ తాజా ట్రెండ్ మీద ఓ లుక్కేద్దాం!

చిట్టిపొట్టి గౌన్లకు బదులుగా పాదాల వరకూ పొడవుగా ఉండే ప్రిన్సెస్ గౌన్స్.. నెట్టెడ్, ఎంబ్రాయిడరీ, ఫ్యూజన్.. ఇలా ఎన్నో రకాల డిజైన్లలో రూపొందుతున్నాయి. పలు రకాల సెక్విన్లు, పూసలు, జరీ వర్క్‌లతో తయారవుతున్న ఈ గౌన్స్ అన్ని రకాల వేడుకలకూ అనువుగా ఉంటాయి. అయితే ప్రిన్సెస్ గౌన్స్‌లో ఆడపిల్లలు రాకుమారిలా వెలిగిపోవాలంటే ఇంకొన్ని హంగులు కూడా జోడించాలి. అవేంటంటే...


- మెరుపులు చిందించే శాండిల్స్ ఎంచుకోవాలి. అయితే హీల్ లేకుండా చదునుగా ఉండేవైతే పిల్లలు సౌకర్యంగా నడవగలుగుతారు
- ప్రత్యేకించి పిల్లల కోసం కూడా సౌందర్య సాధనాలుంటాయి. కాబట్టి సున్నితమైన చర్మాలకోసం తయారైన మేకప్ ఉత్పత్తులనే ఎంచుకోవాలి
- గౌన్ అసౌకర్యంగా లేకుండా చూసుకోవాలి. మరీ ముఖ్యంగా గౌన్ లోపలి వైపు సుతిమెత్తని మెటీరియల్ లైనింగ్ ఉండేలా చూసుకోవాలి
- పిల్లల కోసమే ప్రత్యేకంగా తయారయ్యే హ్యాండ్ బ్యాగ్స్ కూడా దొరుకుతాయి. గౌన్‌తో హ్యాండ్ బ్యాగ్ కూడా మ్యాచ్ అయ్యేలా చూసుకోవాలి
- వాచ్‌ను ఇష్టపడే పిల్లల కోసం క్రిస్టల్స్‌తో తయారైన డయల్, స్ట్రాప్ కలిగిన వాచీని ఎంచుకోవాలి.



ప్రతిభ ఏ మూలన ఉన్నా, ప్రపంచం నలుమూలలకూ వ్యాపిస్తుంది. ఇందుకు పరమ్‌జీత్ కౌర్ ఉదంతమే ఉదాహరణ. పంజాబ్‌లోని మోగాకు చెందిన ఈ 19 ఏళ్ల అమ్మాయి... యువ ర్యాపర్‌గా సంగీతాభిమానుల మనసులు చూరగొంటోంది. 'దట్ గర్ల్' పాటతో లేడీ మూసేవాలాగా పేరు తెచ్చుకుంటున్న పరమ్ గురించి మరిన్ని వివరాలు...

ఈ యువ ర్యాపర్ కథే వేరు

తల్లి ఇళ్లలో పనులు చేస్తూ ఉంటుంది. తండ్రి రోజువారీ కూలీ. తమకొచ్చే కొద్దిపాటి సంపాదనతో కూతుర్ని వృద్ధిలోకి తీసుకురావాలన్నది వాళ్ల కల. తమ కష్టానికి ఎప్పటికైనా ప్రతిఫలం దక్కుతుందనీ, భగవంతుడు ఎప్పటికైనా కరుణిస్తాడనీ ఆశపడిన ఆ నిరుపేద తల్లిదండ్రుల కలలు ఎట్టకేలకు ఫలించాయి. కాలేజీలో ఇంటర్ చదువుకుంటున్న 19 ఏళ్ల పరమ్‌జిత్ కౌర్ చదువులోనే కాదు, సంగీతంలో కూడా ప్రతిభ కనబరచడం మొదలుపెట్టింది. మొదట్లో ఇంట్లో కూని రాగాలు తీస్తూ, లల్లాయి పాటలు పాడుకుంటూ ఉండేది. ఆమెది అదురు బెదురులేని నైజం. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ఆమె పాటల్లో ధ్వనించడం గమనించిన తల్లితండ్రులు పరమ్‌ను మరింత ప్రోత్సహించారు. కానీ వాటికెలా ఒక రూపాన్నివ్వాలో, ఏ జోనర్‌లోకి చేర్చాలో పరమ్‌కు తెలియదు. అదే సమయంలో కాలేజీలో తన స్నేహితులు, తోటి విద్యార్థులు పాటలు రాస్తూ పాడుతూ ఉండడం పరమ్ గమనించింది. వాటి ద్వారా తాను ఎంచుకున్న శైలిని 'ర్యాప్' అంటారనే విషయాన్ని గ్రహించింది. అలా పాటలు రాస్తూ, పాడడం మొదలుపెట్టింది. అలా ఆమె ప్రతిభ ఇంగ్లండ్‌కూ పాకింది. అక్కడ స్థిరపడిన రికార్డ్ ప్రొడ్యూసర్ మన్ని సంధు... పరమ్ పాటలు విని వాటిని రికార్డు చేసి ప్రపంచానికి వినిపించాలనే ఆలోచనతో పంజాబ్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి పరమ్ కథ ఊహించని మలుపు తిరిగింది.



సాదాసీదాగా మొదలై...

"దట్ గర్ల్ పాటను మేమెలాంటి ఖరీదైన ఆధునిక స్టూడియోలోనూ రికార్డు చేయలేదు. రికార్డింగ్ కోసం ఒక సాధారణ హోటల్ గదిని ఎంచుకున్నాం. కాబట్టే పాటలో కార్ల హారన్ల మోతలూ, అరుపులూ వినిపిస్తూ ఉంటాయి. ఆ తర్వాత నేను ఆ పాటను స్టూడియోకు తీసుకువెళ్లి చిన్న చిన్న మెరుగులు దిద్దాను. అలాగే మ్యూజిక్ వీడియో కోసం నిపుణులైన వీడియోల రూపకర్తలను సంప్రతించాం. వీడియో ఎలా ఉండాలని కోరుకుంటున్నామో వివరించాం. మా ఆలోచన ఆధారంగా వాళ్లు అద్భుతమైన వీడియో రూపొందించారు. ఇప్పుడీ పాటకు ఇంత ఆదరణ దక్కడం ఎంతో సంతోషంగా ఉంది. పరమ్ విజయానికి ఇది ఆరంభం మాత్రమే!" అంటూ పరమ్ తొలి ర్యాప్ సాంగ్ 'దట్ గర్ల్' రికార్డింగ్ గురించి వివరించాడు రికార్డ్ ప్రొడ్యూసర్ మన్ని సంధు. స్వతంత్ర లేబుల్‌తో విడుదలైన 'దట్ గర్ల్' పాట నేడు యువతను ఉర్రూతలూగిస్తోంది. విడుదలైన 11 రోజుల్లోనే యూట్యూబ్‌లో ఆరు లక్షల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా పరమ్‌జిత్ కౌర్ ఫాలోవర్ల సంఖ్య నాలుగున్నర లక్షలకు పెరిగిపోయింది.



లేడీ మూసేవాలా...

ప్రత్యేకించి 'దట్ గర్ల్' పాటలోని శక్తివంతమైన లిరిక్స్ అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. గతంలో హత్యకు గురైన ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధు మూసేవాలా పాటలను మరిపిస్తూ ఉండడంతో ఇప్పుడు అందరూ పరమ్‌ను 'లేడీ మూసేవాలా' అని సంబోధించడం మొదలుపెట్టడం విశేషం. తన విజయం గురించి మాట్లాడుతూ... "ఇదంతా యాదృచ్ఛికంగా జరిగిపోయింది. ఈ పాట ఇంత విజయం సాధిస్తుందని నేను ఊహించలేదు. నాకసలు ర్యాప్ అంటే ఏంటో కూడా తెలియదు. కానీ స్నేహితుల ద్వారా నా పాటలకొక శైలి ఉన్నట్టు తెలుసుకున్నాను. పాటలతో వచ్చే ఆదాయంతో నా కుటుంబాన్ని ఆదుకోవాలనుకుంటున్నాను. అమ్మానాన్నల కోసం ఒక అందమైన ఇల్లు నిర్మించాలనే ఆలోచన ఉంది" అంటున్న పరమ్ మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుందాం!

వినూత్నం



కరువుకు, వలసలకు నిలయమైన రాయలసీమలోని ఓర్వకల్లు ప్రాంతాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చారు బత్తుల విజయభారతి. పేద మహిళలను పొదుపుబాట పట్టించారు. వందల కోట్ల రూపాయల లావాదేవీలు సాగించే స్థాయికి ఎదిగేలా ప్రేరణనిచ్చారు. ముప్పయ్యేళ్ల క్రితం ఆమె నాటిన పొదుపు విత్తనం మహా వృక్షంగా మారి, వేలాది మందికి ఆధారంగా నిలుస్తోంది ఓర్వకల్లు మండలం పొదుపులక్ష్మి ఐక్య సంఘం గౌరవ సలహాదారు విజయభారతి కథ... ఆమె మాటల్లోనే...

ఆ పొదుపు పాట ప్రార్థనా గీతమైంది!

"అది 1995 ఆగస్టు నెల. యూఎన్‌డీపీ (ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం) చేపట్టిన దక్షిణాసియా పేదరిక నిర్మూలన కార్యక్రమం తరఫున ప్రాజెక్టు ఆఫీసరుగా కర్నూలు జిల్లాకు వచ్చాను. నాకు ఆ ప్రాంతం గురించి ఏ మాత్రం అవగాహన లేదు. మా కార్యక్రమంలో మహిళలను ఎలా భాగస్వాముల్ని చేయాలి? పల్లెలకు వెళ్లి చెబితే... నా మాటలు వింటారా? ఒక బృందంగా కలిసి నడుస్తారా? ఇవన్నీ ఆ రోజు నా మదిలో మెదిలిన ప్రశ్నలు. ఆ సమయంలో అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు నంద్యాలలో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి నేనూ వెళ్లాను. అక్కడ ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు నాకు పరిచయమయ్యారు. వారి ఊరికి వస్తానంటే... ఆప్యాయంగా ఆహ్వానించారు. రెండు రోజుల తరువాత ఆ గ్రామం వెళ్లి, ఆ మహిళలను కలిశాను. ఆ తరువాత క్రమం తప్పకుండా అక్కడికి వెళ్లేదాన్ని. రోజూ పదిమంది మహిళలను కలిసి, పొదుపు ఆవశ్యకతను వివరించేదాన్ని. "రోజంతా కష్టపడితే నాలుగు రూకలు కావడంలేదు. రోజుకో రూపాయి పొదుపు అంటే ఎలాగమ్మా?" అంటూ మొదట్లో వాళ్లు పట్టించుకోలేదు. ఈలోగా అప్పటి సీఎం చంద్రబాబు పొదుపు ఉద్యమాన్ని ఊరూరుకీ తీసుకువెళ్లారు. దాంతో... పది మహిళలను ఒప్పించి తొలి పొదుపు సంఘం ఏర్పాటు చేయగలిగాను. అనంతరం ఉశేనాపురం గ్రామం వైపు అడుగులు వేశాను. అలా 25 గ్రామాల్లో పొదుపు ఉద్యమ స్ఫూర్తిని రగిలించగలిగాను.

సామాజిక అంశాలపై దృష్టి

మహిళలను రోజుకో రూపాయి పొదుపు ఉద్యమ బాటలో నడిపించాలంటే.. పల్లెసీమల్లో పట్టిపీడిస్తున్న సమస్యల మీద దృష్టి పెట్టడం ముఖ్యమని నిర్ణయించాం. తల్లులు పనికి వెళ్తే.... వారి పసిపిల్లల ఆలనాపాలన చూసేలా... ఆయాలను నియమించి, 'అమ్మఒడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. బాల్య వివాహాలను అరికట్టడం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలికల విద్య, ఒంటరి మహిళలకు చేయూత, విద్య, ఆరోగ్యం, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, మరుగుదొడ్ల నిర్మాణం... ఇలా సామాజిక అంశాలపై కూడా చైతన్యం కలిగించాం. అప్పటి జిల్లా కలెక్టరుతో మాట్లాడి, వితంతువులు, భర్తలు వదిలేసిన మహిళల కోసం కాల్వ గ్రామంలో 'జీవన జ్యోతి కాలనీ' నిర్మించాం. వివిధ గ్రామాల్లో 2,500 మంది బాల కార్మికులను గుర్తించి, వారి కోసం 'భవిత బాల కార్మికుల పాఠశాల'ను ఏడేళ్లు నిర్వహించాం. చదువుతో పాటు ఏపీ రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో సీట్లు వచ్చేలా శిక్షణ ఇప్పించాం. ఆ పిల్లలు జీవితంలో స్థిరపడేంత వరకు చదివించాం. వాళ్లలో వంద మంది నర్సులు, ముగ్గురు డాక్టర్లు, 24 మంది ఇంజనీర్లు, ఇద్దరు ఎస్ఐలు ఉన్నారు. పలువురు ఉపాధ్యాయులుగా కంప్యూటర్ ఆపరేటర్లుగా స్థిరపడ్డారు. 2000 సంవత్సరంలో మహిళల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన కోసం 'సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ' (సెర్ప్)ని నాటి సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారు. అది దేశంలోనే తొలి ప్రయోగం. దాని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలతో పనిచేసే అవకాశం కలిగింది. ఆ సమయంలో 'జీవితాన వెలుగుందని నమ్మకాన్ని పెంచుదాం...' అనే పాట రాశాను. ఇప్పుడు అది రెండు తెలుగు రాష్ట్రాల్లో పొదుపు మహిళల ప్రార్థన గీతం అయ్యింది. 'సెర్ప్'ను దేశంలోని అన్ని రాష్ట్రాలు 'స్టేట్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్' (ఎస్ఆర్ఎల్ఎం) పేరిట అమలు చేయడంలో కర్నూలు జిల్లాకు దివంగత మాజీ గవర్నర్ పెండేకంటి వెంకట సుబ్బయ్య కుమారుడు సీనియర్ ఐఏఎస్ అధికారి విజయకుమార్ కృషి ఎంతో ఉంది.

బోధన నుంచి నుంచి పొదుపు ఉద్యమం వైపు



మా స్వస్థలం ప్రకాశం జిల్లా ఒంగోలు. నాన్న బి.రామయ్య సమాచార, ప్రజా సంబంధాల శాఖలో జిల్లా పీఆర్‌వోగా, అమ్మ పి. అంజిమ్మ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేసి, రిటైర్ అయ్యారు. నేను ఎంఈడీ పూర్తి చేసి... నెల్లూరు జిల్లా ఉదయగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరాను. నా చెల్లెళ్లలో భవాని డాక్టరుగా, రమా సుందరి గుంటూరు పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. తమ్ముడు శ్రీనివాస్ చక్రవర్తి యూఏఈలో స్థిరపడ్డాడు. నేను లెక్చరర్‌గా పని చేస్తున్న సమయంలో 1991లో సంపూర్ణ అక్షరాస్య కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. నన్ను రిసోర్స్ పర్సన్‌గా తీసుకున్నారు. ఆ తరువాత డ్వాక్రా (పొదుపు) ఉద్యమానికి అప్పటి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమంలో నేను చురుగ్గా పాల్గొనడంతో... నెల్లూరు జిల్లా డీఆర్‌డీఏ పీడీ సతీశ్ చంద్ర సూచన మేరకు నాటి కలెక్టరు ఎం.సాంబశివరావు నన్ను డీఆర్‌డీఏ డ్వాక్రా ప్రాజెక్టు ఆఫీసర్‌గా నియమించారు. అలా బోధన నుంచి పొదుపు ఉద్యమ బాట పట్టాను. నెల్లూరు జిల్లా లేగుంటపాడు గ్రామంలో... తొలి రూపాయి పొదుపు కార్యక్రమం మొదలు పెట్టాం. ఆ తరువాత కుప్పంలో మూడు నెలలు పని చేశాను. అదే సమయంలో యూఎన్‌డీపీ పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద కర్నూలు జిల్లాలో ఏడు మండలాలు ఎంపికయ్యాయి. అలా... ప్రాజెక్టు ఆఫీసరుగా ఓర్వకల్లుకు వచ్చాను.

రూ.395 కోట్లు టర్నోవర్

కాల్వ గ్రామంలో పది మందితో ఒక సంఘంగా మొదలైన పొదుపు ఉద్యమం ఊరూరా విస్తరించింది. 1998లో 500 పొదుపు సంఘాలతో... 5 వేల మందితో ఏర్పాటైన 'ఓర్వకల్లు మండలం పొదుపు లక్ష్మి ఐక్య సంఘం' పరిధిలో... ప్రస్తుతం 1,250 సంఘాలున్నాయి. 12,500 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వ కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ రూ.1.20 కోట్లు, యూఎన్‌డీపీ ప్రాజెక్టు సీడ్ క్యాపిటల్ రూ.30 లక్షలు కలిపి ఐక్య సంఘానికి రూ.1.50 కోట్ల నిధి చేకూరింది. ఆ డబ్బును పొదుపు సంఘాలకు 12 శాతం వడ్డీకి అప్పులు ఇవ్వడం, ఇచ్చిన అప్పు సకాలంలో వసులు చేయడం ద్వారా ఐక్య సంఘం నిధి దాదాపు రూ.5.50 కోట్లకు చేరింది. మహిళలే సొంతంగా 'మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ' (మహిళా బ్యాంక్) ఏర్పాటు చేశారు. రూపాయి పొదుపుతో మొదలు పెట్టిన ఈ సంఘాలు సుమారు రూ.395 కోట్ల టర్నోవర్‌కు చేరాయంటే మహిళలు సాధించిన విజయమే. వారు 3.75 ఎకరాల్లో మండల ఐక్య సంఘం సొంత ఆఫీసు, 15 గ్రామాల్లో గ్రామ సమాఖ్య ఆఫీసులు నిర్మించుకున్నారు. మా ఓర్వకల్లు మండలం పొదుపు లక్ష్మి ఐక్య సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. 'నేషనల్ రిసోర్స్ ఆర్గనైజేషన్' హోదా ఇచ్చింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళలకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడమే కాదు... గ్రామ, మండల సమాఖ్య లీడర్లు సీఆర్‌పీలుగా పలు రాష్ట్రాలకు వెళ్లి సుమారుగా 50 వేల మంది శిక్షణ ఇచ్చారు. శ్రీలంక, ఇటలీ, మాల్దీవులు, నేపాల్ తదితర దేశాలకు వెళ్లి, అక్కడి జీవన ప్రమాణాలపై అధ్యయనం చేసే స్థాయికి ఓర్వకల్లు మహిళలు చేరుకున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన పీ-4 కార్యక్రమంలో భాగంగా మా మండల ఐక్య సంఘం ద్వారా పది కుటుంబాలను ఎంపిక చేశాం. పేదరికం వల్ల విద్యకు దూరం అవుతున్న పిల్లలు, జబ్బుల బారిన పడి వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేని ఐదు కుటుంబాలకు తొలి విడతగా ఆర్థిక చేయూత అందించాం. వారి పిల్లల చదువు బాధ్యతలు మండల సమాఖ్య తీసుకుంది. అయిదేళ్లలో వంద కుటుంబాలకు పీ-4 కింద చేయూత ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం."

• గోరంట్ల కొండప్ప కర్నూలు
ఫోటోలు : ఎస్ఎండీ రఫీ

డి విటమిన్ కోసం...

ఎముకలు, కండరాల బలోపేతానికి; గోర్లు, దంతాల సంరక్షణకు; మధుమేహం నివారణకు, రక్తపోటును నియంత్రించేందుకు, రోగనిరోధక శక్తికి డి విటమిన్ అత్యవసరం. అలాంటి డి విటమిన్.. శరీరానికి సహజసిద్ధంగా ఎలా లభిస్తుందో తెలుసుకుందాం...

- రోజూ శరీరానికి నువ్వుల నూనెతో మర్దన చేసుకుని పావు గంట సేపు ఎండలో నిలబడితే శరీరానికి కావాల్సిన డి విటమిన్ సులభంగా లభిస్తుంది.
- పుట్టగొడుగులు, కోడిగుడ్డు పచ్చ సొన, రెడ్ మీట్, నల్ల నువ్వులు, నెయ్యిలో డి విటమిన్ అధికంగా ఉంటుంది. వీటిని తరచూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మంచి ప్రయోజనం చేకూరుతుంది.
- సాల్మన్, ట్యూనా, మాకెరెల్ లాంటి చేపలతో తయారుచేసిన వంటకాలు తినడం వల్ల కూడా శరీరానికి డి విటమిన్ అందుతుంది.
- పాలు, పెరుగు, జున్ను, సోయా పాలు, నారింజ పండ్లు, ఓట్స్ తీసుకోవడం వల్ల శరీరానికి డి విటమిన్ లభిస్తుంది.
- తరచూ గోధుమలు, రాగి, బార్లీ లాంటి తృణధాన్యాలను ఆహారంలో చేర్చుకుంటూ ఉంటే శరీరంలో డి విటమిన్ లోపం తలెత్తదు.



ఇలా చేస్తే జిడ్డు మరకలు మాయం!

వంటగదిలో తరచూ జిడ్డు మరకలు ఏర్పడుతూ ఉంటాయి. వంట చేసేటప్పుడు స్టవ్ మీద, దాని వెనక గోడపై నూనె చింది జిడ్డు పేరుకుంటూ ఉంటుంది. చిన్న చిట్కాలతో ఈ జిడ్డు మరకలను ఎలా మాయం చేయాలో తెలుసుకుందాం...

- ఒక గిన్నెలో రెండు చెంచాల కాఫీ పొడి, రెండు చెంచాల డిష్‌వాష్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని జిడ్డు మరకల మీద రాసి పది నిమిషాలు నాననివ్వాలి. తరువాత నీళ్లు పోసి కడిగేస్తే జిడ్డు తొలగిపోతుంది.
- జిడ్డు పేరుకున్న చోట కొద్దిగా ఉప్పు లేదా కార్న్‌ఫ్లోర్ చల్లి అరగంట తరువాత పలుచని గుడ్డతో తుడిచేస్తే ఫలితం కనిపిస్తుంది.
- జిడ్డు మరకలపై బియ్యం కడిగిన నీళ్లు చల్లి బ్రష్‌తో రుద్ది ఆపైన మంచినీళ్లతో కడిగేస్తే చాలు... జిడ్డు పూర్తిగా వదులుతుంది.



- అరగ్లాసు గోరువెచ్చని నీళ్లలో ఒక చెంచా డిష్ వాష్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని జిడ్డు పేరుకున్న ప్రాంతంలో చల్లి, పావు గంట తరువాత పాత గుడ్డతో తుడిచేస్తే మరకలన్నీ మాయమవుతాయి.
- ఒక పాత బాటిల్‌లో వైట్ వెనిగర్, నీటిని సమభాగాలుగా తీసుకుని బాగా కలపాలి. ఈ ద్రావణాన్ని జిడ్డు మరకల మీద పిచికారీ చేసి పది నిమిషాల తరువాత స్పాంజ్‌తో తుడిచేస్తే సరిపోతుంది.
- నిమ్మచెక్క మీద కొద్దిగా ఉప్పు వేసి దాంతో గట్టిగా రుద్దితే తేలికపాటి జిడ్డు మరకలు వదిలిపోతాయి.

చెట్టునిండా గులాబీలు పూయాలా..?

నేలమీదే కాదు మిద్దె తోటల్లో, బాల్కనీ కుండీల్లో కూడా చక్కగా పెరిగి గుత్తులుగా పువ్వులు పూసే మొక్క గులాబీ. అందరూ ఇష్టపడే రంగురంగుల గులాబీలు ఏడాదంతా పూయాలంటే ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...

- రోజుకు కనీసం ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు ఎండ తగిలేలా ఏర్పాటు చేసుకుంటే గులాబీ మొక్క గుబురుగా పెరుగుతుంది. అలాగే మొక్కకు బాగా గాలి ఆడేలా చూసుకోవాలి. అప్పుడే మొగ్గలు ఎక్కువగా వస్తాయి.
- గులాబీలు ఎక్కువగా పూయాలంటే మట్టి పోషకాలతో నిండి ఉండాలి. నేలలో లేదా కుండీలో తగినంత తోటమట్టి, కొద్దిగా ఇసుక కలిపితే మొక్క మొదట్లో నీరు నిలవకుండా ఉంటుంది. దీంతో వేర్లు బలంగా పెరుగుతాయి. మట్టిలో తరచూ వర్మీ కంపోస్టు, కోకో పీట్ కలుపుతూ ఉంటే మొక్క ఆరోగ్యంగా పెరుగుతుంది. కొత్త చిగుర్లు వచ్చి చక్కగా పువ్వులు పూస్తాయి.
- గులాబీ మొక్కలకు ఉదయం వేళల్లోనే నీళ్లు పోయడం మంచిది. మరీ ఎక్కువగా కాకుండా మట్టి తడిసేలా నీళ్లు చిలకరిస్తే చాలు. ఆకులను నీటితో తడపకూడదు. అలా చేస్తే ఆకులకు తెగుళ్లు వచ్చే అవకాశం ఏర్పడుతుంది. వేసవిలో మట్టి పూర్తిగా ఎండిపోకుండా, వర్షాకాలంలో మొక్క మొదట్లో నీళ్లు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పువ్వులు రాలిన తరువాత ఒక అంగుళం మేర ఆ కొమ్మలను కత్తిరించాలి. అప్పుడే అక్కడి నుంచి కొత్త చిగుర్లు, మొగ్గలు వస్తాయి.
- ఆర్నెల్లకోసారి గులాబీ మొక్కల మీద కొద్దిగా వేపనూనెను పిచికారీ చేస్తే చీమలు, ఇతర పురుగులు, చీడలు చేరకుండా ఉంటాయి. అలాగే మట్టిలో కొద్దిగా వేప పొడి కలపడం వల్ల వేర్లు సురక్షితంగా ఉంటాయి.



- వాడేసిన కాఫీ లేదా టీ పొడి, కోడిగుడ్డు పెంకులు, ఉల్లిపాయ తొక్కలు, నిమ్మతొక్కలను మొక్క మొదట్లో ఉన్న మట్టిలో కలపడం వల్ల మంచి ప్రయోజనం కనిపిస్తుంది. ఒక గ్లాసు నీళ్లలో కొన్ని పాలు లేదా మజ్జిగ కలిపి అందించినా మొక్క ఆరోగ్యంగా పెరిగి చక్కగా గులాబీలు పూస్తాయి.

44 ఏళ్ల అజ్ఞాతానికి వీడ్కోలు

» పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టు రూబెన్

» రూ.8 లక్షల రివార్డు అందజేసిన వరంగల్ సీపీ


వివరాలు వెల్లడిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్, చిత్రంలో లొంగిపోయిన మావోయిస్టు రూబెన్

వరంగల్ క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తూ 44 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న మంద రూబెన్ అలియాస్ కన్నన్న, మంగన్న, సురేశ్ లొంగిపోయాడని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. రూబెన్ తన ఎదుట లొంగిపోయాడని మంగళవారం మీడియాకు సీపీ తెలిపారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్ వాసి మంద రూబెన్ 1979లో నాటి ఆర్‌ఈసీ మెస్ విభాగ ఉద్యోగిగా.. మావోయి స్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు పిలుపుతో అజ్ఞాతంలోకి వెళ్లినప్పటి నుంచి అజ్ఞాతంలో ఉన్న రూబెన్ 1991లో అనారోగ్యంతో చికిత్స కోసం కొత్తగూడెం వెళుతుండగా చత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేసి జగదల్పూర్ జైలుకు తరలించారు. ఏడాది తర్వాత రూబెన్ మరో ముగ్గురు ఖైదీలతో కలిసి జైలు నుంచి తప్పించుకుని అజ్ఞాతంలోనే పని చేస్తున్నా 2005లో అనారోగ్యానికి గురైనప్పటి నుంచి బీజాపూర్ జిల్లా గుండ్రాయిలో ఉంటూ మావోయిస్టులకు సహకరిస్తున్నాడు. ఆరోగ్యం సహకరించక ప్రస్తుతం పోలీసులకు లొంగిపోయాడు. రూబెన్‌పై ఉన్న రూ.8లక్షల రివార్డును అందజేశామని సీపీ తెలిపారు.

కదులుతున్న రైలు నుంచి అన్నదమ్ముల తోసివేత

» తమ్ముడి మృతి, అన్న పరిస్థితి విషమం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ వెళుతున్న దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ నుంచి ఇద్దరు అన్నదమ్ముల్ని తోటి ప్రయాణికుడొకరు తోసేశాడు. ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన ఈ ఘటనలో తమ్ముడు అక్కడికక్కడే మరణించగా... అన్న పరిస్థితి విషమంగా ఉంది. సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ - బయరాగడ్ హుజూర్ వాసులు అజయ్ రాంచంద్ర చంద్వాని (33), హర్ష్ చంద్వాని(30) అనే సోదరులు సికింద్రాబాద్ నుంచి మంగళవారం తెల్లవారుజామున బయలుదేరిన దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగిలో ప్రయాణిస్తున్నారు. ప్రయాణికుల మధ్య గొడవ జరిగినప్పుడు బోగి తలుపు వద్ద కూర్చున్న ఈ ఇద్దరు అన్నదమ్ములను రైలు ఘట్‌కేసర్‌కు చేరుకునేముందు తోటి ప్రయాణికుడొకరు వెనక నుంచి తన్నడంతో రైలు నుంచి కింద పడ్డారు. వెంటనే మరో ప్రయాణికుడు చైన్ లాగి రైలును ఆపారు. కింద పడ్డ అన్నదమ్ముల్లో హర్ష్ అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన రాంచంద్రను గాంధీ ఆస్పత్రికి తరలించగా, ప్రస్తుతం కోమాలో ఉన్నాడు. ఈ ఘటనలో సురేష్ అనే యువకుడిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు అతడి మానసికస్థితి సరిగా లేదని భావిస్తున్నారు.

కేసీఆర్, హరీశ్‌లపై చర్యలు వద్దన్న ఉత్తర్వులు పొడిగింపు

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను మంగళవారం హైకోర్టు పొడిగించింది. నివేదికలో ప్రస్తావించిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ సీఎస్ ఎస్కే జోషి, ఐఏఎస్ స్మితా సభర్వాల్‌లపై నవంబరు 12 వరకు ఎలాంటి చర్యలు తీసుకోకూడదని ఆదేశించింది. వారి పిటిషన్లపై కౌంటర్లు దాఖలు చేయడానికి మరింత సమయం ఇవ్వాలని ఏజీ సుదర్శన్ రెడ్డి కోరారు. దాంతో నవంబర్ 12 వరకు గడువు ఇచ్చిన ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

ప్రభుత్వ స్థలాల్లో ఆయిల్‌పామ్ తోటలు!

» నీటిపారుదల, సింగరేణి, దేవాదాయ భూములపై ఆరా

» సాగుకు యోగ్యంగా ఉండే భూముల సేకరణకు చర్యలు

» ఉద్యానశాఖ ఆధ్వర్యంలో చేపట్టాలని ప్రభుత్వ నిర్ణయం

» సింగరేణి సీఎండీతో భేటీ కానున్న రాష్ట్ర ఉద్యానశాఖ డైరెక్టర్



హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం గణనీయంగా పెంచాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఒకవైపు రైతులను ప్రోత్సహిస్తూనే, మరోవైపు సాగుకు యోగ్యంగా ఉండే ప్రభుత్వ ఖాళీ స్థలాల్లోనూ ఆయిల్‌పామ్ తోటలు పెంచాలని నిర్ణయించింది. ఏ శాఖల పరిధిలో ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నాయి? సంబంధిత శాఖల అవసరాలకు అవి ఉపయోగపడుతున్నాయా? లేదా? వాటిలో సాగుకు యోగ్యంగా ఉన్న భూమి ఎంత? తదితర వివరాలు సేకరించి ప్రణాళిక తయారు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. ముఖ్యంగా సింగరేణి, దేవాదాయ, నీటిపారుదలశాఖ భూములపై దృష్టి సారించారు. సంబంధితశాఖల ఉన్నతాధికారులతో కలిసి సమగ్రంగా చర్చించే బాధ్యతను ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ భాషాకు అప్పగించారు. ఈ క్రమంలోనే ఒకటి, రెండు రోజుల్లో సింగరేణి సీఎండీ బలరామ్‌తో ఉద్యాన శాఖ అధికారుల బృందం భేటీ కానుంది. వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించిన విషయం విదితమే! రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలను ఆయిల్‌పామ్ సాగువైపు మళ్లించాలని ప్రభుత్వం దీర్ఘకాలిక లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం 2.72 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలు సాగులో ఉన్నాయి. రాబోయే మూడేళ్లలో సాగు విస్తీర్ణం 10 లక్షల ఎకరాలకు చేరాలనే లక్ష్యంతో అడుగులు వేస్తోంది. గడిచిన రెండేళ్లలో ఆశించిన ప్రగతి సాధించలేదని, మూడేళ్లలో లక్ష్యాన్ని పూర్తిచేయాలని మంత్రి తుమ్మల.. పామాయిల్ కంపెనీలు, ఆయిల్ ఫెడ్, ఉద్యానశాఖ అధికారులపై ఒత్తిడి పెంచారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొని 13 ప్రైవేటు కంపెనీలు ఆయిల్‌పామ్ తోటల విస్తరణ, గెలల ఉత్పత్తి, పరిశ్రమల ఏర్పాటు పనులు చేస్తున్నాయి. ఈక్రమంలోనే ప్రభుత్వ పరిధిలోని కెనాల్ బ్యాంక్(కాలువల ఒడ్డు, పరిసర ప్రాంతాలు) భూముల్లో కూడా ఆయిల్‌పామ్ మొక్కలు పెట్టాలని రాష్ట్ర ఉద్యానశాఖ ప్రయత్నాలు చేస్తోంది. ఉచితంగా మొక్కలు సరఫరా చేయాలని, తోట పెరిగి గెలలు ఉత్పత్తి అయిన తర్వాత, వాటిని కూడా ఉద్యానశాఖ ఆధ్వర్యంలోనే సేకరించాలని, పామాయిల్ మిల్లుల్లోనే గానుగ ఆడించాలని, వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని.. భూములిచ్చిన శాఖలకు ఇవ్వాలని ఉద్యానశాఖ ప్రతిపాదనలు రూపొందించింది.

భూములివ్వడానికి సింగరేణి సమ్మతం

భూముల అప్పగింత విషయమై తాజాగా మంత్రి తుమ్మల సింగరేణి సీఎండీ బలరామ్‌తో మాట్లాడారు. పెద్దపల్లి జిల్లాలో ఖాళీగా ఉన్న సింగరేణి భూములను అప్పగించాలని, ఆయిల్‌పామ్ తోటలు పెంచి ఆదాయం చూపిస్తామని చెప్పటంతో ఆయన అంగీకరించారు. పూర్తిస్థాయిలో చర్చించి ప్రణాళిక తయారుచేయటానికి సింగరేణి ఎండీ కార్యాలయానికి వెళ్లాలని ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ భాషాను ఆదేశించారు. అదే క్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్‌తో కూడా చర్చలు జరపాలని సూచించారు. దీంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో ఆయిల్‌పామ్ తోటలు పెంచే కార్యక్రమానికి కసరత్తు జరుగుతోంది. ఇదిలాఉండగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లిలో ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 18 ఎకరాల స్థలం ఉంది. పాఠశాల అవసరాలకు పోగా మిగిలిన భూమిలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కాగా ఖమ్మం జిల్లాలో ఉద్యానశాఖ పరిధిలో ఖాళీగా ఉన్న సుమారు 30 ఎకరాల భూమిలోనూ ఆయిల్‌పామ్ మొక్కలు నాటించారు.

గ్రూప్-1 అధికారుల చేతికి ఆస్పత్రుల పాలన!

(మొదటిపేజీ తరువాయి)

వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో వైద్యయేతర పాలన బాధ్యతలను అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే ఇటీవల కొత్తగా నియమితులైన గ్రూప్-1 అధికారుల్లో 20 మందిని వైద్య శాఖకు కేటాయించింది. వీరికి కొన్ని నెలల పాటు సాధారణ శిక్షణతోపాటు పాలన వ్యవహారాలపైనా తర్ఫీదు ఇవ్వనున్నారు. అనంతరం వారికి పోస్టింగ్‌లు కేటాయించనున్నారు.

వైద్యయేతర పాలన బాధ్యతలు

ప్రస్తుతం బోధనాస్పత్రుల్లో సూపరింటెండెంట్లే అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. సూపరింటెండెంట్ పర్యవేక్షణలో అడ్మినిస్ట్రేషన్, శాలరీలు, కొనుగోలు వ్యవహారాలు, బడ్జెట్ వంటి అంశాలను అడ్మిన్ ఆఫీసర్, అడ్మిన్ డైరెక్టర్ చూస్తుండగా, పారామెడికల్ సిబ్బందికి విధుల కేటాయింపు, వారిపై పర్యవేక్షణ, రోగుల చికిత్స వంటి అంశాలను ఆర్ఎంవోలు చూసుకుంటున్నారు. అయితే, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు ఎంత ముఖ్యమో, పారిశుధ్యం, రోగులకు ఆహారం, భద్రత, నిరంతర విద్యుత్ వంటి అంశాలు అంతే కీలకం. వెయ్యి కన్నా ఎక్కువ పడకలు ఉండే ఆస్పత్రుల్లో ఆయా అంశాలన్నింటినీ సూపరింటెండెంట్లు పర్యవేక్షించలేకపోతున్నారు. వారంతా వైద్యులు కావడంతో అడ్మినిస్ట్రేషన్‌పై అంతగా అవగాహన ఉండడం లేదన్న అభిప్రాయం ఎప్పటి నుంచో ఉంది. వాస్తవానికి బీఆర్ఎస్ హయాంలోనూ బోధనాస్పత్రుల పాలనను ఆర్డీవోలకు అప్పగించాలని నిర్ణయించినా.. వైద్యుల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో బ్రేక్ పడింది. ప్రస్తుతం వైద్యయేతర పాలన బాధ్యతలను మాత్రమే గ్రూప్-1 అధికారులకు అప్పగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆస్పత్రి ప్రాంగణం, వార్డుల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, రోగులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా డైట్ కాంట్రాక్టర్ల పనితీరును సమీక్షించడం, రోగులు, వైద్యుల భద్రతకు చర్యలు తీసుకోవడం, విద్యుత్, నీటి సరఫరా ఉండేలా చూడడం, రోగులకు వీల్ చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉంచడం, సహాయ కేంద్రాల పని తీరును మెరుగుపరచడం, రోగుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడం, ఆస్పత్రిలో ఫర్నిచర్, పరికరాల మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాల నిర్వహణ తదితర అంశాలను గ్రూప్-1 అధికారులు పర్యవేక్షించే అవకాశం ఉంది..

వైద్య సేవల్లో నాణ్యత పెరిగే అవకాశం

సర్కారు నిర్ణయం అమల్లోకి వస్తే విధానంతో సూపరింటెండెంట్లపై పని భారం గణనీయంగా తగ్గనుంది. తద్వారా వైద్య సేవల్లో నాణ్యతను పెంచడంపై వారు పూర్తి స్థాయిలో దృష్టి సారించే అవకాశం ఉంది. క్లిష్టమైన శస్త్ర చికిత్సలు, రోగులకు అందుతున్న చికిత్సా విధానాలు, పరిశోధనలు, వైద్య విద్యార్థులకు శిక్షణ వంటి కీలక అంశాలపై దృష్టి సారించడానికి ఈ మార్పు దోహదపడనుంది. ఫలితంగా రోగులకు మరింత నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలు అందనున్నాయి. పాలనలో శిక్షణ పొందిన అధికారులు ఈ బాధ్యతలు చేపట్టడం ద్వారా జవాబుదారీతనం పెరుగుతుందని, సేవల పనితీరులో స్పష్టమైన మార్పు వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. మొదటి దశలో 20 మంది అధికారులను నియమించిన ప్రభుత్వం.. వారి పనితీరును సమీక్షించి, భవిష్యత్తులో అన్ని జిల్లా ఆస్పత్రులకు ఈ విధానాన్ని విస్తరించాలని యోచిస్తోంది.

జస్టిస్ అభినందన్ కుమార్ శావిలికి
ఘనంగా వీడ్కోలు

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినందన్ కుమార్ శావిలికి న్యాయమూర్తులు, న్యాయవాదులు ఘనంగా వీడ్కోలు పలికారు. మంగళవారం మొదటి కోర్టు హాల్‌లో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో న్యాయవ్యవస్థకు జస్టిస్ శావిలి సేవలను చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి శ్లాఘించారు. పదేళ్ల సుదీర్ఘ సేవలందించిన ఆయన 30 వేలకు పైగా కేసులను పరిష్కరించారన్నారు. జస్టిస్ శావిలి హైదరాబాద్ భూమి పుత్రుడని, ఆయనకు నిజాం పాలన, హైదరాబాద్ స్టేట్ చరిత్రపై ఎంతో అవగాహన ఉందన్నారు. అనంతరం బార్ అసోసియేషన్‌లో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో జస్టిస్ శ్యాం కోషీ ప్రసంగిస్తూ.. జస్టిస్ శావిలి ఒక సంపూర్ణమైన వ్యక్తిత్వం కల అద్భుతమైన వ్యక్తి అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు న్యాయవాదిగా ఆయన ప్రారంభించబోయే నూతన ఇన్నింగ్స్ మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. జస్టిస్ శావిలి మాట్లాడుతూ.. తాను అనుకోకుండా న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించానని గుర్తుచేసుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీలో తన కంటే ముందు ర్యాంకు ఉన్న వ్యక్తి సీటు వదిలేస్తే తనకు ఆ స్థానం దక్కిందని చెప్పారు.

సీజేఐపై దాడికి న్యాయవాదుల నిరసన

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి నిరసనగా హైకోర్టు న్యాయవాదులతోపాటు వివిధ పార్టీల లీగల్‌సెల్ విభాగాల ప్రతినిధులు, ప్రజాసంఘాలు వేర్వేరుగా హైకోర్టు వద్ద మంగళవారం నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. చీఫ్ జస్టిస్ బెంచ్‌పై ఉండగా ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం న్యాయవ్యవస్థను అవమానించడమేనని, దీనిపై సమగ్రంగా దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేశాయి. ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, సీనియర్ న్యాయవాది వీ రఘునాథ్, న్యాయవాదులు చిక్కుడు ప్రభాకర్, సుంకరి జనార్దన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


గాలి మనీలాండరింగ్ కేసు
కొట్టివేతకు సుప్రీం నో!

» జేఎస్‌డబ్ల్యూ స్టీల్ పిటిషన్‌ను తోసిపుచ్చిన ధర్మాసనం

న్యూఢిల్లీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గాలి జనార్దన్‌రెడ్డి మైనింగ్ కుంభకోణంతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసును కొట్టివేయాలని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లిమిటెడ్, దాని డిప్యూటీ జీఎం ప్రవీణ్ జాన్ సెక్వేరా దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు మంగళవారం తోసిపుచ్చింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కుంభకోణంపై ఈడీ విచారణలో జోక్యం చేసుకోకూడదన్న కర్ణాటక హైకోర్టు తీర్పు సరైనదేనని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. ఈడీ మనీలాండరింగ్ చట్టం కింద ఏర్పాటైన అప్పిలేట్ ట్రిబ్యునల్ ముందే ఆస్తుల జప్తుపై తేల్చుకోవాలని సూచించింది.

చిత్రజ్యోతి
SINCE 1965

బద్రీనాథ్ ఆలయంలో రజనీ ప్రత్యేక పూజలు



ఆధ్యాత్మిక పర్యటన కోసం ఉత్తర భారతానికి వెళ్లిన తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్.. మంగళవారం ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని బద్రీనాథ్ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం అక్కడి నుంచి తనకు అత్యంత ఇష్టమైన బాబా గుహకు బయలుదేరి వెళ్లారు. అక్కడే ఆయన వారం రోజుల పాటు ధ్యానం చేస్తారని కోలీవుడ్ వర్గాలు తెలిపాయి.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కన్నడ దర్శకనిర్మాత హేమంత్ అరెస్టు



కన్నడ దర్శకుడు, నిర్మాత హేమంత్ కుమార్(34)ను లైంగిక వేధింపుల కేసులో పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. బిగ్‌బాస్ ఫేం, 'రిచ్చి' సినిమా నటి ఫిర్యాదు మేరకు ఆయనపై లైంగిక వేధింపులు, బెదిరింపుల కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. 2022లో బిగ్‌బాస్ ద్వారా పేరు సంపాదించిన ఓ యువతికి హేమంత్ కుమార్ పరిచయం అయ్యారు. తాను తీస్తున్న 'రిచ్చి' సినిమాలో నటించాలని ఆఫర్ ఇచ్చారు. ఆమెకు రూ.2 లక్షలు పారితోషికం ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుని, అందులో రూ.60 వేలు చెల్లించారు. అశ్లీల దుస్తులు ధరించాలని, అదే తరహాలో నటించాలని ఆమెపై హేమంత్ ఒత్తిడి తెచ్చారు. షూటింగ్ ముగిశాక ఆమెకు ఇచ్చిన పేమెంట్ చెక్ బౌన్స్ అయింది. డబ్బులు అడిగితే ప్రాణాలు తీస్తామని హేమంత్ బెదిరించారు. మధ్యవర్తుల జోక్యంతో 2023 ఆగస్టు 5న ముంబైలో జరిగిన సినిమా ప్రచారానికి నటి వెళ్లారు. ఆమె వాష్‌రూంకు వెళ్లి వచ్చేసరికే కూల్‌డ్రింక్‌లో హేమంత్ మత్తు మందు కలిపారు. అది తాగి స్పృహ కోల్పోయిన బాధితురాలిని అశ్లీలంగా వీడియోలు తీశారు. వాటిని చూపించి, లైంగిక చర్యలకు ఒప్పుకోవాలని, లేదంటే వీడియోలు బయట పెడతామని బెదిరించారు.. ఈ విషయమై తాను ఇప్పటికే ఫిల్మ్ ఛాంబర్‌లో ఫిర్యాదు చేశానని, మరో మార్గం లేక పోలీసులకు సమగ్ర వివరాలతో ఫిర్యాదు చేస్తున్నానని బాధితురాలు పేర్కొన్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

జాతరలో నా పాత్ర ప్రత్యేకం



రవితేజ

'ఈ చిత్రంలో నేను పోషించిన ఆర్‌పీఎఫ్ (రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్) అధికారి పాత్ర నా సినీ ప్రయాణంలో సరికొత్తది, ప్రత్యేకమైనది. చిత్ర దర్శకుడు భాను ప్రతిభావంతుడు. చిత్రీకరణ సమయంలో సన్నివేశాన్ని మరింత మెరుగ్గా మలచడానికి ప్రయత్నిస్తుంటాడు. అవసరమనుకొంటే వేగంగా మార్పులు చేయగల సామర్థ్యమున్నవాడు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతం అందించాడు' అని తెలిపారు హీరో రవితేజ. ఆయన కథానాయకుడిగా భాను భోగవరపు తెరకెక్కించిన చిత్రం 'మాస్ జాతర'. శ్రీలీల కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈనెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్‌లో భాగంగా చిత్రబృందం ఓ వీడియో సంభాషణలో పాల్గొంది. శ్రీలీల మాట్లాడుతూ 'సినిమాలో నేను సైన్స్ టీచర్‌గా, శ్రీకాకుళం యాసలో మాట్లాడే పల్లెటూరి అమ్మాయిగా కనిపిస్తాను. రవితేజకు వృత్తి పట్ల అంకితభావం ఎక్కువ. గాయంతో బాధపడుతున్నప్పటికీ 'తూ మేరా లవర్' పాటను పూర్తి చేసి తన నిబద్ధతను చాటుకున్నారు' అని కొనియాడారు. చిత్రదర్శకుడు భాను భోగవరపు మాట్లాడుతూ 'ఈ చిత్రానికి 'మాస్ జాతర' అనే టైటిల్‌ని రవితేజ సూచించారు. దానికి 'మనదే ఇదంతా' అనే ట్యాగ్‌లైన్‌ను జోడించాం. 'ఓలే ఓలే' పాట సాహిత్యాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు. పాట రెండో భాగం పూర్తి భిన్నంగా, పాజిటివ్ వైబ్‌ను కలిగి ఉంటుంది' అని చెప్పారు.

వాషింగ్టన్ సుందర్ తొలి గీతం



సత్య వినుగొండ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వాషింగ్టన్ సుందర్'. అనుశ్రీ, శీతల్ భట్ కథానాయికలు. మూవీ కార్పొరేషన్ బేనర్‌పై బీపేట ప్రేమ్ కుమార్ సమర్పణలో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొంది. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా చిత్రంలోని తొలి గీతాన్ని దర్శకుడు అనిల్ రావిపూడి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్య వినుగొండ మాట్లాడుతూ 'చిన్నప్పుడు తన సొంత ఊరుని వదిలి పారిపోయిన కుర్రాడు మళ్లీ 15 ఏళ్ల తర్వాత ఎందుకు తిరిగి వచ్చాడు? అనేది ఈ చిత్ర కథ' అని చెప్పారు.



తమిళ హీరో, 'తమిళగ వెట్రి కళగం' అధ్యక్షుడు విజయ్‌ను హీరోయిన్ శృతిహాసన్ ఓ జోకర్‌తో పోల్చారు. ఇటీవల జరిగిన కరూర్ తొక్కిసలాట వల్ల 41 మంది మరణించిన ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. 'ఓ జోకర్ సర్కస్‌కు వెళ్లడం వల్లే ఆ ఘోరం జరిగింది' అంటూ ఆమె తన ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. విజయ్ ఒక జోకర్..

విజయ్.. ఓ జోకర్

శృతిహాసన్

జోకర్‌గానే ఆయన నడుచుకున్నారని, అందువల్ల ఆయన్ని తప్పుపట్టరాదన్నారు. సర్కస్‌కు పోయిన వారినే వేలెత్తి చూపాలన్నారు. కాగా ఈ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. ఇదిలా వుండగా కరూర్ దుర్ఘటనలో మృతి చెందిన కొంతమంది కుటుంబీకులతో విజయ్ సోమవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జరిగిన నష్టం పూడ్చలేనిదని, కానీ జీవితాంతం తాను అండగా వుంటానని విజయ్ వారిని ఓదార్చారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)



ఫ్లవర్ లాంటి లవర్ ఉంటే...!

కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని దర్శకత్వంలో తెరకెక్కిన ఆద్యంతం వినోదాత్మక చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మాతలు. సినిమా ఈనెల 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రం నుంచి 'టిక్కల్ టిక్కల్...' అనే మూడో గీతాన్ని మేకర్స్ రిలీజ్ చేశారు. సురేంద్ర కృష్ణ రాసిన పాటకు చేతన్ భరద్వాజ్ స్వరాలు సమకూర్చారు. సాయి చరణ్ భాస్కరుని ఆలపించారు. 'టిక్కల్ టిక్కల్, ఢమాల్ ఢమాల్...కలిసి వచ్చే కాలం ముందు నువ్వు సూపర్ రా..టైమ్ కాస్త బ్యాడ్ అయితే కె ర్యాంప్ రా..ఫ్లవర్ లాంటి లవర్ ఉంటే లైఫ్ సూపర్ రా, ఫ్లవర్ కాస్త ఫైర్ అయితే కె ర్యాంప్ రా...' అంటూ సాగుతుందీ పాట.

భావోద్వేగాలున్న కథ

నీరజ కోన



"తెలుసుకదా' చిత్రంతో రచయిత్రిగా, దర్శకురాలిగా ఇండస్ట్రీకి పరిచయమవుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ప్రేమకథతో పాటు ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగాలున్న కథ ఇది. తప్పకుండా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన అన్నారు. సినీరంగంలో కాస్ట్యూమ్ డిజైనర్‌గా ఎంట్రీ ఇచ్చి అనతికాలంలోనే మంచి పేరు తెచ్చుకున్న ఆమె సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటించిన 'తెలుసుకదా' చిత్రంతో దర్శకురాలిగా మారారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం దీపావళి సందర్భంగా ఈనెల 17న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నీరజ కోన మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

- నేను దాదాపుగా వంద సినిమాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశాను. కానీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా మాత్రం పనిచేయలేదు. 12 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. ఆ అనుభవమే ఈ సినిమాకు చాలా వరకూ ఉపయోగపడింది. ఈ సినిమా కథను తొలుత నితిన్‌కు వినిపించాను. సిద్ధు ఈ సినిమాకు సూటవుతాడు అని చెప్పారు. సింగిల్ సిట్టింగ్‌లో కథను సిద్ధు ఓకే చేశారు. అవి నా జీవితంలో మరచిపోలేని క్షణాలు.
- బేసిగ్గా ఇదొక లవ్‌స్టోరీ. ప్రతి పాత్ర ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది. దర్శకురాలిగా కథను నిజాయితీగా చెప్పడం పైనే దృష్టి సారించాను. ఇందులో వరుణ్ పాత్రలో సిద్ధు నటన సినిమాకు ప్రత్యేకాకర్షణ.

మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు



నటుడు శ్రీకాంత్ కృష్ణస్వామి తన వివాదాస్పద వ్యాఖ్యలతో ఇప్పటికే పలుసార్లు వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన మహాత్మా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. తీవ్ర స్థాయిలో దూషించారు. గాంధీజీ స్త్రీ లోలుడని, ఎంతో మంది ఆడవారిని లైంగికంగా వేధించాడని తీవ్ర ఆరోపణలు చేశారు. స్వాతంత్ర్యం గాంధీ వల్ల కాదు సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్ వల్లే వచ్చిందని అన్నారు. ఈ వ్యాఖ్యలతో నెట్టింట పెద్ద దుమారమే రేగింది. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. మహాత్మాగాంధీ పుట్టిన రోజున కూడా శ్రీకాంత్ పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కాగా, సినీ తారలు ఇలా హద్దులు మీరి మాట్లాడడం, తరువాత నాలిక్కరుచుకోవడం ఓ అలవాటు అయిపోయిందని, మొన్న రాహుల్ రామకృష్ణ, నేడు శ్రీకాంత్.. ఇలా మాట్లాడేటప్పుడు సంయమనం పాటిస్తే బాగుంటుందనేదని అంటున్నారు.



దీపావళి ఎంటర్‌టైనర్

ప్రియదర్శి, నిహారికా ఎన్.ఎం జంటగా నటించిన చిత్రం 'మిత్రమండలి'. బన్నీ వాస్ సమర్పణలో కల్యాణ్ మంతెన, భాను ప్రతాప్, డా. విజయేందర్‌రెడ్డి తీగల నిర్మించారు. సోమరాజు పెన్మత్స సహ నిర్మాత. విజయేందర్ ఎస్ దర్శకుడు. దీపావళి సందర్భంగా ఈ నెల 16న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్ర బృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా బన్నీ వాస్ మాట్లాడుతూ "మిత్రమండలి' కథ నా మనసుకు బాగా నచ్చింది. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను నవ్విస్తుంది. సరికొత్త వినోదాన్ని పంచుతుంది. ఒక పరిపూర్ణ దీపావళి ఎంటర్‌టైనర్‌గా 'మిత్రమండలి' రూపుదిద్దుకుంది' అని చెప్పారు. ప్రియదర్శి మాట్లాడుతూ 'ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకోవాలనే లక్ష్యంతో 'మిత్రమండలి' సినిమా చేశాం. 'జాతిరత్నాలు' సినిమాకు రెట్టింపు నవ్వులు పంచుతుంది. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వబోతున్నాం. నలుగురు స్నేహితులు సరదాగా మాట్లాడుకుంటే ఎలాంటి ఆనందం కలుగుతుందో మా సినిమా కూడా అలాంటి అనుభూతిని ఇస్తుంది' అన్నారు. కథ వినగానే మిత్రమండలి సినిమా చేయాలనుకున్నాను, మొదటి సినిమాలోనే మంచి పాత్ర దక్కినందుకు ఆనందంగా ఉంది అని నిహారికా ఎన్.ఎం అన్నారు.

వినోదం.. సందేశం



వరుణ్ సందేశ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కానిస్టేబుల్'. మధులికా వారణాసి కథానాయిక. ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వంలో బలగం జగదీశ్ నిర్మించారు. ఈ నెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ 'సమాజంలో జరుగుతున్న కొన్ని అరాచక పోకడలను ఎత్తిచూపుతూ ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. వాణిజ్య హంగులతో పాటు వినోదం, సందేశం మేళవింపుగా దర్శకుడు తీర్చిదిద్దారు. నా తొలి చిత్రం 'హ్యాపీ డేస్' కూడా ఇదే నెల్లో విడుదలైంది. ఈ సినిమా కూడా ఆ స్థాయి విజయాన్ని అందుకోవాలి' అని ఆకాంక్షించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ట్రైలర్, పాటలకు వచ్చిన స్పందన సినిమాపై మా నమ్మకాన్ని పెంచింది' అని చెప్పారు. బలగం జగదీశ్ మాట్లాడుతూ 'ఒక యువతి జీవితంలో తలెత్తిన అనూహ్య సంఘటనల సమాహారంగా ఈ చిత్రం ఉండబోతోంది. కుటుంబం అంతా కలసి చూడాల్సిన సినిమా ఇది' అని అన్నారు.

కన్ఫర్మ్ టిక్కెట్లలో ప్రయాణ తేదీ మార్చుకోవచ్చు

- ఎలాంటి రుసుములు ఉండవు
- రైల్వే శాఖ నూతన సౌకర్యం
- జనవరి నుంచి అమలు
- ఆ రోజున టిక్కెట్ కన్ఫర్మ్‌పై మాత్రం గ్యారెంటీ ఉండదు



న్యూఢిల్లీ, అక్టోబరు 7: రైల్వే టిక్కెట్లు కన్ఫర్మ్ అయిన తరువాత ప్రయాణ తేదీని మార్చుకోవడం ఇప్పుడున్న పరిస్థితుల్లో అసాధ్యం. ఆ టిక్కెట్లను రద్దు చేసుకొని, కొత్తది తీసుకోవడం మినహా మార్గం లేదు. టిక్కెటును క్యాన్సిల్ చేసుకున్నందుకు కొంత సొమ్మును నష్టపోవాలి. కొత్తగా రిజర్వేషన్ చేయించుకుంటే మళ్లీ రుసుము చెల్లించాలి. ఇది ప్రయాణికులకు నష్టం కలిగిస్తుండడంతో రైల్వే శాఖ కొత్త విధానాన్ని అమలు చేయనుంది. టిక్కెట్ కన్ఫర్మ్ అయిన తరువాత కూడా ఎలాంటి రుసుములు తీసుకోకుండానే ప్రయాణ తేదీని మార్చుకునే అవకాశం కలిగించనుంది. ఇది జనవరి నెల నుంచి అమల్లోకి రానుంది. దీనిపై రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ మాట్లాడుతూ 'ప్రస్తుత విధానం అన్యాయమైనది. ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకున్నది కాదు' అని అన్నారు. అందువల్ల ప్రయాణికులకు మేలు కలిగించే విధానాలను అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. ఎలాంటి రుసుములు లేకుండానే ప్రయాణ తేదీని మార్చుకునే సౌకర్యం కలిగించనున్నట్టు తెలిపారు. అయితే మారిన రోజున టిక్కెట్ కన్ఫర్మ్ అవుతుందన్న గ్యారెంటీ ఉండదని, ఆ రోజున ఉండే సీట్ల లభ్యతకు అనుగుణంగా నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. ఆ రోజున అదనంగా టిక్కెట్లపై ఛార్జీ చెల్లించాల్సిన పరిస్థితి ఉంటే దాన్ని భరించాల్సి ఉంటుందని తెలిపారు. ఇవన్నీ ఆన్‌లైన్‌లోనే చేయాల్సి ఉంటుందని చెప్పారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎలక్ట్రిక్ వీల్‌చైర్లు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విమాన ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలను అందించే దిశగా, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (జీఎంఆర్) ఒక ముందడుగు వేసింది. ప్రయాణికుల కోసం అత్యాధునిక ఎలక్ట్రిక్ వీల్ చైర్లను ప్రవేశపెట్టినట్లు జీఎంఆర్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, వారికి సుఖవంతమైన ప్రయాణ అనుభూతిని అందించడానికి ఈ నూతన వీల్ చైర్లను ప్రవేశపెట్టారు. ఈ ఎలక్ట్రిక్ వీల్ చైర్లు ప్రయాణికుల చెక్ ఇన్ కౌంటర్ దాటిన తర్వాత అందుబాటులోకి వస్తాయి. డీఎఫ్ఎండీ పాయింట్ నుంచి బోర్డింగ్ పాస్ వరకు వీటిని వినియోగించుకోవచ్చు. ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే తమ లక్ష్యమని జీఎంఆర్ అధికారులు స్పష్టం చేశారు.



బీసీ రిజర్వేషన్ల జీవోను హైకోర్టు కొట్టివేస్తే దానికి బీజేపీదే బాధ్యత అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు ఒక్క శాతం తగ్గినా అగ్నిగుండమేనని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా రెడ్డి జాగృతి కుట్రలను నిరసిస్తూ మంగళవారం హైదరాబాద్‌లోని అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తాలోని మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద జరిగిన బీసీ సంక్షేమ సంఘం ధర్నాలో జాజుల మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ పరిరక్షణ కల్పించాలని 20 నెలలుగా బీసీ సమాజం ముక్తకంఠంతో కోరుతున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదని ఆరోపించారు. - అంబర్‌పేట

వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగం

- సాగులో పెట్టుబడిని తగ్గించడమే లక్ష్యం: శ్రీధర్ బాబు
- జర్మనీ సంస్థ 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్‌ఐ ప్రతినిధులతో భేటీ

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో టెక్నాలజీ వినియోగం పెరగాలని, ఈ విషయంలో తెలంగాణను అగ్రగామిగా నిలపాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పెట్టుబడి వ్యయం, రసాయనాల వినియోగాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే లక్ష్యమని చెప్పారు. సాగులో నూతన ఆలోచనలతో ముందుకొచ్చే ఆవిష్కర్తలను ప్రోత్సహిస్తామన్నారు. కృత్రిమ మేథ(ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ) లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌ను చిన్న, సన్నకారు రైతులకు ఎలా అనుసంధానం చేయాలనే అంశంపై మంగళవారం సచివాలయంలో జర్మనీకి చెందిన పరిశోధన సంస్థ 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్‌ఐ' ప్రతినిధుల బృందంతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో సుమారు 55% మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారన్నారు. కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌కు రాష్ట్రం గ్లోబల్ హబ్‌గా మారిందని, ఈ తరుణంలో డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను ఆదర్శంగా నిలపాలని సంకల్పించామన్నారు. రోజురోజుకూ వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం పెరుగుతోందని, పురుగు మందుల వినియోగం పెరగడంతో పర్యావరణానికి హానీ కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండింటి వినియోగాన్ని తగ్గించాలంటే కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌ను వ్యవసాయానికి అనుసంధానించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం టెక్నాలజీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తోందని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆరునూరైనా 'తుమ్మిడి హెట్టి' నిర్మిస్తాం!

బ్యారేజీ నుంచి 80 టీఎంసీల నీటిని తరలించడమే లక్ష్యం.. కాలువ అలైన్‌మెంట్‌పై 22లోగా నిర్ణయం తీసుకోండి

- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం
- 2027 డిసెంబరు 9 కల్లా ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తామని వెల్లడి



హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో భాగంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీని ఆరునూరైనా నిర్మించి తీరతామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై మంగళవారం ఆయన సచివాలయంలో నీటిపారుదల శాఖ సలహాదారుడు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ మహ్మద్ అంజద్ హుస్సేన్, చీఫ్ ఇంజనీర్లతో టన్నెలింగ్ నిపుణుడు పరిక్షిత్ మెహ్రాతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఉత్తమ్ విలేకర్లతో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి, 80 టీఎంసీల జలాలను తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తుమ్మిడిహెట్టి నుంచి 71.5 కిమీల దాకా గ్రావిటీ కెనాల్‌తో నీటిని సుందిళ్లకు తరలించి, అక్కడి నుంచి ఎల్లంపల్లికి పంపింగ్ చేయాలా? లేక మైలారం దాకా వచ్చే నీటిని పంపింగ్ చేసి, ఎల్లంపల్లిలో పోయాలా? అనే దానిపై ఈ నెల 22లోగా తుది నిర్ణయం తీసుకోవాలని ఆదిత్యనాథ్ దాస్‌ను ఆదేశించారు. ఆయన్ను టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్‌గా నియమించారు. సుందిళ్లకు గ్రావిటీతో నీటిని తరలించే అవకాశం ఉందని, ఆ ప్రాంతంలో బొగ్గు గనులు ఉన్నందున 14 కి.మీ. మేర టన్నెల్ తవ్వాల్సి ఉంటుందని మంత్రి గుర్తుచేశారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ నిపుణుల కమిటీ నివేదికే ప్రామాణికమని చెప్పారు. బ్యారేజీ పునరుద్ధరణ డిజైన్లకు సంబంధించి.. డిజైన్ కన్సల్టెంట్ బాధ్యతలు ఐఐటీ మద్రాసుకే అప్పగించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వరదలు తగ్గుముఖం పట్టగానే బ్యారేజీల వద్ద కేంద్ర ప్రభుత్వానికి చెందిన పరిశోధన సంస్థలతో పరీక్షలు చేయిస్తామన్నారు. ఏడాదిలోపు పనులన్నీ పూర్తిచేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. సమ్మక్కసాగర్‌కు ఎన్‌వోసీ ఇవ్వడానికి ఛత్తీస్‌గఢ్ అంగీకారం తెలిపిందన్నారు.

ఎస్ఎల్‌బీసీపై హెలికాప్టర్‌తో సర్వే

వానలు తగ్గగానే శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ కోసం హెలికాప్టర్‌తో సర్వే చేయిస్తామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. 2027 డిసెంబరు 9కల్లా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తిచేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. దేవాదులలో ఒక ప్యాకేజీ సవరణ అంచనాలపై రాబోయే మంత్రివర్గ భేటీలో నిర్ణయం ఉంటుందన్నారు. దేవాదుల మూడో దశ కింద భూసేకరణకు రూ.33 కోట్లను విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. డిండి ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై మూడు రోజుల్లోగా నివేదికను సిద్ధం చేయాలన్నారు. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్‌లో తెలంగాణ వాదనలు పూర్తయ్యాయని, ఏపీ వాదనలు వినిపిస్తోందని ఆర్నెల్లలో తీర్పు వెలువడే అవకాశం ఉందన్నారు. కాగా, ప్రాణహిత నదిపై కుమరం భీం జిల్లా కౌటాల మండలంలో ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ మంగళవారం పరిశీలించారు.

వానాకాలం ధాన్యం కొనుగోలుకు రూ.21,112 కోట్లు

80 లక్షల టన్నుల ధాన్యం సేకరిస్తాం: ఉత్తమ్

రాష్ట్రంలో 148 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. దేశంలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి చేసిన రాష్ట్రంగా అరుదైన రికార్డును సాధించబోతున్నామన్నారు. ఇందులో 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రైతులకు కనీస మద్దతు ధర చెల్లించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు రూ.21,112 కోట్లు సమకూర్చినట్లు వెల్లడించారు. వానాకాలం ధాన్యం సేకరణపై మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. సన్న రకం వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించే పథకం కొనసాగుతోందని చెప్పారు. సన్నధాన్యం 91 లక్షల టన్నులు, దొడ్డు ధాన్యం 58 లక్షల టన్నులు ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండు పంటలకు రైతులకు బోనస్ చెల్లించడానికి రూ.3,158 కోట్లు కావాలని అంచనా వేశామన్నారు. బియ్యం సబ్సిడీ కింద కేంద్రం నుంచి రూ.6,500కోట్లు రావాల్సి ఉందని, వాటిని సత్వరమే విడుదల చేయాలని కోరామని ఉత్తమ్ చెప్పారు. ధాన్యం సేకరణలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)తో సమన్వయం చేసుకోవాలని, రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

23 నెలల్లో 2.30 లక్షల కోట్ల అప్పులు

- ప్రభుత్వం ఆ డబ్బును ఏం చేసిందో ప్రజలకు వివరించాలి
- ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు హామీని విస్మరించింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రేవంత్ రెడ్డి ప్రభుత్వం 23 నెలల్లో రూ.2 లక్షల 30 వేల కోట్ల అప్పులు చేసిందని, రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు కట్టిందో.. ఏ ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టిందో ప్రజలకు చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్న హామీని కాంగ్రెస్ విస్మరించిందని విమర్శించారు. ప్రభుత్వ తీరు వల్ల 93 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని, ఆ కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆటో నడవక, ఉపాధి లేక ఈ నెల 5న ఆత్మహత్యకు యత్నించి రాజన్న సిరిసిల్లా జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ నాంపల్లి సతీష్‌ను కేటీఆర్ పరామర్శించారు. రూ.25 వేల సాయం అందించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు బీమా సౌకర్యంతో పాటు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చి మోసగించిందని విమర్శించారు. ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ.24 వేల చొప్పున బాకీ డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఆటో డ్రైవర్లు అవస్థలు పడుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం దసరాకు ఏడు లక్షల మంది ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున అందించినట్లు ప్రకటించిందని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో అసంఘటిత కార్మికులు 10 లక్షల మందికి రూ.5 లక్షల బీమా కల్పించిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకానికి తాము వ్యతిరేకం కాదన్నారు. అవసరమైతే బస్సులను పెంచడంతో పాటు ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

- పాఠశాల ఎదుట బంధువుల ఆందోళన
- సిద్దిపేట జిల్లా జిల్లెలగడ్డ గురుకులంలో విషాదం


వివేక్ (ఫైల్)

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలోని బాలుర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ప్రమాదవశాత్తు మెడకు తాడు చుట్టుకుని చనిపోయాడని ఉపాధ్యాయులు చెబుతుండగా, తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబీకులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. నంగునూరుకు చెందిన సనాదుల సత్యనారాయణ, లావణ్య దంపతుల రెండో కుమారుడు వివేక్ జిల్లెలగడ్డ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవుల అనంతరం సోమవారం పాఠశాలకు వచ్చాడు. మంగళవారం ఉదయం డ్రిల్ ప్రిరియడ్‌లో హాస్టల్ కారిడార్‌లో ఆడుకుంటుండగా, మెడకు తాడు చుట్టుకుని మృతి చెందాడని ఉపాధ్యాయులు తెలిపారు. తమ కుమారుడి మృతిపై పాఠశాల యాజమాన్యం చెబుతున్న కారణాన్ని వివేక్ తల్లిదండ్రులు ఖండించారు. ముందుగా దెబ్బలు తగిలాయని చెప్పారని, ఇక్కడికి వచ్చి చూస్తే తమ కుమారుడు చనిపోయి ఉన్నాడని తండ్రి సత్యనారాయణ బోరున విలపించారు. విద్యార్థి మృతిపై న్యాయ విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బంధువులు, గ్రామస్థులు పాఠశాల ఎదుట రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ధర్నా విరమించారు.

చివరి కిలో వరకూ పత్తి కొంటాం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని ఆరోపించారు. మహారాష్ట్రలోని అకోలాలో పత్తి పండిస్తున్న తరహాలో తెలంగాణలోనూ పండించి అధిక దిగుబడి సాధించేలా రైతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించాలని సూచించారు. మంగళవారం ఢిల్లీలోని ఉద్యోగ్ భవన్‌లో గిరిరాజ్‌సింగ్‌తో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ భేటీ అయ్యారు. తెలంగాణలో పత్తి కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలు, కొనుగోలు కేంద్రాల పెంపు, పత్తి రైతులు ఇబ్బందులపై చర్చించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. కనీస మద్దతు ధరకు పంటల కొనుగోలుతోపాటు దళారులకు ఆస్కారం లేకుండా నేరుగా రైతులకు లాభం చేకూరేలా కేంద్రం చర్యలు తీసుకుంటోందని గిరిరాజ్‌సింగ్ చెప్పారు. తెలంగాణలో ఏటా సుమారు రూ.65 వేల కోట్ల మేర పత్తి కొనుగోళ్ల జరుగుతున్నాయని తెలిపారు. పత్తిని ఆరబెట్టి, తేమ శాతాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో వేదికలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకోసం ఉపాధి హామీ పథకం నిధులను వాడుకోవాలని చెప్పారు. కాగా, రైతులు తొందరపడి పత్తిని బయట తక్కువధరకు అమ్ముకోవద్దని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. మార్కెట్‌లోకి రైతులంతా ఒకేసారి పత్తి తీసుకురావడంతో ఇబ్బందులు వస్తున్నాయని.. అందుకోసం ప్రత్యేక యాప్ తెచ్చామని, దానితో ఎవరు, ఎప్పుడు మార్కెట్‌కు రావాలో స్లాట్‌లు కేటాయిస్తారని తెలిపారు.

గిరిజన భాషల్లోనూ బోధన అవసరం: ధర్మేంద్ర ప్రధాన్

దేశంలో గిరిజన భాషల్లోనూ బోధన ఉండాల్సిన అవసరం ఉందని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభిప్రాయపడ్డారు. ములుగులోని సమ్మక్క- సారక్క గిరిజన విశ్వవిద్యాలయంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా కొత్త కోర్సులు తీసుకురావాలని సూచించారు. మంగళవారం ఢిల్లీలో సమ్మక్క- సారక్క కేంద్రీయ విశ్వవిద్యాలయం లోగోను కిషన్‌రెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ప్రధాని మోదీ దూరదృష్టి, కిషన్‌రెడ్డి చొరవతో గిరిజన వర్సిటీ సాకారమైందని ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. భారత ఆయుర్వేదం, గిరిజనుల ఆహారం గురించి కోర్సులు ఉండేలా వర్సిటీ చర్యలు చేపట్టాలన్నారు. ఇక ఈ యూనివర్సిటీ భవనాల నిర్మాణం త్వరితగతిన ప్రారంభించాలని ధర్మేంద్ర ప్రధాన్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు.


కుమరం భీం జిల్లా జోడేఘాట్‌లో కుమరం భీం విగ్రహం ఎదుట నినాదాలు చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ఆదివాసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- రాష్ట్ర గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి
- నేటికి కొనసాగుతున్న కుమరం భీం నినాదం: మంత్రి జూపల్లి
- భీం స్ఫూర్తితోనే గిరిజన హక్కులు: సీతక్క

ఆసిఫాబాద్/కెరమెరి/కవాడీగూడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కుమరంభీం-ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి గిరిజన సంక్షేమశాఖ మంగళవారం నిర్వహించిన కుమరం భీం వర్ధంతికి హాజరయ్యారు. కుమరం భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమైన కుమరం భీం పోరాటాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆయన వర్ధంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో వేడుకలు సాధారణంగా నిర్వహించామన్నారు. ఆశ్రమ పాఠశాలల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని లక్ష్మణ్ కుమార్ చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ నిజాం నవాబుకు వ్యతిరేకంగా జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన కుమరం భీం నినాదం నేటికి కొనసాగుతుందన్నారు. ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, పాల్వాయి హరీష్‌బాబు తదితరులు కుమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు కుమరం భీం వర్ధంతి కార్యక్రమాలను గిరిజన సంప్రదాయ రీతిలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి ప్రారంభించారు. కుమరం భీం మనమడు సోనేరావు కుటుంబ సభ్యులకు సంప్రదాయబద్ధంగా నూతన వస్త్రాలను అందజేశారు. మరోవైపు, హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై గల కుమరం భీం విగ్రహానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుమరం భీం పోరాటం ఆత్మగౌరవ పోరాటమన్నారు. జల్, జంగల్, జమీన్ నినాదాలతో తమ గిరిజన గూడాల్లో తమ రాజ్యం రావాలన్న ఆయన చేసిన పోరాట స్ఫూర్తితోనే గిరిజనులకు ప్రత్యేక హక్కులు, చట్టాలు వచ్చాయన్నారు.

ఉచితాలు కాదు.. అభివృద్ధే ప్రధానం

- ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలి: వెంకయ్యనాయుడు

వెంకటాచలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉచిత పథకాలు అందించడంపై కన్నా అభివృద్ధి మీద ప్రభుత్వాలు దృష్టి సారించాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు సూచించారు. "రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచితాలు అనుచితంగా తయారవుతున్నాయి. ఎన్నికల్లో ప్రయోజనం కోసం ఉచిత పథకాలు ప్రకటించడం అలవాటుగా మారింది. వాటి అమలుతో రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు తాహతుకు మించి అప్పులు చేయాల్సి వస్తోంది. దానివల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ఒకటో తేదీకి జీతాలు ఇవ్వలేమని చెబుతున్నారు" అని ఆయన తెలిపారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం జలవనరులు, విద్యుత్ తదితర ప్రాజెక్టులపై అప్పులు తెచ్చి ఖర్చు చేస్తే తిరిగి వచ్చే వెసులుబాటు ఉంటుందన్న ఆయన, ప్రభుత్వాలు విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. చట్టసభల్లో సరైనభాష మాట్లాడకుండా వ్యక్తిగత దూషణలకు పాల్పడేవారిపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. "స్పీకర్లు ఇలాంటి విషయాల్లో కఠినంగా వ్యవహరించాలి. అసెంబ్లీ నియమాలను గట్టిగా అమలు చేయడంతోపాటు, ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు నిర్వహించాలి. చట్టసభల్లో హుందాగా రాజకీయం చేయాలి" అని ఆయన సూచించారు. రాజకీయాల్లో వారసత్వాన్ని ప్రోత్సహించకూడదని, దానికి తాను వ్యతిరేకమని వెంకయ్య చెప్పారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి ప్రయత్నం బాధాకరమన్న ఆయన, ఇది చీఫ్ జస్టిస్‌కు సంబంధించిన అంశమే కాదని, సమాజానికి, వ్యవస్థకు సంబంధించిన విషయం కూడా అన్నారు. ఇందుకు పాల్పడిన వ్యక్తిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

యూనిట్ కరెంట్ 10 పైసలే!

- బహిరంగ విపణిలో కారుచౌకగా విద్యుత్

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒక యూనిట్ విద్యుత్ ధర 10 పైసలే.. ఆ సమయంలో ఎంతకావాలన్నా అదే ధరకే.. ఇది భారత ఎనర్జీ ఎక్స్ఛేంజీ (ఐఈఎక్స్)లో ప్రస్తుత పరిస్థితి. ఎడతెరిపిలేని వానలతో దేశవ్యాప్తంగా జల విద్యుత్ ఉత్పత్తి పెరగడం, పలు ప్రాంతాల్లో ముందస్తుగా సౌర విద్యుత్ ప్లాంట్లు అందుబాటులోకి రావడం, ఇదే సమయంలో దేశవ్యాప్తంగా విద్యుత్‌కు డిమాండ్ తగ్గడంతో.. బహిరంగ మార్కెట్లో రియల్ టైమ్ (గంట ముందు) విద్యుత్ ధరలు బాగా తగ్గాయి. ఐఈఎక్స్‌లో ప్రతి 15 నిమిషాలకు ఒక బ్లాకు చొప్పున రోజులో 90 బ్లాకులుగా విద్యుత్ విక్రయాలు జరుగుతుంటాయి. అందుబాటులోకి వచ్చే విద్యుత్‌ను ఒక గంట ముందుగా అమ్ముతారు. విద్యుత్ సంస్థలు తమకు కరెంటు అవసరమైన సమయాన్ని బట్టి వేలం పాడి కొనుక్కుంటాయి. డిమాండ్ ఎక్కువగా ఉంటే ఒక్కో యూనిట్ ధర రూ.20కి పైగా పలుకుతుంది కూడా. కానీ మంగళవారం ఉదయం 8- 8:15 బ్లాక్‌లో యూనిట్‌కు 10 పైసలకే అమ్ముడుపోయింది. ఆ సమయంలో 8,219 మెగావాట్లను వివిధ విద్యుత్ సంస్థలు కొనుగోలు చేశాయి. మధ్యాహ్నం 1-1:15 బ్లాకులోనూ 9,356 మెగావాట్ల విద్యుత్ 10పైసలకు యూనిట్ చొప్పున అమ్ముడైంది. ఆ సమయంలో ఏమాత్రం డిమాండ్ లేకపోవడమే దీనికి కారణం.

ఆ రేటు హైరైజులకే చెల్లు!

ఎకరం రూ.177 కోట్లంటే గజం 3.75 లక్షలు... పక్కనే ఉన్నా చిన్న ప్లాట్లకు ఆ రేటు రాదు



హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గంలోని నాలెడ్జ్ పార్క్‌లో ఎకరం రూ.177 కోట్లు పలికింది. ఈ రేటు ప్రకారం చూస్తే ఒక చదరపు గజం ధర రూ.3.75లక్షలు. ఈ మేరకు చుట్టు పక్కల స్థలాల ధరలన్నీ పెరిగినట్లే అన్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. అదంతా నిజమేనా? అంటే కాకపోవచ్చు. అంత భారీ ధరకు భూములు అమ్ముడు పోవడం రియల్ ఎస్టేట్‌కు ఊపునిచ్చేదే. అయితే, ఈ ప్రభావం చిన్న, పెద్ద ప్లాట్లు అన్నింటిపైనా ఒకే విధంగా ఉండదని అంటున్నారు. హైరైజ్ అపార్ట్‌మెంట్లలో, అందులోనూ 45-50 అంతస్తుల నిర్మాణాలకు అనుమతిచ్చే చోట్ల ఒక గజం భూమిలో ఎన్ని చదరపు అడుగులు (ఎస్ఎఫ్‌టీ) నిర్మిస్తారు? అదే ఐదు, ఆరు, ఏడు అంతస్తుల వరకు మాత్రమే అనుమతి వచ్చే స్థలాల్లో ఒక చదరపు గజానికి ఎంత ఎస్ఎఫ్‌టీ నిర్మిస్తారన్నది చూడాలి. గతంలో కోకాపేట సమీపంలోని నియోపొలిస్‌లో వేలంలో కొనుగోలు చేసిన భూమిలో నిర్మిస్తున్న అపార్టమెంట్లలో ఎకరాకు సుమారు 5 లక్షల ఎస్ఎఫ్‌టీ నిర్మాణ స్థలం వస్తోంది. అక్కడ ఒక్కో వెంచర్ 45-50 అంతస్తుల్లో నిర్మించడం వల్ల అంత ఎక్కువ ఎస్ఎఫ్‌టీ నిర్మించగలుగుతున్నారు. ఇప్పుడు రాయదుర్గం భూములకు కూడా అదే రీతిన ఎక్కువ ఎస్ఎఫ్‌టీ వచ్చే విధంగా అనుమతులు ఇస్తారు. ఎకరానికి 4,848 చదరపు గజాల్లో సుమారు 5లక్షల చదరపు అడుగుల నిర్మాణం అంటే ఒక చదరపు గజానికి 100 అడుగులపైనే నిర్మిత స్థలం వస్తోంది. అదే హైరైజ్ పక్కన వెయ్యి గజాల స్థలం తీసుకుని నిర్మాణం చేపడితే నిబంధలన ప్రకారం కట్టగలిగేది గజానికి కేవలం 24-25 ఎస్ఎఫ్‌టీలే. అంటే వేలంలో కొనుగోలు చేసి హైరైజ్ నిర్మాణాలు చేస్తున్న దానిలో నాలుగో వంతే. మరి అలాంటప్పుడు హైరైజ్ భవనాలకు అవకాశం ఉన్న భూములకు, ఐదు నుంచి 10 అంతస్తులు మాత్రమే నిర్మించే అవకాశం ఉన్న భూములకు, ఇండిపెండెంట్ ఇల్లు కట్టుకునే స్థలాలకు ఒకే ధర ఉండదు కదా! మరి రాయదుర్గం వేలంలో గజం 3.75లక్షలు పలికినపుడు చిన్న ప్లాట్లకు ఎంత ఉండొచ్చు అని రియల్ ఎస్టేట్ వర్గాలను అడగ్గా, అందులో 50-60 శాతం ఉంటుందని చెప్పారు. ఈ కారణంగానే ప్రభుత్వ వేలంలో చిన్న బిట్ల ధరలు రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకే పలుకుతున్నాయి. సాధారణంగా ఒక ప్రాంతంలో వేలంలో భూములకు అత్యధిక ధర పలికితే ఆ చుట్టుపక్కల ఉన్న చిన్న బిట్ల ధరలు ఎంతోకొంత పెరుగుతాయి. లేదా అక్కడ క్రయవిక్రయాల లావాదేవీలైనా పెరుగుతాయని విశ్లేషకులు చెప్తున్నారు.

నిర్మాణ కంపెనీల లెక్కలు వేరు

నిర్మాణ కంపెనీలు ఒక నిర్దిష్ట విస్తీర్ణం కలిగిన స్థలాన్ని వేలంలో కొనుక్కొనేందుకు ముందుకు వచ్చాయంటే అంతకుముందే అందులో ఎంత ఎస్ఎఫ్‌టీ మేర నిర్మాణాలు చేపట్టగలమో లెక్క వేసుకుంటాయి. దాన్నే ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ అంటారు. సాధారణంగా హైదరాబాద్‌లో ఒక ఎకరం స్థలంలో ఐదు అంతస్తుల్లో అపార్ట్‌మెంట్ నిర్మించాలంటే ఇచ్చే అనుమతి సుమారు లక్ష చదరపు అడుగులకు మాత్రమే ఉంటుంది. 10-20 అంతస్తుల వరకు వెళ్తే లక్షన్నర నుంచి రెండు లక్షల చదరపు అడుగుల వరకు అనుమతి ఇస్తున్నారు. అవన్నీ ఒక ఎత్తు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ వేలం వేసిన భూముల్లో మాత్రం 4.5 నుంచి 5 లక్షల చదరపు అడుగుల వరకు నిర్మాణాలకు అనుమతిచ్చారు. ఇక్కడ ఎకరా రూ.177 కోట్లకు కొనుగోలు చేసినా నిర్మాణ సంస్థలు అందులో ఎకరాకు 4.5-5 లక్షల చదరపు అడుగుల వరకు నిర్మాణాలు చేపడతాయి. ఎకరా ధర రూ.177 కోట్లు.. కట్టేది 5 లక్షల ఎస్ఎఫ్‌టీ అనుకుంటే.. ఒక ఎస్ఎఫ్‌టీ నిర్మాణ స్థలానికి భూమి విలువ సుమారు రూ.3,600. దీనికి నిర్మాణ ఖర్చు అదనం. అది కూడా చూసుకున్నా పెట్టిన డబ్బుకు వడ్డీలు లెక్కించినా అమ్మగలిగే ధర ఎక్కువే ఉండడంతో వేలంలో అంత ధర పెట్టగలిగారని విశ్లేషకులు చెప్తున్నారు. ఒకవేళ ఈ పక్కనే ఎకరం రూ.177 కోట్లు అంటే గజం 3.75 లక్షలు కదా! అన్న లెక్కన ఒక 1000 గజాల స్థలాన్ని అదే రేటుకు కొనుగోలు చేస్తే భూమి కొనుగోలుకే రూ. 37.5 కోట్లు అవుతుంది. ఇక్కడ అపార్ట్‌మెంట్ కట్టాలనుకుంటే పార్కింగ్ కాక ఐదు అంతస్తులకు అనుమతి వస్తుంది. గరిష్ఠంగా 24 వేల చదరపు అడుగులకు మాత్రమే అనుమతి వస్తుంది. భూమి కొనుగోలు ధరకు ఈ 24 వేల చదరపు అడుగులకు విభజిస్తే ఒక్కో చదరపు అడుగుకు రూ.15,625 పెట్టాలి. ఇది కేవలం స్థలానికే. ఇక భవన నిర్మాణ అనుమతులు, ఇతర ఖర్చులు కలిపితే బిల్డర్ అమ్మకం ధర చదరపు అడుగుకు ఎంత పెట్టాలి? ఆ ధరకు అమ్మగలరా? అంటే లేదనే జవాబే వస్తుంది.

అన్‌డివైడెడ్ షేర్ భారీగా తగ్గుతుంది

ఆకాశ హర్మ్యాల్లో కొనుగోలు చేసే అపార్ట్‌మెంట్లలో కొనుగోలుదారులకు లభించే అన్‌డివైడెడ్ షేర్ భూమి కూడా భారీగా తగ్గుతుంది. ఒకప్పుడు 2000 చదరపు అడుగులున్న మూడు బెడ్రూముల ఫ్లాట్ కొంటే 70 చదరపు గజాల అవిభాజ్య స్థలం వచ్చేది. అదే ఇప్పుడు హైరైజ్‌లలో కట్టే నిర్మాణాల్లో 2000 చదరపు అడుగులకు సుమారు 14 గజాలే వస్తుంది.

వైజాగ్‌లో పరుగుల వరదే..!

భారత మ్యాచ్‌లకు ఫ్లాట్ వికెట్?


ప్రాక్టీస్‌లో భారత మహిళల జట్టు

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): మహిళల వరల్డ్‌కప్‌లోని గత రెండు మ్యాచ్‌ల్లో భారత జట్టు బ్యాటింగ్‌లో తడబడింది. ఈ నేపథ్యంలో విశాఖలో బలమైన దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాతో హర్మన్‌ప్రీత్ సేన తలపడనుంది. అయితే, కీలక మ్యాచ్‌లకు ఎలాంటి పిచ్‌ను తయారు చేస్తారోనన్న చర్చ జోరుగా సాగుతుంది. కానీ, విశాఖలో ఫ్లాట్ పిచ్‌ను తయారు చేశారన్న వార్త భారత బ్యాటర్లకు ఊరటనిచ్చేదే. శ్రీలంక, పాకిస్థాన్‌పై జరిగిన మ్యాచ్‌ల్లో భారత్ గెలిచింది. కానీ, అదంతా బౌలర్ల ప్రతిభతోనేనే చెప్పుకోవాలి. బ్యాటర్లు విఫలమైనా.. బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థులను కట్టడి చేశారు. కానీ, బిగ్ మ్యాచ్‌లు కావడంతో హర్మన్, స్మృతి ఫామ్‌లోకి రావాలని అభిమానులు కోరుకొంటున్నారు. 'వికెట్ బ్యాటర్లకు అనుకూలం. గత కొన్ని మ్యాచ్‌లను పరిశీలిస్తే.. మంచు ప్రభావం లేకపోతే స్పిన్నర్లకు కొంత సహకారం లభించవచ్చు' అని ఆంధ్ర క్రికెట్ సంఘం తెలిపింది. వైజాగ్‌లో 11 ఏళ్ల తర్వాత మహిళల వన్డే మ్యాచ్ జరుగుతోంది. 2014, జనవరి 23న ఇదే వేదికపై శ్రీలంకతో భారత్ తలపడింది.

విశాఖ చేరుకున్న దక్షిణాఫ్రికా క్రికెటర్లు



మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా గురువారం భారత జట్టుతో తలపడనున్న దక్షిణాఫ్రికా క్రికెటర్లు మంగళవారం విశాఖపట్నం చేరుకున్నారు. సోమవారం ఇండోర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించిన సంగతి తెలిసిందే.

హుస్సాముద్దీన్ పసిడి పంచ్



చెన్నై: బీఎఫ్ఐ కప్‌లో నిజామాబాద్ బాక్సర్ హుస్సాముద్దీన్ పసిడి పతకం కొల్లగొట్టి సత్తా చాటాడు. మంగళవారం జరిగిన 55-60 కిలోల ఫైనల్లో మొహమ్మద్ హుస్సాముద్దీన్ 5-0తో సాగర్ జఖర్ (సాయ్)ను చిత్తుగా ఓడించాడు. గాయం నుంచి కోలుకున్నాక తిరిగి ఫామ్‌లోకి రావడంపై హుస్సాముద్దీన్ సంతోషం వ్యక్తం చేశాడు.

ఇంగ్లండ్ కాస్త కష్టంగా..

బంగ్లాదేశ్‌పై గెలుపు ● మహిళల వన్డే వరల్డ్‌కప్

నేటి మ్యాచ్ | మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
ఆస్ట్రేలియా x పాకిస్థాన్


హీథర్ నైట్ (79 నాటౌట్)

గువాహటి: మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో మాజీ చాంపియన్ ఇంగ్లండ్ జోరు కొనసాగుతోంది. మంగళవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో నెగ్గి వరుసగా రెండో విజయం అందుకుంది. అయితే పటిష్ఠ బ్యాటింగ్ లైనప్ కలిగిన ఇంగ్లండ్‌ను బంగ్లా బౌలర్లు కొంతమేర కట్టడి చేయగలిగారు. కానీ హీథర్ నైట్ (79 నాటౌట్) అజేయ ఆటతీరుతో జట్టు గట్టెక్కింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా 49.4 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటైంది. సోభన మోస్త్రరి (60), రబేయ (43), షర్మీన్ (30) రాణించారు. ఎకెల్‌స్టోన్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఇంగ్లండ్ 46.1 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులు చేసి నెగ్గింది. బ్రంట్ (32), డీన్ (27 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ఆమీ జోన్స్ (1)ను అవుట్ చేసిన పేసర్ మరూఫ షాకిచ్చింది. ఆ తర్వాత తనే మరో ఓపెనర్ బ్యూమాంట్ (13) వికెట్‌ను కూడా తీసింది. ఇక స్పిన్నర్ ఫహిమా ధాటికి మధ్య ఓవర్లలో 78/5 స్కోరుతో ఇంగ్లండ్ కష్టాల్లో పడింది. ఈ స్థితిలో హీథర్ హాఫ్ సెంచరీతో ఏడో వికెట్‌కు డీన్‌తో అజేయంగా 80 పరుగులు జోడించడంతో ఎలాంటి సంచలనం లేకుండా మ్యాచ్ ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 49.4 ఓవర్లలో 178 ఆలౌట్. (సోభన 60, రబేయ ఖాన్ 43 నాటౌట్, షర్మీన్ 30; ఎకెల్‌స్టోన్ 3/24, డీన్ 2/28, కాప్సీ 2/31, లిన్సే స్మిత్ 2/33).
ఇంగ్లండ్: 46.1 ఓవర్లలో 182/6. (హీథర్ 79 నాటౌట్; బ్రంట్ 32, కాప్సీ 20, డీన్ 27 నాటౌట్; ఫహీమా 3/16, మరూఫా 2/28).

30 ఏళ్ల తర్వాత..



ఆనంద్-కాస్పరోవ్ సమరం

క్లచ్ చెస్ టోర్నీలో తలపడనున్న దిగ్గజాలు

సెయింట్ లూయిస్ (యూఎస్): చిరకాల ప్రత్యర్థులు, దిగ్గజాలు విశ్వనాథన్ ఆనంద్, గ్యారీ కాస్పరోవ్ 30 ఏళ్ల తర్వాత మళ్లీ తలపడనున్నారు. బుధవారం నుంచి జరిగే క్లచ్ చెస్ టోర్నీలో వీరిద్దరూ 12 గేమ్‌లు ఆడనున్నారు. వినూత్న పాయింట్ల విధానంలో జరిగే టోర్నీలో రోజుకు 4 గేముల్లో తలపడతారు. 1995లో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో వీరిద్దరూ క్లాసిక్ ఫార్మాట్‌లో ఆడగా.. ఈసారి మాత్రం ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్‌లో అమీతుమీ తేల్చుకోనున్నారు. కాగా, వీరిద్దరి 20 గేముల ముఖాముఖీలో కాస్పరోవ్ 10.5-7.5తో విషీపై ఆధిక్యంలో ఉన్నాడు. 2004లో రిటైర్మెంట్ ప్రకటించిన కాస్పరోవ్ ఎగ్జిబిషన్, బ్లిట్జ్ ఈవెంట్లు ఆడుతున్నాడు. మరోవైపు యువ ఆటగాళ్లకు మెంటార్‌గా వ్యవహరిస్తున్న ఆనంద్ ప్రముఖ ఈవెంట్లలో అడపాదడపా పాల్గొంటున్నాడు. విజేతకు రూ. 62 లక్షలు, ఓడిన వారికి రూ. 44 లక్షల ప్రైజ్‌మనీ అందనుంది. ఒకవేళ సమమైతే చెరిసగం పంచుకుంటారు.

హెనిల్, ఖిలన్ ఆల్‌రౌండ్ షో

● ఆసీస్ 135 ఆలౌట్ ● భారత్ 144/7

రెండో యూత్ టెస్ట్

మెకే (ఆస్ట్రేలియా): పటేల్ ద్వయం హెనిల్ (3/21, 22 నాటౌట్), ఖిలన్ (3/23, 26) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో.. అండర్-19 రెండో అనధికార టెస్ట్ తొలి రోజు భారత్ 9 పరుగుల ఆధిక్యాన్ని నమోదు చేసింది. నాలుగు రోజుల ఈ టెస్ట్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే కుప్పకూలింది. అలెక్స్ (66) అర్ధ శతకం సాధించాడు. ఉద్ధవ్ మోహన్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన భారత్ 144/7 స్కోరు చేసింది. మొదటి రోజు ఆట ఆఖరుకు హెనిల్‌తోపాటు దేవేంద్రన్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. వేదాంత్ త్రివేది (22), వైభవ్ సూర్యవంశీ (20) పర్వాలేదనిపించారు. బార్టన్ మూడు వికెట్లు పడగొట్టాడు.

వన్డే జట్టులో స్టార్క్

భారత్‌తో సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్లు



మెల్‌బోర్న్: భారత్‌తో జరిగే వన్డే, టీ20ల సిరీస్‌ల కోసం ఆస్ట్రేలియా జట్లను ప్రకటించారు. గత నెల టీ20 ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన పేసర్ మిచెల్ స్టార్క్‌కు వన్డే జట్టులో చోటు దక్కింది. పని ఒత్తిడిలో భాగంగా అతడు ఆగస్టులో దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌కు దూరంగా ఉన్నాడు. గతేడాది నవంబరులో స్టార్క్ తన చివరి వన్డే ఆడడం గమనార్హం. ఈనెల 19 నుంచి భారత్‌తో మూడు వన్డేల సిరీస్ జరుగనుంది. ప్యాట్ కమిన్స్ గాయం నుంచి కోలుకోకపోవడంతో జట్టుకు మిచెల్ మార్ష్ నాయకత్వం వహించనున్నాడు. 15 మంది ఆటగాళ్ల జాబితాలో మాథ్యూ రెన్‌షా, షార్ట్, మిచ్ ఓవెన్‌లకు కూడా చోటు దక్కింది. మరోవైపు ఈనెల 29 నుంచి జరిగే ఐదు టీ20ల సిరీస్‌లోని తొలి రెండు మ్యాచ్‌లకు మాత్రమే జట్టును ప్రకటించారు.

వన్డే జట్టు: మార్ష్ (కెప్టెన్), బార్ట్‌లెట్, క్యారీ, కనోలీ, డ్వార్షుస్, ఎల్లిస్, గ్రీన్, హాజెల్‌వుడ్, హెడ్, ఇన్‌గ్లిస్, ఓవెన్, రెన్‌షా, షార్ట్, స్టార్క్, జంపా.
టీ20 జట్టు: మార్ష్ (కెప్టెన్), ఎబాట్, బార్ట్‌లెట్, డేవిడ్, డ్వార్షుస్, ఎల్లిస్, హాజెల్‌వుడ్, హెడ్, ఇన్‌గ్లిస్, కునేమన్, షార్ట్, ఓవెన్, స్టొయినిస్, జంపా.

తలైవాస్ అదుర్స్

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్‌లో తమిళ్ తలైవాస్ జట్టు అదరగొట్టింది. మంగళవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 56-37తో పట్నా పైరేట్స్‌ను చిత్తుగా ఓడించింది. తలైవాస్ ఆటగాడు అర్జున్ దేశ్వాల్ రైడింగ్‌లో 21, బోనస్ ద్వారా 5 పాయింట్లు సాధించాడు. ఇక, ఉత్కంఠగా సాగిన హరియాణా స్టీలర్స్, దబాంగ్ ఢిల్లీ జట్ల పోరులో తొలుత 33-33తో స్కోరు సమమైంది. అయితే, ఫలితం కోసం నిర్వహించిన రైడింగ్‌లో దబాంగ్ 9-3తో స్టీలర్స్‌ను ఓడించింది.

పృథ్వీ షా రచ్చ

ముంబై ప్లేయర్ ముషీర్‌తో వాగ్వాదం

పుణె: ఫామ్ లేమితో పాటు క్రమశిక్షణా చర్యల కింద ముంబై జట్టులో చోటు కోల్పోయిన బ్యాటర్ పృథ్వీ షా మరో వివాదంలో చిక్కుకున్నాడు. ప్రస్తుతం మహారాష్ట్రకు ఆడుతున్న షా ముంబైతో జరుగుతున్న ప్రాక్టీస్ మ్యాచ్‌లో 181 పరుగులతో ఫామ్‌ను చాటుకున్నాడు. అయితే ముషీర్ ఖాన్ ఓవర్‌లో క్యాచ్ అవుటయ్యాడు. షా వెళ్లిపోతున్న క్రమంలో ముషీర్ సెండాఫ్ ఇవ్వడంతో పట్టరాని కోపంతో అతడిని బ్యాట్‌తో కొట్టేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో తన పాత ముంబై సహచరులంతా పృథ్వీని చుట్టుముట్టారు. వెంటనే అంపైర్లు వివాదం మరింత పెద్దది కాకుండా షాను పెవిలియన్ వైపు పంపారు. వెళ్లిపోతున్న క్రమంలోనూ ఫీల్డర్ సిద్దేష్ లాడ్‌తో కోపంగా మాట్లాడడం కనిపించింది.

కోల్‌కతా బోణీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్)లో కోల్‌కతా థండర్ బోల్ట్స్ శుభారంభం చేసింది. మంగళవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో కొచ్చి బ్లూ స్పైకర్స్‌తో ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా 3-1 (12-15, 15-13, 15-6, 19-17)తో నెగ్గింది. నిర్ణయాత్మక నాలుగో సెట్‌లో విజయం కోసం ఇరు జట్లూ చివరి వరకు పోరాడాయి. చివరికి సెట్‌తో పాటు మ్యాచ్‌ను కూడా కోల్‌కతా దక్కించుకుంది. కోల్‌కతా విజయంలో కీలక పాత్ర పోషించిన పంకజ్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

నాకౌట్ చేరువలో భారత్

శ్రీలంకపై విజయం • ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్

గువాహటి: బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో యువ భారత జట్టు వరుసగా రెండో విజయంతో నాకౌట్ బెర్త్‌కు చేరువైంది. గ్రూప్-హెచ్‌లో భాగంగా మంగళవారం జరిగిన పోరులో భారత్ 45-27, 45-21తో శ్రీలంకపై గెలిచింది. తొలి మ్యాచ్‌లో నేపాల్‌ను చిత్తుచేసిన భారత్.. తాజా ప్రదర్శనతో తన గ్రూప్‌లో టాపర్‌గా నిలిచింది. భారత్ తన గ్రూప్‌లో ఆఖరిదైన మూడో మ్యాచ్‌ను బుధవారం యూఏఈతో ఆడనుంది. కాగా ఈ టోర్నీకి మ్యాచ్ కంట్రోల్‌గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంఎస్‌కే ప్రసాద్ వ్యవహరిస్తున్నారు.

బీఎస్, లారాకు 'లైఫ్ టైమ్' అవార్డులు



ముంబై: ప్రతి ఏటా ప్రకటించే ప్రఖ్యాత సియట్ క్రికెట్ రేటింగ్ అవార్డుల్లో ఈసారి భారత దిగ్గజం బీఎస్ చంద్రశేఖర్, వెస్టిండీస్ గ్రేట్ బ్రియాన్ లారాలకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారాలు దక్కాయి. మంగళవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో గవాస్కర్ చేతుల మీదుగా లారా ఈ అవార్డును అందుకున్నాడు. 'టీ20 బ్యాటర్ ఆఫ్ ది ఇయర్'గా సంజూ శాంసన్, బౌలర్‌గా వరుణ్ చక్రవర్తి అవార్డులు గెలుచుకోగా.. ఈ ఏడాది చాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన రోహిత్ శర్మను ప్రత్యేక జ్ఞాపికతో సన్మానించారు. ఇక, ఈ ఏడాది వన్డేల్లో అత్యధిక రన్స్ చేసిన భారత క్రికెటర్‌గా నిలిచినందుకు శ్రేయాస్ అయ్యర్‌కు జ్ఞాపిక అందుకున్నాడు. 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్'గా పురుషుల్లో జో రూట్ నిలవగా, మహిళల్లో స్మృతీ మంధాన అవార్డును దక్కించుకున్నారు.



బిజినెస్

వచ్చే ఐదేళ్లలో రూ.3 లక్షలకు బంగారం!?

2030 చివరికల్లా మరో 150% పెరిగే అవకాశం ● మార్కెట్ నిపుణుడు ఎడ్ యార్దేని అంచనా





పసిడి ధరలు ఆకాశమే హద్దుగా ఎగబాకుతున్నాయి. ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం రేటు ఇప్పటికే 50 శాతానికి పైగా పెరిగి తొలిసారిగా 4,000 డాలర్ల మైలురాయిని దాటింది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను అలుముకున్న అనిశ్చితి మబ్బులు ఇప్పట్లో తొలగేలా కన్పించడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో బులియన్ ధరలు మరింత పైకి దూసుకుపోతాయని విశ్లేషకులు అంటున్నారు. ప్రస్తుత గోల్డెన్ ర్యాలీ ఈ దశాబ్దం చివరి వరకు కొనసాగనుందని, 2030 సంవత్సరాంతానికల్లా ఔన్స్ బంగారం మరో 150 శాతం పెరిగి 10,000 డాలర్లకు చేరవచ్చని అంతర్జాతీయ మార్కెట్ నిపుణుడు ఎడ్ యార్దేని అంచనా వేశారు. ఈ లెక్కన, భారతీయ మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర వచ్చే ఐదేళ్లలో రూ.3 లక్షలు (ప్రస్తుత కరెన్సీ మారకం రేటు ప్రకారం) దాటవచ్చు.

పసిడి ర్యాలీకి యార్దేని చెబుతున్న కారణాలు

- అంతర్జాతీయంగా ఆర్థిక, రాజకీయ, భౌగోళిక అనిశ్చితులు
- ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు పసిడి నిల్వలను భారీగా పెంచుకుంటుండటం
- బులియన్‌లో పెట్టుబడులకు వ్యక్తిగత, సంస్థాగత ఇన్వెస్టర్లు గతంలో కంటే అధిక ఆసక్తి కనబరుస్తుండటం

రూ.1.24 లక్షలకు పసిడి

ఇంటర్నేషనల్ మార్కెట్‌తో పాటు దేశీయ విపణిలోనూ పసిడి ధర సరికొత్త జీవితకాల గరిష్ఠానికి చేరుకుంది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మంగళవారం మరో రూ.700 పెరిగి రూ.1,24,000కు చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు సైతం రూ.700 పెరుగుదలతో ఆల్‌టైమ్ గరిష్ఠం రూ.1,23,400కు ఎగబాకింది. అమెరికా షట్‌డౌన్‌తో నెలకొన్న రాజకీయ, ఆర్థిక అనిశ్చితితో పాటు ఈ నెలలో ఫెడ్ రేట్లు మరింత తగ్గవచ్చన్న అంచనాలు గోల్డ్ రేట్లను ఎగదోస్తున్నాయి. కాగా, సిల్వర్ రికార్డు గరిష్ఠాల నుంచి కాస్త కిందికి జారింది. కిలో వెండి ఏకంగా రూ.3,400 తగ్గి రూ.1,54,000కు దిగివచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం తొలిసారిగా 4,000 డాలర్ల మైలురాయిని అధిగమించింది. వెండి మాత్రం 48 డాలర్లకు తగ్గింది.

జీఆర్‌టీ జువెలర్స్ దీపావళి ఆఫర్లు



చెన్నై (ఆంధ్రజ్యోతి): జీఆర్‌టీ జువెలర్స్.. దీపావళి పండగను పురస్కరించుకుని 'సిల్వర్ ఫర్ గోల్డ్' పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ఆఫర్‌లో భాగంగా వినియోగదారులకు బంగారు ఆభరణాల కొనుగోలుపై అందుకు సమానమైన బరువుతో వెండిని పూర్తిగా ఉచితంగా అందించనుంది. దీంతోపాటుగా బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.100 తగ్గింపును జీఆర్‌టీ అందిస్తోంది. అలాగే వజ్రాభరణాల కొనుగోలుపై ప్రతి క్యారెట్‌కు 25 గ్రాముల వెండి, అన్‌కట్ డైమండ్స్‌పై ప్రతి క్యారెట్‌కు 2 గ్రాముల వెండిని ఉచితంగా అందించనుంది. ప్లాటినం ఆభరణాలపై ఆభరణం బరువుతో సమానంగా వెండి పూర్తిగా ఉచితంగా ఆఫర్ చేస్తోంది. మరోవైపు వినియోగదారులకు వెండి వస్తువుల మేకింగ్ చార్జీలపై 25 శాతం తగ్గింపు (ప్రత్యేక వస్తువులు మినహా), వెండి ఆభరణాలు, గిఫ్ట్ ఆర్టికల్స్ వస్తువుల ఎంఆర్‌పీపై 10 శాతం తగ్గింపును అందిస్తున్నట్లు జీఆర్‌టీ జువెలర్స్ ఎండీ జీఆర్ అనంత పద్మనాభన్ తెలిపారు.

వచ్చే ఏడాది 9% వేతన వృద్ధి

ఏఓఎన్ సర్వే నివేదికలో వెల్లడి

ముంబై: వచ్చే ఏడాది భారత్‌లో ఉద్యోగుల జీతాలు సగటున 9 శాతం పెరగవచ్చని ఏఓఎన్ నివేదిక అంచనా వేసింది. 2025లో నమోదైన 8.9 శాతం సగటు పెంపుతో పోలిస్తే వచ్చే ఏడాది మరింత మెరుగైన హైక్ లభించనుందని అంటోంది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలోనూ దేశీయంగా బలమైన వినియోగం, పెట్టుబడులు, ప్రభుత్వ సానుకూల విధానాలు ఇందుకు దోహదపడనున్నాయని నివేదిక పేర్కొంది. 45 రంగాలకు చెందిన 1,060 సంస్థల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు ఏఓఎన్ వెల్లడించింది.

ఏ రంగంలో..	ఎంత(%)
రియల్టీ/ఇన్‌ఫ్రా	10.9
ఎన్‌బీఎఫ్‌సీ	10.0
ఇంజనీరింగ్ డిజైన్ సర్వీసెస్	9.7
వాహన తయారీ, రిటైల్, లైఫ్ సైన్సెస్	9.6

ఉద్యోగుల వలసలు తగ్గుముఖం: కంపెనీల్లో ఉద్యోగుల వలసలు (అట్రిషన్) క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయని ఏఓఎన్ సర్వేలో వెల్లడైంది. 2023లో 18.7 శాతంగా ఉన్న వలసల రేటు 2024లో 17.7 శాతానికి, 2025లో 17.1 శాతానికి దిగివచ్చిందని రిపోర్టు తెలిపింది. ఉద్యోగుల వలసలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో కంపెనీలు భవిష్యత్ వ్యాపార అవసరాలకు అనుగుణంగా ఉద్యోగుల నైపుణ్యం పెంపు శిక్షణ, డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌పై పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని నివేదిక పేర్కొంది.

జోయాలుక్కాస్ ప్రచారకర్తగా సమంత



హైదరాబాద్: జువెలరీ రిటైలర్ జోయాలుక్కాస్.. తమ కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటి సమంత రూత్ ప్రభును నియమించుకుంది. సమంత ప్రచారంతో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలోని వినియోగదారులకు జోయాలుక్కాస్ మరింత చేరువ కానుందని గ్రూప్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ అన్నారు. సమంత ప్రచారం తమ మూడు దశాబ్దాల ప్రయాణాన్ని ప్రతిబింబించనుందన్నారు. ప్రతి మహిళ ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగేలా చేయటంలో జోయాలుక్కాస్ పాత్ర ఎంతో ఉందని, అలాంటి బ్రాండ్‌తో తాను పనిచేయటం ఎంతో సంతోషాన్నిస్తోందని ఈ సందర్భంగా సమంత అన్నారు.

గేటెడ్ కమ్యూనిటీల్లో సేఫ్ డిపాజిట్ లాకర్లు: ఆరమ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రైవేట్ సేఫ్ డిపాజిట్ లాకర్ ప్రొవైడర్ ఆరమ్.. హైదరాబాద్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లోని రెసిడెన్షియల్ గేటెడ్ కమ్యూనిటీస్ అయిన సత్వ మాగ్నస్, అపర్ణ సరోవర్ గ్రాండేలో టెక్ ఆధారిత సేఫ్ డిపాజిట్ లాకర్లను ఏర్పాటు చేసినట్లు ఆరమ్ ఫౌండర్, సీఈఓ విజయ్ అరిశెట్టి తెలిపారు. మిలిటరీ గ్రేడ్ సెక్యూరిటీ సిస్టమ్, ఆటోమేటెడ్‌తో కూడిన ఈ బయో మెట్రిక్ ఆధారిత లాకర్లు రోజంతా అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు. అంతేకాకుండా ప్రతి లాకర్‌కు రూ.కోటి వరకు ఇన్సూరెన్స్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం ఐసీఐసీఐ లొంబార్డ్, టాటా ఏఐజీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు విజయ్ తెలిపారు. ఆరమ్ ఇప్పటికే బెంగళూరు, విశాఖపట్నంలో కార్యకలాపాలు సాగిస్తోందన్నారు. ప్రస్తుతం 21 సైట్స్‌లో మొత్తం 18,000 లాకర్లను నిర్వహిస్తుండగా వచ్చే ఏడాది నాటికి మరో 50 సైట్లలో 10,000 లాకర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. లాకర్ సైజును బట్టి అద్దె రూ.8,000 నుంచి రూ.25,000 వరకు ఉన్నాయని విజయ్ తెలిపారు.

డాలర్ల కొనుగోలు మరింత సులువు

ఫారెక్స్ రిటైల్ ప్లాట్‌ఫామ్‌తో భారత్ కనెక్ట్ అనుసంధానం

ముంబై: ఆన్‌లైన్‌లో అమెరికా డాలర్ల కొనుగోలు మరింత సులువు కానుంది. ఇందుకోసం భారత్ కనెక్ట్ బిల్ పేమెంట్ సిస్టమ్ (బీబీపీఎస్)ను ఫారిన్ ఎక్స్ఛేంజ్ (ఫారెక్స్) రిటైల్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానించినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మంగళవారం తెలిపింది. దీంతో కస్టమర్లు బీబీపీఎస్‌తో కూడిన పేమెంట్/బ్యాంకింగ్ యాప్ ద్వారా మరింత మెరుగైన ధరకు అమెరికా డాలర్లను కొనుగోలు చేసేందుకు వీలవుతుంది. డాలర్లను నోట్ల రూపంలో కొనుగోలు చేయొచ్చు లేదా ఫారెక్స్ కార్డులో జమ చేసుకోవచ్చు. లేదంటే విదేశాలకు పంపవచ్చు. ప్రస్తుతం యాక్సిస్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, యెస్ బ్యాంక్ యాప్‌లు భారత్ కనెక్ట్‌తో అనుసంధానితమై ఉన్నాయి. ఈ బ్యాంక్ కస్టమర్లు రిజిస్టర్ చేసుకోవడంతో పాటు రియల్ టైమ్ ధరలను వీక్షించి, డిజిటల్ మార్గంలో డాలర్ల కొనుగోలును పూర్తి చేయవచ్చని ఆర్‌బీఐ పేర్కొంది. కాగా, ఫారిన్ ఎక్స్ఛేంజ్ ధరల్లో మరింత పారదర్శకత, నిష్పక్షపాతమే లక్ష్యంగా 2019లో ప్రారంభమైన ఫారెక్స్ రిటైల్ ప్లాట్‌ఫామ్‌ను క్లియర్‌కార్ప్ డీలింగ్ సిస్టమ్స్ (ఇండియా) నిర్వహిస్తోంది. క్లియరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సీసీఐఎల్) పూర్తి అనుబంధ విభాగమే క్లియర్‌కార్ప్.

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	540
వరంగల్	522	గోదావరి	535
చిత్తూరు	528	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	124
వరంగల్	110	గుంటూరు	119
కరీంనగర్	110	ఒంగోలు	119
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	105
కర్నూలు	110	నెల్లూరు	110
విశాఖపట్నం	127	అనంతపురం	110
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,22,020 ▲	1,11,850 ▲	1,67,100 ▲
విజయవాడ	1,23,800 ▲	1,18,300 ▲	1,54,400 ▼
విశాఖపట్నం	1,23,750 ▲	1,11,850 ▲	1,67,100 ▲
రాజమండ్రి	1,22,020 ▲	1,11,850 ▲	1,53,800 ▲
ప్రొద్దుటూరు	1,24,500 ▲	1,14,540 ▲	1,56,000 ▲
ముంబై	1,19,941 ▲	1,09,866 ▲	1,49,441 ▲

శాన్‌కోల్‌కు డబ్ల్యూహెచ్‌ఓ గుర్తింపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): శాంతా బయోటెక్నిక్స్ అభివృద్ధి చేసిన నోటి ద్వారా తీసుకునే కలరా వ్యాక్సిన్ శాన్‌కోల్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రీ క్వాలిఫికేషన్ లభించింది. దీంతో కలరా ప్రబలంగా ఉన్న దేశాల్లో వినియోగించేందుకు యునిసెఫ్, గావీ, పాహో వంటి ప్రపంచ ప్రొక్యూర్మెంట్ సంస్థలు శాంతా బయో నుంచి శాన్‌కోల్ కొనుగోలు చేసేందుకు మార్గం సుగమం అయింది. "కలరా వ్యాధి తరచుగా వ్యాపించే దేశాలకు సరసమైన ధరల్లో అందుబాటులో ఉండే ఔషధంగా శాన్‌కోల్‌ను అభివృద్ధి చేశాం. డబ్ల్యూహెచ్‌ఓ అనుమతితో మా ప్రధాన లక్ష్యం నెరవేరింది" అని కంపెనీ వ్యవస్థాపకుడు కేఐ వరప్రసాద్ రెడ్డి అన్నారు.

హైదరాబాద్‌లో అవాంటెల్ మరో యూనిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): శాటిలైట్ కమ్యూనికేషన్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ సంస్థ అవాంటెల్ లిమిటెడ్.. హైదరాబాద్‌లో రూ.56 కోట్లతో రెండో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించింది. రావిర్యాల, ఈ-సిటీలోని ఈ యూనిట్‌లో ఏరోస్పేస్, డిఫెన్స్ టెక్నాలజీలకు సంబంధించిన ఉత్పత్తులను ఇక్కడ అభివృద్ధి చేయనున్నట్లు తెలిపింది. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా 300 మందికి, పరోక్షంగా 1,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అవాంటెల్ వెల్లడించింది.

వచ్చే ఏడాది మార్కెట్లోకి నిస్సాన్ టెక్టాన్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది విడుదల చేయనున్న కొత్త కారు టెక్టాన్‌తో జపాన్ ఆటో దిగ్గజం నిస్సాన్ మార్కెట్లో పోటీ తీవ్రంగా ఉన్న మిడ్ సైజ్ ఎస్‌యూవీ విభాగంలో ప్రవేశిస్తోంది. తద్వారా భారత్‌లో తమ బ్రాండ్‌ను పునరుజ్జీవింపచేయతలచినట్లు నిస్సాన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ వత్స చెప్పారు. హ్యుండయ్ క్రెటా, కియా సెల్టోస్, మారుతి గ్రాండ్ విటారా, స్కోడా కుషాక్‌లకు గట్టి పోటీ ఇచ్చే ఈ కారును వచ్చే ఏడాది మధ్యలో మార్కెట్లో ప్రవేశపెట్టనున్నట్టు చెప్పారు. టెక్టాన్‌ను దేశీయంగానే తయారుచేయనున్నట్టు వెల్లడించారు.



నాలుగో రోజూ మార్కెట్ ముందుకే..

సెన్సెక్స్ 136 పాయింట్లు అప్

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లతో మంగళవారం సెన్సెక్స్ 136.63 పాయింట్లు పెరిగి 81,926.75 వద్ద స్థిరపడింది. ఒక దశలో సూచీ 519.44 పాయింట్లు ఎగబాకి 82,309.56 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఆఖరి గంటలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడటంతో సూచీ మళ్లీ కాస్త జారుకుంది. నిఫ్టీ 30.65 పాయింట్ల వృద్ధితో 25,108.30 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 13 మాత్రమే రాణించాయి. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 3 పైసలు తగ్గి 88.77 వద్ద ముగిసింది.

ఐపీఓకు సాయి పేరెంటరల్స్: తెలంగాణకు చెందిన ఫార్మాస్యూటికల్స్ ఫార్ములేషన్స్ కంపెనీ సాయి పేరెంటరల్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రానుంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా రూ.285 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ఇన్వెస్టర్ల వాటాకు చెందిన 35 లక్షల వరకు ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో కంపెనీ వెల్లడించింది.



మల్లికార్జున ఖర్గేను కలిసిన మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి తదితరులు

ఖర్గేకు రాష్ట్ర మంత్రుల పరామర్శ

» బెంగళూరులో కలిసిన పొంగులేటి, దుద్దిళ్ల, కోమటిరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యానికి గురై బెంగళూరులో విశ్రాంతి తీసుకుంటున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాష్ట్ర మంత్రులు పరామర్శించారు. మంగళవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి బెంగళూరు వెళ్లి ఖర్గేను కలిసి మాట్లాడారు. త్వరగా కోలుకోని, తిరిగి ప్రజా జీవితంలో క్రియాశీలకంగా పాల్గొనాలంటూ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయా మంత్రుల శాఖలకు సంబంధించిన అభివృద్ధి, రాష్ట్ర ప్రగతి గురించిన వివరాలను శాఖల వారీగా ఖర్గేకు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతంగా అమలవుతోందని శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

75-90 జడ్పీటీసీలను మాకు కేటాయించండి

» సీపీఐ ప్రతిపాదన..సర్వే తర్వాత నిర్ణయమన్న పీసీసీ చీఫ్

హైదరాబాద్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): సీపీఐకి పట్టున్న జడ్పీ స్థానాలను తమకు కేటాయించాలని ఆ పార్టీ ప్రతినిధుల బృందం కాంగ్రెస్‌ను కోరింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు విషయమై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మంగళవారం పీసీసీ అధ్యక్షుడిని కలిసి చర్చలు జరిపింది. సుమారు 75 జడ్పీటీసీ స్థానాల్లో సీపీఐకి బలం ఉందని ప్రాథమికంగా నిర్ధయించిన నేతలు.. బుధవారం జరిగే కార్యవర్గ సమావేశంలో చర్చించి తుది జాబితాను అందిస్తామని స్పష్టం చేసినట్లు తెలిసింది. సీపీఐ నుంచి కనీసం 90 జడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉందని పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే, సీపీఐకి బలమున్న స్థానాలకు సంబంధించిన వివరాలతో జాబితా ఇస్తే దానిపై సర్వే చేయించి.. తుది నిర్ణయం తీసుకుందామని పీసీసీ అధ్యక్షుడు అన్నారని తెలిసింది.

రాష్ట్రమంతటా బతుకమ్మ చీరలు!

» కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం: సీతక్క

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని మహిళలకు మంత్రి సీతక్క శుభవార్త చెప్పారు. ప్రస్తుతం మహిళా సంఘాల సభ్యులకే బతుకమ్మ చీరల పంపిణీ జరుగుతున్నప్పటికీ, భవిష్యత్తులో రాష్ట్రంలోని మహిళలందరికీ పంపిణీ చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని ఆమె ప్రకటించారు. ఈ దిశగా అవసరమైన నిర్ణయం తీసుకోవడానికి త్వరలో కేబినెట్‌లో చర్చిస్తామని మంత్రి తెలిపారు. నవంబరు 19న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళా సంఘ సభ్యులకు 'ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ' కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని సీతక్క వెల్లడించారు. ఈ పథకం ద్వారా మహిళా సంఘాల్లోని ప్రతి సభ్యురాలికి ప్రభుత్వం తరపున చీరలను బహుమతిగా అందించనున్నట్లు తెలిపారు. చీరల నాణ్యత విషయంలో రాజీపడకుండా అత్యున్నత ప్రమాణాలను పాటించాలని అధికారులను, తయారీ దారులను ఆదేశించానని, చీరలు అన్ని ఒకే రకంగా, ఒకే విధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నానని మంత్రి వివరించారు.

దయచేసి మీరు ఆప్షన్లు పెట్టకండి

» గ్రూప్-2 ఉద్యోగం సాధించిన వారికి గ్రూప్-3 అభ్యర్థుల వినతి

పంజాగుట్ట, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలో ఉత్తీర్ణులై ఉద్యోగం సాధించిన వారు దయచేసి తమకు పోటీగా రావొద్దని గ్రూప్-3లో 1:3కి ఎంపికైన ర్యాంకర్లు విజ్ఞప్తి చేశారు. గ్రూప్-3 ఉద్యోగాల వెబ్ ఆప్షన్, సర్టిఫికెట్ల పరిశీలనకు దూరంగా ఉండాలని కోరారు. గ్రూప్-2 కొలువు సాధించి ఇప్పటికే గెలిచిన వారు తమనీ కూడా గెలిపించాలని, మానవత్వంతో ఆలోచించి నిరుద్యోగిని ఉద్యోగిగా మార్చాలని వేడుకున్నారు. గ్రూప్-3లో 1:3కి ఎంపికైన పలువురు ర్యాంకర్లు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు పిలుపునిచ్చారు. గ్రూప్-3 పోస్టులకు ఎంపికైన వారిలో గ్రూప్- 2 అభ్యర్థులు 500 మంది ఉన్నారని, అధ్యాపకులు, ఎస్సైలు మరో 600మంది దాకా ఉన్నారన్నారు. వీరంతా సర్టిఫికెట్ల పరిశీలనకు వస్తే తర్వాతి స్థానంలో ఉన్న వారికి ఉద్యోగాలు రావని తెలిపారు. గ్రూప్-3లో 1388 పోస్టులు ఉన్నాయని, చిన్న క్లిక్ ఇవ్వడం వల్ల ర్యాంకర్ ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

రేవంత్ రెడ్డి శకుని లాంటి సీఎం

» అగ్రకులానికి ఓటు వేయనని బీసీలంతా ప్రమాణం చెయ్యాలి

» జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య గౌడ్

పంజాగుట్ట, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): మహాభారతంలో కౌరవులను సర్వ నాశనం చేయాలని కంకణం కట్టుకున్న శకుని లాగా తెలంగాణలో బీసీ జాతిని సర్వనాశనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య గౌడ్ ఆరోపించారు. శకుని లాంటి సీఎం మనకు దొరికాడంటూ ధ్వజమెత్తారు. 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు- న్యాయవివాదాలు పరిష్కారం' అంశంపై బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సదస్సులో ఈశ్వరయ్య గౌడ్ ఈ వ్యాఖ్యలు చేశారు. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలుకు సంబంధించి రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లుల ఆమోదం అంశాన్ని కాంగ్రెస్, బీజేపీలు పట్టించుకోవడం లేదని ఈశ్వరయ్య గౌడ్ ఆరోపించారు. తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్ లో చేర్చితేనే 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్ట బద్ధత ఉంటుందని అన్నారు.

రిజర్వేషన్లు ఖరారయ్యాకే స్థానిక ఎన్నికలు

» ప్రజా ఐక్యకూటమి రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు


రాంనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కోర్టు తీర్పు ఎలా ఉన్నా 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, రిజర్వేషన్లు ఖరారయ్యే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వెయ్యాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ప్రజా ఐక్యకూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ మేరకు అభిప్రాయపడ్డారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఆర్.కృష్ణయ్య, మాజీ స్పీకర్ మధుసూదనచారి, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఈ సమావేశంలో మాట్లాడారు.

ఈవీఎంలపై రంగుల్లో అభ్యర్థుల ఫొటోలు

» సున్నితమైన కేంద్రాల్లో ఏఐ ఆధారిత పర్యవేక్షణ: సీఈవో

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పోటీలో ఉన్న అభ్యర్థులను ఓటర్లు సులభంగా గుర్తించేందుకు వీలుగా ఈవీఎంలపై రంగుల ఫొటోలు ముద్రించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఏర్పాట్లపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఇందులో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఆమ్‌ఆద్మీ, మజ్లిస్ తదితర పార్టీల ప్రతినిధులు, అదనపు సీఈవో లోకేశ్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, డిప్యూటీ సీఈవోలు హరిసింగ్, సత్యవాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఈసీఐ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తీసుకొచ్చిన నూతన సంస్కరణలను జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ అమలు చేయనున్నట్లు వెల్లడించారు. సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో ఏఐ ఆధారిత పర్యవేక్షణ, జీపీఎస్ ట్రాకింగ్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. రియల్‌టైమ్ ఓటింగ్ టర్నౌట్ మానిటరింగ్ కోసం డిజిటల్ డ్యాష్‌బోర్డులు, మొబైల్ యాప్‌లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

స్థానికంపై నేడు స్పష్టత!



బీసీ రిజర్వేషన్లపై విచారించనున్న హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అంశంపై బుధవారం స్పష్టత రానుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేటాయిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 9ను సవాలు చేస్తు హైకోర్టులో దాఖలైన పిటిషన్లపై బుధవారం విచారణ జరగనుంది. జీవో ప్రకారం రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలకు కలిపి రిజర్వేషన్లు 50 శాతానికి మించుతున్నాయని, ఇది సుప్రీంకోర్టు తీర్పునకు, పంచాయతీరా జ్ చట్టానికి విరుద్ధమంటూ పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఆ పిటిషన్లను అక్టోబరు 8న(బుధవారం) విచారిస్తారనని చెప్పి హైకోర్టు సెప్టెంబరు 27న విచారణను వాయిదా వేసింది. సత్వరమే తేల్చాలంటూ సుప్రీంకోర్టులోనూ పిటిషన్లు దాఖలయ్యాయి. హైకోర్టులో విచారణ జరగకముందే సుప్రీంకు వెళ్లడంతో ఆ పిటిషన్లను తిరస్కరిస్తున్నట్టు సుప్రీంకోర్టు సోమవారం చెప్పింది. దాంతో బుధవారం హైకోర్టు ఏం తేలుస్తుందన్న అంశం ఉత్కంఠగా మారింది. రాష్ట్రంలో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీకాలం పూర్తయి ఏడాది దాటింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. కుల సర్వే నిర్వహించడంతో పాటు రిజర్వేషన్ల పెంపునకు సుప్రీంకోర్టు సూచనలకు అనుగుణంగా పలు చర్యలు తీసుకుంది. జనాభా ప్రకారమే రిజర్వేషన్లను పెంచుతున్నట్టు ప్రకటించింది. పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 285(ఏ)లో పలు సవరణలు చేసింది. బిల్లులను కేంద్రానికి పంపినా కేంద్రం సమాధానం చెప్పలేదు. దాంతో రాష్ట్ర ప్రభుత్వమే శాసనసభలో చట్ట సవరణ చేయడంతో పాటు రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక జీవోను జారీ చేసింది. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ల వరకు రిజర్వేషన్లను ఖరారు చేసి ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని, ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు వివరాలను అందించింది. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. 9న గురువారం నోటిఫికేషన్ వెలువడుతోంది. నవంబర్‌లో ఎన్నికల కోడ్ ముగుస్తుంది. జీవో 9పై దాఖలైన పిటిషన్లను తిరస్కరించడం రాష్ట్ర ప్రభుత్వానికి కొంత ఊరట కలిగించేదైనా బుధవారం హైకోర్టు విచారణ ఎలా ఉంటుందన్నది ఉత్కంఠగా మారింది.

జాజుల శ్రీనివాస్ గౌడ్, ఇందిరా శోభన్ ఇంప్లీడ్

బీసీల జనాభా, వెనుకబాటుతనానికి సంబంధించి కచ్చితమైన ఎంపరికల్ డేటాను ఆధారంగానే చేసుకునే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌లను కొట్టేయాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నేత ఇందిరా శోభన్ హైకోర్టును కోరారు. బీసీ రిజర్వేషన్ల కేసులో వారు వేర్వేరుగా ఇంప్లీడ్ పిటిషన్‌లు దాఖలు చేశారు. బీసీ బిల్లులకు అసెంబ్లీ, మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయని, జీవోను వ్యతిరేకించడంలో అర్థం లేదని అన్నారు. ఈ కేసులో తమ వాదనలు కూడా వినాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.

బీసీ రిజర్వేషన్లను సవాల్ చేస్తూ పిల్

జీవో 9ను సవాల్ చేస్తూ మరో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. రామాంతపూర్‌కు చెందిన శ్రీలేఖ ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. రిజర్వేషన్లు 67 శాతానికి చేరుతున్నాయని, ఇది సుప్రీంతీర్పుకు విరుద్ధమని ప్రస్తావించారు.

బలమైన వాదన వినిపిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

అఫిడవిట్ ఇచ్చి.. కేసులో ఇంప్లీడ్ అయినవారు కూడా విచారణ సందర్భంగా అందుబాటులో ఉండాలన్నారు. సమావేశం నుంచే ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వీకి ఫోన్ చేసి.. ప్రభుత్వం తరపున వాదనలు వినిపించాలని కోరారు. ఈ కేసుకు సంబంధించి పూర్వాపరాలు ఆయనకు వివరించారు. కాగా, సింఘ్వీ వర్చువల్‌గా వాదనలు వినిపించనున్నారు.

అవసరమైతే సుప్రీంకోర్టుకు!

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై హైకోర్టు సానుకూలంగా స్పందిస్తుందన్న నమ్మకాన్ని సమావేశంలో పాల్గొన్న నేతలు, మంత్రులు వ్యక్తం చేశారు. స్పందన సానుకూలంగా లేకపోతే ఏం చేయాలన్న చర్చ కూడా జరిగింది. పార్టీ పరంగా బీసీలకు రిజర్వేషన్ ప్రకటించి ముందుకెళ్లాలా? లేక న్యాయపోరాటం కొనసాగించాలా? అన్నదానిపై చర్చించారు. ఒకవేళ హైకోర్టు తీర్పు ప్రతికూలంగా వస్తే.. సుప్రీంకోర్టును ఆశ్రయించాలన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అలాంటి పరిస్థితి తలెత్తితే.. వెంటనే సమావేశమై నిర్ణయం తీసుకోవాలని తీర్మానించారు. దీంతోపాటు రాష్ట్రంలో ధాన్యం కొనుగోలుపై కూడా ఈ సందర్భంగా మంత్రులతో సీఎం చర్చించారు. రైతులు ఇబ్బంది పడకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఎంపికపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ఇక మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ల వివాదంపై ఈ సందర్భంగా సీఎం రేవంత్ ఆరా తీశారు. అయితే తాను చేసిన వ్యాఖ్యలు మంత్రి అడ్లూరిని ఉద్దేశించినవి కావని పొన్నం వివరణ ఇచ్చినట్లు తెలిసింది.



బీసీ రిజర్వేషన్లపై చర్చిస్తున్న రేవంత్, భట్టి, మీనాక్షి, పొంగులేటి, పొన్నం, మహేశ్, ఉత్తమ్, వాకిటి

నేడు హైకోర్టు వద్ద బీసీ నేతల మోహరింపు..

బీసీ రిజర్వేషన్లపై బుధవారం హైకోర్టులో విచారణ జరగనున్న సమయంలో బీసీ నాయకులు, సంఘాల నేతలు, న్యాయవాదులు పెద్ద ఎత్తున కోర్టుకు అందుబాటులో ఉండాలని కాంగ్రెస్ పార్టీ బీసీ నేతల సమావేశంలో నిర్ణయించారు. మంత్రి వాకిటి శ్రీహరి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పార్టీ బీసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోర్టులో తీర్పు అనుకూలంగా వస్తుందన్న విశ్వాసాన్ని నేతలు వ్యక్తం చేశారు. అయితే పిటిషన్‌ను కొట్టివేయకుండా రాజ్యాంగ ధర్మాసనానికి ఇచ్చే అవకాశమూ ఉందన్న అభిప్రాయాన్ని కొందరు నేతలు వ్యక్తం చేశారు. కాగా, బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా కేసులో ఇంప్లీడ్ అయిన వారి వివరాలు ఇవ్వాల్సిందిగా పార్టీ నేతలకు మీనాక్షి నటరాజన్ సూచించారు. వాదనలు జరిగే సమయంలో వారంతా అందుబాటులో ఉండాలన్నారు. ఈ సందర్భంగా.. బీఆర్ఎస్ నుంచి ఒక్క నేత కూడా కేసులో ఇంప్లీడ్ కాలేదని, బీజేపీ నుంచి ఆ పార్టీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాత్రమే ఇంప్లీడ్ అయ్యారనే అంశం ప్రస్తావనకు వచ్చింది. దీంతో బీసీల పట్ల బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఉన్న చిత్తశుద్ధి ఇదీ అని మహేశ్‌గౌడ్ వ్యాఖ్యానించారు.

బీసీ సంక్షేమంపై కాంగ్రెస్ నిర్లక్ష్యం

» వసతి గృహాల్లో కనీస వసతులు లేవు

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మండిపడ్డారు. బీసీలకు న్యాయం చేస్తున్నామంటూ ప్రభుత్వం పదే పదే గొప్పలు చెప్పుకుంటున్నా.. వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్ రావు, పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడారు. మహర్షి వాల్మీకి వారసత్వానికి సంబంధించిన వర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. గద్వాల ప్రాంతంలో బోయ వాల్మీకులకు కనీసం కుల ధ్రువపత్రాలు కూడా ఇవ్వడంలేదని పేర్కొన్నారు. 'సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థలు అస్తవ్యస్తంగా మారాయి. దాదాపు 6 లక్షల మంది విద్యార్థులు గురుకులాల విద్యాలయాల్లో చదువుతున్నారు. కానీ వారికి తినడానికి సరైన భోజనం లేదు. సురక్షితమైన భవనాలు లేవు. ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, గురుకులాలు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో యజమానులు భవనాలకు తాళాలు వేస్తున్నారు' అని రాంచందర్‌రావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సామాజిక వర్గాల విద్యార్థుల కోసం గురుకులాల్లో అన్ని వసతులు కల్పించేందుకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నవీన్ యాదవ్‌పై కేసు

» ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీపై.. రిటర్నింగ్ అధికారి ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్

» సీఈవోను నివేదిక కోరిన ఈసీ

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత వి.నవీన్ యాదవ్‌పై కేసు నమోదైంది. నియోజకవర్గంలోని ఓటర్లకు.. నవీన్ యాదవ్ ఓటరు గుర్తింపు కార్డులను అక్రమంగా పంపిణీ చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రజినీకాంత్‌రెడ్డి సోమవారం రాత్రి ఫిర్యాదు చేయగా.. బీఎన్ఎస్ 170, 171, 174 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు కూడా నవీన్ యాదవ్‌పై ఇటీవల ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా ప్రాథమిక విచారణ జరిపి నివేదిక పంపాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నేతృత్వంలో పోలీసులు ప్రాథమిక విచారణ జరపగా.. నవీన్ యాదవ్ ఓటరు కార్డులను పంపిణీ చేసినట్లు తేలింది. దీని ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. పూర్తిస్థాయి విచారణ జరపాలని నిర్ణయించారు. ఆయన ఏ పద్ధతిలో ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు? అవి ఎక్కడి నుంచి వచ్చాయి? ఒకవేళ ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేస్తే.. సదరు ఓటరు అనుమతితో తీసుకున్నారా? లేదా? వంటి విషయాలపై పోలీసులు పూర్తిస్థాయి దర్యాప్తు జరుపుతున్నారు. దీనిపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్‌కు సీఈవో కార్యాలయం నివేదిక పంపనున్నట్లు సమాచారం. అనంతరం ఆ నివేదికలోని అంశాల ఆధారంగా.. నవీన్ యాదవ్‌పై ఎటువంటి చర్యలు చేపట్టాలన్న దానిపై ఈసీఐ మార్గదర్శకాలు జారీ చేస్తుందని, దాని ఆధారంగానే చర్యలు ఉంటాయని సీఈవో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. నవీన్ యాదవ్ మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కలిసి వివరణ ఇచ్చినట్లు తెలిసింది.

ఓట్లు నమోదు చేయించిన నవీన్ యాదవ్

ఓటరు గుర్తింపు కార్డులు నవీన్ యాదవ్ చేతికి ఎలా వెళ్లాయన్నదానిపై పోలీసులు సమాచారం సేకరించారు. కొంతకాలంగా ఈ కార్డులను ఎంపిక చేసిన ఏజెన్సీ ముద్రిస్తుండగా.. తపాలా శాఖ ద్వారా ఓటర్ల చిరునామాకు పంపుతున్నారు. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో.. ప్రాంతాల వారీగా అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేసేందుకు నవీన్ యాదవ్ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో దరఖాస్తుదారుల పేరు, ఇతరత్రా వివరాలతోపాటు మొబైల్ నంబర్లు కూడా సేకరించారు. దీంతోనే ఫారం-6 ఆమోదం అనంతరం ఆన్‌లైన్‌లో ఈ-ఎపిక్ కార్డులను డౌన్‌లోడ్ చేసినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఓటరు మొబైల్‌కు వచ్చిన ఓటీపీని తీసుకుని ఈ-ఎపిక్ కార్డులను డౌన్‌లోడ్ చేసినట్లు, ప్రింట్ చేయించి ఓటర్లకు పంపిణీ చేసినట్టు చెబుతున్నారు. అయితే ఈ క్రమంలో ఎన్నికల నిబంధనల్ని నవీన్‌యాదవ్ ఉల్లంఘించారా? లేదా? అన్నది పోలీసుల విచారణలో తేలనుంది.

జూబ్లీహిల్స్ రేసులో నవీన్ యాదవ్!

(మొదటిపేజీ తరువాయి)

పంపారు. ఆయా అభ్యర్థుల సానుకూల, ప్రతికూల అంశాలను వివరించారు. మరోవైపు బొంతు రామ్మోహన్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తాను జూబ్లీహిల్స్ అభ్యర్థి రేసులో లేనని స్పష్టం చేశారు. తనకు టికెట్ కావాలని ఎవరినీ అడగలేదన్నారు. టికెట్ ఇచ్చినా, ఇవ్వకపోయినా అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు. టీపీసీసీ ప్రతిపాదించిన మూడు పేర్లను అధిష్ఠానం పరిశీలించి, అభ్యర్థిని ఎంపిక చేయనుంది. సీఎం రేవంత్‌రెడ్డి అభీష్టం మేరకే అభ్యర్థిని నిర్ణయిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. స్థానిక నేతనే అభ్యర్థిగా ఎంపిక చేయాలన్న ప్రతిపాదనకే సీఎం రేవంత్‌రెడ్డి మొగ్గు చూపుతున్నారు. స్థానిక కోటాలో నవీన్‌యాదవ్, సీఎన్ రెడ్డిలు పోటీ పడుతున్నారు. అయితే బీసీకే టికెట్ దక్కే అవకాశం ఉందంటూ పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ స్పష్టత ఇచ్చిననేపథ్యంలో నవీన్ యాదవ్ పేరు ఖాయమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు టీపీసీసీ ప్రతిపాదించిన మూడు పేర్లు కాకుండా అనూహ్యంగా ఇతర సీనియర్ నేతల పేర్లు తెరపైకి వచ్చే అవకాశం కూడా ఉందన్న ప్రచారం జరుగుతోంది. బిహార్ ఎన్నికల్లో అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఏఐసీసీ కేంద్ర ఎన్నికల కమిటీ బుధవారం భేటీ కానుంది. ఆ భేటీలో జూబ్లీహిల్స్ అభ్యర్థి అంశం కూడా చర్చకు వస్తుందా? రాదా? అన్నదానిపై స్పష్టత లేదు. టీపీసీసీ ప్రతిపాదించిన పేర్లనే పరిగణనలోకి తీసుకుంటే బుధవారమే అభ్యర్థిని ప్రకటిస్తారని, సంప్రదింపులు జరపాలని భావిస్తే కొద్ది రోజులు పట్టే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్‌రెడ్డి..?

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్‌రెడ్డి బరిలో ఉంటారని తెలుస్తోంది. గత ఎన్నికలో కూడా ఆయనే పార్టీ తరపున పోటీచేశారు. 'ఈ ఉప ఎన్నిక అనివార్యంగా వచ్చిన నేపథ్యంలో గత ఎన్నికలో పోటీ చేసిన అభ్యర్థికే అవకాశం ఇవ్వడం సాధారణంగా జరిగే ప్రక్రియ' అని బీజేపీ ముఖ్య నేత ఒకరు వ్యాఖ్యానించారు. అందుకు అనుగుణంగా దీపక్‌రెడ్డి అభ్యర్థిత్వం దాదాపు ఖరారైందని చెప్పారు. స్థానిక ఎంపీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆశీస్సులు కూడా దీపక్‌రెడ్డికి ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు నియమించిన త్రిసభ్య కమిటీ మంగళవారం కూడా విస్తృత అభిప్రాయ సేకరణ చేసింది. తమ నివేదికను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి అందజేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, టికెట్ కోసం పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ కీర్తి రెడ్డి, డాక్టర్ పద్మ వీరపనేనిలు కూడా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. పార్టీ ఎన్నికల కమిటీ నేడో రేపో అభ్యర్థిని సిఫారసు చేయనుంది. అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటే తప్ప దీపక్‌రెడ్డినే అభ్యర్థిగా తమ నాయకత్వం ప్రకటించబోతోందని పార్టీ వర్గాలు తెలిపాయి.



తెలంగాణ టీడీపీ నేతలతో సమావేశమైన చంద్రబాబు

పోటీకి టీడీపీ దూరం

» ఎవరికీ మద్దతివ్వకూడదని నిర్ణయం

» సమర్థులకే టీటీడీపీ బాధ్యతలు

» తెలంగాణ రాజకీయాల్లో.. బలమైన శక్తిగా ఎదుగుదాం

» టీటీడీపీ నేతలతో చంద్రబాబు

హైదరాబాద్, అమరావతి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో పోటీ చేయరాదని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. పోటీకి పార్టీ శ్రేణులు సమాయత్తంగా లేరన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఉప ఎన్నికల్లో ఏ పార్టీకీ మద్దతు ఇవ్వరాదని కూడా నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం ఉండవల్లిలోని తన నివాసంలో టీడీపీ జాతీయ అధ్యక్షులు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు టీటీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించి ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. జాతీయ స్థాయి కూటమిలో భాగస్వామ్యంగా ఉన్నందున బీజేపీ కోరితే జూబ్లీహిల్స్‌లో మద్దతు విషయం ఆలోచిద్దామని చంద్రబాబు అన్నారు. సమర్థ నాయకత్వాన్ని అందించేవారికే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తామని టీటీడీపీ నాయకులకు స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత కమిటీల నియామకాలు పూర్తిచేసుకుని కార్యక్రమాలు పెంచాలని పిలుపునిచ్చారు. 'తెలంగాణ రాజకీయాల్లో బలమైన శక్తిగా ఎదుగుదాం.. ఇందుకోసం సంస్థాగతంగా బలోపేతం కావడం ముఖ్యం.. అన్ని స్థాయుల్లో కమిటీలను పూర్తిచేయండి. ఎప్పటికప్పుడు నేను కూడా దిశానిర్దేశం చేస్తా..' అని చంద్రబాబు అన్నారు. ఇప్పటికే కసరత్తు పూర్తయిన నేపథ్యంలో తెలంగాణలో మండల అధ్యక్షుల నియామకాలు పూర్తిచేయాలని సమావేశంలో నేతలు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అధ్యక్షునితో పాటు స్టేట్ కమిటీని నియమించాలన్న అంశంపై ప్రధానంగా చర్చ జరిగింది. తెలంగాణలో 1.78 లక్షల సభ్యత్వం చేసినట్లు చంద్రబాబుకు నాయకులు వివరించారు. రాష్ట్ర పార్టీ సంస్థాగత నిర్మాణం పూర్తి చేసి నాయకత్వాన్ని అందిస్తే.. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పార్టీలో చురుగ్గా పనిచేయడానికి కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉన్నారని నాయకులు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడి నియామకం గురించి నేతలు ప్రధానంగా ప్రస్తావించారు. ఆ నియామకం ఆలస్యం అయ్యేలా ఉంటే... ఈలోపు ముఖ్య నాయకులతో రాష్ట్ర స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

తప్పుకొన్న మజ్లిస్?

» అధికార కాంగ్రెస్ పార్టీకి మద్దతు!

» జీహెచ్ఎంసీ మేయర్ పదవి కోసమే..?

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మజ్లిస్ పార్టీ అభ్యర్థిని బరిలో నిలపకుండా నేరుగా కాంగ్రెస్‌కు మద్దతు పలకనుందా? బదులుగా జీహెచ్ఎంసీ మేయర్ పదవిని డిమాండ్ చేయనుందా? అంటే మజ్లిస్ పార్టీ నేతలు కొందరు ఔననే అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌ను రెండుగా విభజించే యోచనలో ఉన్న సంగతి తెలిసిందే. దీంతో పాతనగర ప్రాంతం పరిధికి వచ్చే కార్పొరేషన్‌కు మేయర్‌గా తమ పార్టీ అభ్యర్థి ఉండేలా మజ్లిస్ ఇప్పటి నుంచే పావులు కదుపుతోందని అంటున్నారు. వాస్తవానికి మజ్లిస్ పార్టీకి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గట్టిపట్టుంది. 2014 శాసనసభ ఎన్నికల్లో ఓట్ల పరంగా రెండో స్థానంలో నిలిచింది. అప్పుడు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నియోజకవర్గంలో ముస్లింలు ఎక్కువగా నివసించే షేక్‌పేట, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో మజ్లిస్ పార్టీకి పట్టుంది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో షేక్‌పేట, రహ్మత్‌నగర్ డివిజన్ల నుంచి మజ్లిస్ అభ్యర్థులు కార్పొరేటర్లుగా విజయం సాధించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అభ్యర్థిని నిలపాలని మజ్లిస్ తొలుత భావించినప్పటికీ తాజాగా పోటీపై పునరాలోచన చేస్తున్నట్లు తెలిసింది. సమీప భవిష్యత్‌లో జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. కాగా, జూబ్లీహిల్స్‌లో అభ్యర్థిని ఖరారు చేసే అంశంలో కాంగ్రెస్ పార్టీ ఒవైసీ సూచనలను పరిగణనలోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.



ఆదివాసీ వంటకాలను భుజిస్తున్న జర్మనీ దేశస్థులు

నక్సల్స్ అడ్డాలో విదేశీయులు

- నంబి జలపాతాన్ని సందర్శించిన జర్మనీ పర్యాటకులు
- ఆపరేషన్ కగార్‌తో మారుతున్న బస్తర్ ముఖ చిత్రం

చర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతం బస్తర్ అడవుల పేరు వినగానే ఒకప్పుడు ప్రజలు భయపడేవారు. కానీ, 'ఆపరేషన్ కగార్'తో ఆ పరిస్థితి మారింది. కేంద్ర బలగాలు అడవుల్లో అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టడంతో బస్తర్ ముఖచిత్రం కొత్తదనం సంతరించుకుంది. ఎతైన గుట్టలు, లోయలు, కనువిందు చేసే జలపాతాలతో నిండిన బస్తర్ అంటేనే అందాలకు నిలయం. గతంలో రోడ్డు సౌకర్యం లేక జిల్లా కేంద్రాలకే పరిమితమైన పర్యాటకులు, ఇప్పుడు మారుమూల ప్రాంతాలకు కూడా తరలివస్తున్నారు. ఈ అభివృద్ధి నేపథ్యంలో, బీజాపూర్ జిల్లాలోని నంబి జలపాతాన్ని సందర్శించడానికి మంగళవారం ఇద్దరు జర్మనీ దేశస్థులు వచ్చారు. వారు నంబి గ్రామస్థులతో మాట్లాడారు. జలపాతం అందాలను తమ కెమెరాల్లో బంధించారు. స్థానికులతో వంట వండించుకుని భోజనం చేశారు. ఆ విదేశీ పర్యాటకులు ఇక్కడి మావోయిస్టులు, వారి జీవనశైలి, పోలీసుల మోహరింపు గురించి, అలాగే ఆదివాసీల జీవన స్థితి గతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

గనులశాఖలో డిప్యూటీ డైరెక్టర్లుగా ఇద్దరికి పదోన్నతి

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లకు డిప్యూటీ డైరెక్టర్లుగా రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ పదోన్నతలు కల్పించింది. ఈ మేరకు ఆర్. విజయ కుమార్ రాథోడ్, ఎస్.స్వామి కృష్ణాజీ రావులకు డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పిస్తూ గనుల శాఖ కార్యదర్శి ఎన్.శ్రీధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు కల్పించడంతోపాటు నిజామాబాద్ డిప్యూటీ డైరెక్టర్‌గా విజయకుమార్ రాథోడ్, గనులశాఖ డైరెక్టరేట్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా కృష్ణాజీరావును నియమించింది.

'ఎయిమ్స్' విద్యార్థులు పీజీలో చేరేందుకు ఓకే

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పీజీ వైద్య విద్యలో కన్వీనర్ కోటాలో బీబీనగర్ ఏయిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన మెడికోల ప్రవేశాలకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. నీట్ పీజీ-2025లో అర్హత సాధించడంతోపాటు ఆసక్తి గల అభ్యర్థులు.. ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో కన్వీనర్ కోటా సీట్ల అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపింది. అభ్యర్థుల ధృవపత్రాలను పరిశీలించాక మెరిట్ విద్యార్థుల జాబితాను వర్సిటీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని పేర్కొంది. మరోవైపు ప్రైవేటు వైద్య కళాశాలల్లో రెండో విడత యాజమాన్య కోటా కింద ఎంబీబీఎస్ సీటు పొందిన విద్యార్థులు వారికి కేటాయించిన కాలేజీల్లో చేరేందుకు ఈనెల 13వ తేదీ వరకు గడువును పెంచినట్లు వర్సిటీ మరో ప్రకటనలో తెలిపింది. రెండోవిడత కౌన్సిలింగ్‌లో యూజీ సీటు పొందిన విద్యార్థులు తమకు కేటాయించిన సీటును వదులుకోవాలంటే ఈనెల 8 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు ఫ్రీ ఎగ్జిట్ అవ్వాలని.. ఆ తర్వాత అనుమతించబోమని హెల్త్ యూనివర్సిటీ తేల్చి చెప్పింది. సీటు వద్దనుకున్న విద్యార్థులకు వారి ధృవపత్రాలతోపాటు చెల్లించిన ఫీజులను తిరిగిచ్చేయాలని వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించింది.

సీజేఐ గవాయ్‌పై దాడి దుర్మార్గం

- హనుమకొండలో ధర్నా, నిరసన ప్రదర్శనలు
- సీజేఐపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం: కేటీఆర్

వడ్డేపల్లి/హైదరాబాద్/న్యూఢిల్లీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి దుర్మార్గమని ప్రజా సంఘాలు మండిపడ్డాయి. దాడికి పాల్పడిన న్యాయవాది రాకేష్ కిశోర్‌ను వెంటనే అరెస్టు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. సీజేఐపై దాడి.. రాజ్యాంగంపై దాడి అని మండిపడ్డాయి. గవాయ్‌పై దాడిని నిరసిస్తూ హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం, వివిధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వేర్వేరుగా ధర్నా, నిరసన ప్రదర్శనలు జరిగాయి. ప్రజా సంఘాల జేఏసీ, భారత్ బచావో, డీబీఎఫ్ సంఘాలతో పాటు సీపీఎం, బీఆర్ఎస్ మైనారిటీ సెల్ నేతలు నిరసనలో పాల్గొన్నారు. సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడం దారుణమైన సంకేతమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సిగ్గుచేటైన ఈ చర్య.. న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా భావించాలని అన్నారు. సీజేఐపై దాడిని దేశమంతా ముక్తకంఠంతో ఖండించాలని సీపీఎం జాతీయ నేత బి.వెంకట్ కోరారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- ప్రియుడు మృతి.. చికిత్స పొందుతున్న యువతి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకరినొకరు ఇష్టపడ్డారు.. కలిసి జీవించాలని ఆశపడ్డారు.. ఇద్దరిదీ ఒకే సామాజిక వర్గం.. పెద్దల నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేవు.. కానీ పెళ్లికి సిద్ధమైన ప్రతిసారీ ఏదో ఒక ఆటంకం రావడం, పెళ్లి వాయిదా పడుతుండటంతో తీవ్ర మనస్తాపం చెందారు. ఇద్దరూ కలిసి గడ్డిమందు తాగి, ఆత్మహత్యాయత్నం చేశారు. ప్రియుడు మృతి చెందగా, ప్రియురాలు చికిత్స పొందుతోంది. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండలో మంగళవారం ఈ ఘటన జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. తాటికొండకు చెందిన మారపాక అంజయ్య, రేణుక దంపతుల కుమారుడు అన్వేశ్(22) ఇంటర్ వరకు చదివి, గ్రామంలో ఉంటూ కూలి పనులకు వెళ్లేవారు. హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలకు చెందిన గడ్డం దాసు, ఎలిషా దంపతుల కుమార్తె పావని (20) ఇంటర్ పూర్తి చేసి.. హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేసేవారు. సమీప బంధువుల ఫంక్షన్‌లో అన్వేశ్, పావనికి పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అన్వేశ్ మూడు నెలల క్రితం పావనిని తాటికొండలోని తమ ఇంటికి తీసుకొచ్చారు. అప్పటి నుంచి కలిసే ఉంటున్నారు. ఈ మధ్యలో వివాహం చేసుకోవడానికి పలుమార్లు ప్రయత్నించినా.. అన్వేశ్ సోదరికి కుమారుడు జన్మించి చనిపోవడం, వరుసగా కొందరు బంధువులు మృతి చెందడంతో వాయిదా పడుతూ వచ్చింది. దీనితో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో పెళ్లి విషయంలో మనస్పర్థలు తలెత్తి.. సోమవారం సాయంత్రం గడ్డిమందు తాగారు. ఇది గమనించిన బంధువులు వారిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అన్వేష్ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందగా.. పావని చికిత్స పొందుతున్నారు.

నా జీతం వివరాలు వెల్లడిస్తున్నా..మీరూ చెప్పండి

- వీసీలకు ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి ఆదేశం

హైదరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): దాపరికం లేని పారదర్శక పాలన సమాచార హక్కు చట్టంతోనే సాధ్యమని తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి అన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి తన జీతభత్యాలు, ప్రజాధనంతో పొందుతున్న అన్ని సౌకర్యాలను స్వచ్ఛందంగా ప్రకటించాల్సి ఉందన్నారు. అందువల్ల తనతోపాటు ఉన్నత విద్యామండలిలో పనిచేసే ఉద్యోగులందరి నెలసరి వేతనాలు, పొందుతున్న ఇతర సౌకర్యాల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటిస్తున్నానని చెప్పారు. అలాగే, అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు కూడా తమ వర్సిటీల్లో పని చేసే వారి జీతాలను ప్రకటించాలని ఆదేశించారు. ఆర్టీఐ ద్విదశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అన్ని వర్సిటీల ఉపకులపతులతో ఛైర్మన్ బాలకిష్టారెడ్డి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని అన్ని విశ్వవిద్యాలయాలు పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఆర్టీఐ ద్విదశాబ్ది ఉత్సవాలను అన్ని వర్సిటీలు ఈనెల 12వరకు ఘనంగా నిర్వహించాలని సూచించారు.

ఆర్టీసీలో కొలువుల జాతర

- 1743 పోస్టులకు నేటి నుంచి దరఖాస్తులు
- ఎస్సీ అభ్యర్థులకు కొత్త ఫార్మాట్ సర్టిఫికెట్ తప్పనిసరి

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో కొలువుల జాతర మొదలైంది. రెగ్యులర్ పోస్టుల భర్తీలో భాగంగా డ్రైవర్, శ్రామిక్ పోస్టులకు సంబంధించి బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. మొత్తం 1743 పోస్టులను (1,000 డ్రైవర్, 743 శ్రామిక్) భర్తీ చేసేందుకు రాష్ట్ర పోలీస్ నియామక బోర్డు ఈ ప్రక్రియను చేపట్టింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 28 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఇచ్చింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే ఎస్సీ (షెడ్యూల్డ్ కులాల) అభ్యర్థులకు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ వీవీ శ్రీనివాసరావు కీలక సూచన చేశారు. ఎస్సీ అభ్యర్థులు తప్పనిసరిగా కొత్త ఫార్మాట్‌లో ఉన్న ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుకు జత చేయాలని తెలిపారు. దీనిని మీ సేవ కేంద్రాలు లేదా సంబంధిత తహసీల్దార్ల నుంచి పొందవచ్చు. దరఖాస్తు సమయంలో కొత్త సర్టిఫికెట్ అందుబాటులో లేకపోతే, అభ్యర్థులు పాత సర్టిఫికెట్‌ను జత చేయవచ్చు. కానీ, సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో మాత్రం తప్పనిసరిగా కొత్త ఫార్మాట్‌లో ఉన్న ఎస్సీ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. అలా చేయని పక్షంలో వారి దరఖాస్తులను తిరస్కరిస్తామని శ్రీనివాసరావు పేర్కొన్నారు. మరోవైపు కొత్తగా వాడుకలోకి వస్తున్న విద్యుత్ బస్సుల్లో (ఈవీ బస్సులు) కూడా డ్రైవర్ల నియామకాలు జరుగుతున్నాయి. ఈ బస్సులను నడిపేందుకు ప్రైవేటు ఏజెన్సీలు చర్యలు చేపట్టాయి. హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ డిపోల వారీగా అర్హులైన వారిని డ్రైవర్ పోస్టులకు ఎంపిక చేస్తున్నారు.

'గ్రూప్-1'పై జోక్యం చేసుకోలేం

- అభ్యంతరాలుంటే హైకోర్టునే ఆశ్రయించండి
- నియామకాలపై స్టే ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ, హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్షలపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)తోపాటు రాష్ట్రప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. గ్రూప్-1 నియామకాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన అప్పీళ్లపై హైకోర్టులో ఈ నెల 15వ తేదీనే విచారణ ఉన్నదని.. ఈ స్థితిలో జోక్యం చేసుకోలేమని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది ఉత్తర్వులకు అనుగుణంగానే నియామకాలు ఉండాలని స్పష్టం చేసింది. గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో టీజీపీఎస్సీ పారదర్శకంగా వ్యవహరించలేదని, సమగ్రతను పాటించలేదని, మూల్యాంకనంలో తప్పులు జరిగాయని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా... హైకోర్టు సింగిల్ జడ్జి వారికి అనుకూలంగా తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. టీజీపీఎస్సీ ఆ తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ ఎదుట సవాల్ చేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే విధిస్తూ.. సెప్టెంబరు 24న మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చి, తదుపరి విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసింది. తుది తీర్పునకు లోబడే నియామకాలు ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో అదేరోజు రాత్రి టీజీపీఎస్సీ తుది ఫలితాలు విడుదల చేసింది. మరుసటి రోజే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 562 మంది గ్రూప్-1 అధికారులకు నియామక పత్రాలు అందించారు. అయితే.. డివిజన్ బెంచ్ ఉత్తర్వులను చింతలపాటి ఉపేందర్ సహా మరికొందరు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్లపై మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కె.పరమేశ్వర్, పీఎస్ పట్వాలియా, తెలంగాణ ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి, సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి, ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్ దేవిన సెహగల్, న్యాయవాది శ్రీకాంత్ వర్మ హాజరయ్యారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. ఈ పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది ఉత్తర్వులకు అనుగుణంగా నియామకాలు ఉండాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేస్తూ పిటిషన్లను కొట్టివేసింది. ఈ అప్పీళ్లకు ప్రాధాన్యమిచ్చి, వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాలని హైకోర్టుకు సూచించింది. హైకోర్టులో వీటిపై త్వరగా విచారణ పూర్తయ్యేందుకు ఇరుపక్షాలూ పూర్తి సహకారం అందించాలని ఆదేశించింది. కాగా.. సుప్రీం తీర్పుపై టీజీపీఎస్సీ హర్షం వ్యక్తం చేసింది. గ్రూప్-1తోపాటు అన్ని పరీక్షలూ అత్యంత పారదర్శకంగా నిర్వహించామని అధికారులు తెలిపారు. ఇప్పటికే ఉత్తర్వులు అందుకుని శిక్షణలో ఉన్న గ్రూప్-1 అధికారులు సైతం ఈ తీర్పు పట్ల హర్షం వెలిబుచ్చారు.

మాటల మంటలు

(మొదటిపేజీ తరువాయి)





స్పందించారు. తాను చేసిన ఆ వ్యాఖ్యలు తన సిబ్బందిని ఉద్దేశించినవని, మంత్రినుద్దేశించి చేసినవి కాదని అన్నారు.

పొన్నం, వివేక్‌లపై ఆగ్రహం

పొన్నం వివరణతో సమసిపోయిందనుకున్న వివాదం అనూహ్యంగా మంగళవారం మళ్లీ రాజుకుంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అడ్లూరి లక్ష్మణ్ వీడియో విడుదల చేశారు. పొన్నం ప్రభాకర్ తన తప్పు తెలుసుకుంటారని భావించానని, ఆయన మారకపోతే జరిగే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. పొన్నం ప్రభాకర్ మాదిరిగా తనకు అహంకారంగా మాట్లాడటం రాదన్నారు. మాదిగ సామాజికవర్గంలో పుట్టడమే తన తప్పా? అని ప్రశ్నించారు. తాను కాంగ్రెస్ జెండాను నమ్ముకున్నవాడినని, మాదిగను కాబట్టే మంత్రి పదవి వచ్చిందని తెలిపారు. త్వరలోనే సోనియా, రాహుల్, మల్లికార్జున ఖర్గేను కలిసి తనకు జరిగిన అవమానాన్ని వివరిస్తానన్నారు. పొన్నం ప్రభాకర్ అలాంటి వ్యాఖ్యలు చేస్తుంటే.. అక్కడే ఉన్న వివేక్ సహచర మంత్రిగా కనీసం ఖండించలేదని తప్పుబట్టారు. తాను పక్కన ఉంటే వివేక్ ఓర్వడంలేదన్నారు. ప్రెస్‌మీట్‌లో తాను పక్కన కూర్చుంటే వివేక్ లేచి వెళ్లిపోవడం ఏంటని ప్రశ్నించారు. మరోవైపు మంత్రి శ్రీధర్‌బాబు సైతం పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఇలాంటి వ్యాఖ్యలు పార్టీకి, ప్రభుత్వానికి మంచిది కాదన్నారు.

రంగంలోకి పీసీసీ చీఫ్..

వివాదం తీవ్రరూపం దాలుస్తుండడంతో అప్రమత్తమైన టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్.. ఇద్దరు మంత్రులకు ఫోన్ చేసి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఇద్దరూ సమన్వయంతో కలిసిమెలిసి పని చేసుకోవాలని సూచించారు. మరోవైపు ఇదే అంశంపై కాంగ్రెస్‌కు చెందిన ఎస్సీ సామాజికవర్గ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామేలు, లక్ష్మీకాంత్, కాలె యాదయ్య మంగళవారం పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిశారు. అయితే ఈ అంశంపై తాను ఇప్పటికే పొన్నం, అడ్లూరితో చర్చించానని, సమస్య సద్దు మణిగిందని వారితో మహేశ్ గౌడ్ చెప్పారు. ఇదిలా ఉండగా.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తనపై చేసిన వ్యాఖ్యలపై స్పందించబోనని పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రెస్‌మీట్ సందర్భంగా ఏం జరిగిందన్నది పీసీసీ అధ్యక్షుడికి వివరించానని, పార్టీపరంగా ఆయన ఆదేశాలు శిరసావహిస్తానని తెలిపారు. తాను చేసిన వ్యాఖ్యలు అడ్లూరి లక్ష్మణ్‌ను ఉద్దేశించినవి కావని మరోమారు స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలను బీఆర్ఎస్ సోషల్ మీడియా వక్రీకరించి ప్రచారం చేసిందని, ఆ ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని అన్నారు.

మాదిగ సామాజికవర్గం నిరసనలు..

మాదిగ సామాజికవర్గానికి చెందిన పలువురు అడ్లూరికి మద్దతుగా పలు చోట్ల మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి వైఖరిని నిరసించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో, చిగురుమామిడి మండల కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాగా, అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అహంపూరిత వ్యాఖ్యల వల్ల దళితులు, బలహీనవర్గాల మధ్య దూరం పెరుగుతుందని, పొన్నం ప్రభాకర్ ఈ విషయాన్ని అర్థం చేసుకొని తప్పును సరిదిద్దుకోవాలని సూచించారు. కాకా వెంకటస్వామి జయంతి వేడుకలకు అన్ని వర్గాల వారిని ఆహ్వానించిన మంత్రి వివేక్.. అడ్లూరి లక్ష్మణ్‌ను ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. కాగా, మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను మాదిగ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆరెపల్లి రాజేందర్, గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ కాశీం తీవ్రంగా ఖండించారు. పొన్నం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ తెలిపారు.



శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం

శ్రీశైలం విద్యుత్ కేంద్రం నాలుగో యూనిట్‌లో మళ్లీ సాంకేతిక సమస్య

- ప్రారంభించిన 10 గంటల్లోపే మొరాయించిన స్టేటార్
- నిలిచిన విద్యుత్ ఉత్పత్తి.. సెన్సార్లూ పనిచేయలేదు
- మూడు రోజుల్లో నివేదిక ఇవ్వనున్న వాయిత్ కంపెనీ

బ్రహ్మగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నాలుగో యూనిట్‌లో మరోసారి సాంకేతిక సమస్యతో ఉత్పత్తి నిలిచిపోయింది. పునరుద్ధరించేందుకు కొంత సమయం పడుతుందని జెన్‌కో ఇంజనీర్లు చర్చించుకుంటున్నారు. 2020 ఆగస్టు 20న షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించి నాలుగో యూనిట్ కాలిపోగా.. తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఢిల్లీకి చెందిన వాయిత్ ఇంజనీరింగ్ కంపెనీ ఈ యూనిట్ మరమ్మతు పనులు చేపట్టింది. 2021 సెప్టెంబరులో పనులు ప్రారంభించి 2023 జూలై నాటికి పూర్తి చేసి జెన్‌కోకు అప్పగించింది. ఆ నెల 17న నాలుగో యూనిట్‌ను ప్రారంభించి గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. 2023 ఆగస్టు 17న స్టేటార్ వైండింగ్ బార్స్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మరోసారి మంటలు చెలరేగి యూనిట్ కాలిపోయింది. గత సంవత్సరం మళ్లీ మరమ్మతు పనులు ప్రారంభించి.. చైనా నుంచి స్టేటార్ బార్స్‌ను రప్పించి బిగించారు. ఏడాది పాటు మరమ్మతు పనులు కొనసాగగా.. ఈ నెల 2న విజయదశమి రోజున రాత్రి పూజలు నిర్వహించి ప్రారంభించారు. పది గంటలు తిరగకుండానే సాంకేతిక సమస్యలతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. స్టేటార్ మొరాయించడంతో సమస్య మొదటికొచ్చిందని ఇంజనీర్లు అంటున్నారు. సాంకేతిక సమస్యలు, ప్రమాదాలను ముందుగా గుర్తించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సెన్సార్లు కూడా పనిచేయడం లేదని తెలుస్తోంది. ఎక్కడ లోపం జరిగింది.. తదుపరి కార్యాచరణ ఏంటనే విషయంపై వాయిత్ కంపెనీ జెన్‌కో యాజమాన్యానికి మూడు రోజుల్లో నివేదిక ఇవ్వనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మొదటి నుంచి అనుమానమే!

వాయిత్ కంపెనీ మొదటిసారి మరమ్మతు పనులు చేపట్టిన కొద్ది రోజులకే స్టేటార్ వైండింగ్ బార్స్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయాయి. అందుకు నాసిరకం మెటీరియల్ వాడటమే కారణమని ఇంజనీర్లు అనుమానం వ్యక్తం చేశారు. మరోసారి చైనా నుంచి ఎలక్ట్రికల్ మెటీరియల్ తెప్పించడం, పనుల్లో నాణ్యత లోపిస్తే మళ్లీ సమస్య తప్పదని యూనిట్ ఇంజనీర్లు గతంలోనే ఆందోళన వ్యక్తం చేశారు.

అధిక వడ్డీ ఎర.. కోట్లలో అప్పులు!

- ఏజెంట్ల వ్యవస్థ.. కమిషన్లు.. నజరానాలు
- 2 కోట్లు సేకరిస్తే కారు.. కోటి తెస్తే బైక్
- కొన్నాళ్ల పాటు ఠంచనుగా 10% వడ్డీ
- వెయ్యి కోట్లు సేకరించినట్లు అంచనా!
- నల్లగొండ జిల్లాకు చెందిన బాలాజీ దందా.. ఉన్నట్టుండి మాయం
- బాధితుల ఆగ్రహం.. బాలాజీ ఇంటిపై దాడి



నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పలుగుతండాలో బాలాజీ నాయక్ ఇంటి బయట ఫర్నిచర్‌ను తగులబెడుతున్న బాధితులు

నల్లగొండ క్రైం/పీఏపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రెండు కోట్ల రూపాయలు 'పెట్టుబడి' తెస్తే ఏజెంట్లకు స్విఫ్ట్ కారు బహుమానం. రూ.కోటి తెస్తే లక్షల విలువైన బైక్ నజరానా. ఏజెంట్లకు 6 శాతం కమీషన్.. డబ్బు ఇచ్చిన వారికి 10 శాతం వడ్డీ! ఇలా ఓ ఘరానా మోసగాడు అధిక వడ్డీలు, ఏజెంట్లకు కమిషన్ల ఆశ చూపి కోట్లాది రూపాయలు అప్పులు తీసుకుని పరారయ్యాడు. దాంతో మధ్యవర్తిగా ఉండి కోటి రూపాయలు అప్పులు ఇప్పించిన వ్యక్తి ఆందోళనతో ఆత్మహత్యాయత్నం చేశాడు. మంగళవారం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం వద్దిపట్ల పంచాయతీ పరిధిలోని పలుగుతండాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పలుగుతండాకు చెందిన రమావత్ సరియా నాయక్ మధ్యవర్తిగా ఉండి తన బంధువు రమావత్ బాలాజీ నాయక్‌కు రూ.కోటి వరకు అప్పులు ఇప్పించాడు. దీనికి బాలాజీ నాయక్ నెల నెలా 10 శాతం వడ్డీ, సరియా నాయక్‌కు 6 శాతం కమీషన్ ఇస్తున్నాడు. అయితే మూడు నెలలుగా వడ్డీ ఇవ్వకపోగా, 15 రోజులుగా బాలాజీ ఫోన్‌లో కూడా దొరకడం లేదు. దీంతో ఒత్తిడికి లోనైన సరియా నాయక్ ఆదివారం రాత్రి మిర్యాలగూడలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతన్ని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా.. వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో సరియా నాయక్ బంధువులు, బాధితులు300మంది బాలాజీ నాయక్ ఇంటిపై దాడి చేశారు. ఫర్నిచర్ ధ్వంసం చేసి బయటకు తెచ్చి నిప్పుపెట్టారు. ఈ ఘటనలపై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని పెద్దఅడిశర్లపల్లి పోలీసులు చెబుతున్నారు. వాస్తవానికి బాలాజీనాయక్ అధిక వడ్డీల ఎర వేసి సుమారు వెయ్యి కోట్ల వరకు సేకరించినట్లు నాలుగు నెలల క్రితమే వెలుగులోకి వచ్చింది. దేవరకొండ ఏరియా పబ్లిక్ ఫ్రాడ్ అవేర్‌నెస్ గ్రూప్ అనే స్వచ్ఛంద సంస్థ సభ్యులు నల్లగొండ జిల్లా కలెక్టర్‌కు జూన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.1,000 కోట్ల వరకు అక్రమంగా సమీకరించాడని పేర్కొన్నారు. కానీ, విచారణ ముందుకు సాగలేదు. ఈ లోపు కొందరు పంచాయితీ నిర్వహించి మూడు నెలల్లో ఎవరి డబ్బులు వారికివ్వాలని సూచించారని, దీంతో బాధితులెవరూ అధికారికంగా ఫిర్యాదులు చేయలేదని తెలుస్తోంది.


ఏజెంట్ల వ్యవస్థ...

పెద్దసంఖ్యలో ఏజెంట్లను నియమించుకున్న బాలాజీ నాయక్ పీఏ పల్లితో పాటు, చందంపేట, కొండమల్లేపల్లి, మిర్యాలగూడ, దేవరకొండ, తిరుమలగిరి (సాగర్) ప్రాంతాల్లో గిరిజనులు, ఉద్యోగులు, అధికారుల నుంచి అప్పులు తీసుకున్నాడు. వారికి నెలకు 10 శాతం వడ్డీ, ఏజెంట్లకు 6 శాతం కమీషన్ ఠంచనుగా ఇచ్చేవాడని, అలా నమ్మకం కలిగించి రూ.1,000కోట్లు సేకరించాడని చెబుతున్నారు. ఏజెంట్లకు నజరానాలు భారీగా ఇచ్చేవాడని, రూ.2 కోట్ల వరకు పెట్టుబడి తెస్తే స్విఫ్ట్ కారు, రూ.కోటి తెస్తే లక్ష విలువైన బైక్ ఇచ్చేవాడని చెబుతున్నారు. స్వగ్రామంలో రూ.3 కోట్లతో ఇల్లు కట్టుకున్న బాలాజీ నాయక్.. ఇటీవల తన పుట్టిన రోజు పార్టీకి రూ.50 లక్షలు ఖర్చు చేశాడని తెలుస్తోంది.

మోహన్‌బాబు వర్సిటీని మూసేయండి!

ఆ బాధ్యతలు ఎస్వీయూకు అప్పగించండి.. ఏపీ ఉన్నత విద్యా కమిషన్ ఉత్తర్వులు

- అదనంగా వసూలు చేసిన ఫీజులను 15 రోజుల్లోగా తిరిగివ్వాలని ఆదేశం
- గుర్తింపు రద్దుపై హైకోర్టుకు వర్సిటీ



అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ) మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థుల నుంచి అదనపు ఫీజులు వసూలు చేయడంతో ఈ దుస్థితి ఏర్పడింది. వాస్తవానికి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు కాకుండా యూనివర్సిటీ విద్యార్థుల నుంచి ఏకంగా రూ.26కోట్లు అదనంగా వసూలు చేసింది. దీంతో సదరు విశ్వవిద్యాలయం గుర్తింపును రద్దు చేయాలని ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సిఫారసు చేసింది. ఈ మేరకు మంగళవారం సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. గుర్తింపు రద్దు కోసం యూజీసీ, ఏఐసీటీఈ, ఇతర సంస్థలను కోరాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అలాగే యూనివర్సిటీ గుర్తింపును తక్షణం ఉపసంహరించుకోవాలని కీలక ప్రతిపాదన చేసింది.

గతేడాది ఫిర్యాదు

మోహన్‌బాబు యూనివర్సిటీలో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారంటూ ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ 2024 అక్టోబరులో ఉన్నత విద్యా కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. కమిషన్‌తో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు కూడా ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయం.. యూనివర్సిటీ వ్యవహారంపై విచారణ చేయాలని ఉన్నత విద్యాశాఖను కోరింది. అసోసియేషన్‌తో పాటు వేర్వేరు రూపాల్లో వర్సిటీపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఉన్నత విద్యా కమిషన్‌లోని ముగ్గురు సభ్యులు విచారణ చేపట్టారు. ఈ త్రిసభ్య కమిటీ గత ఏడాది డిసెంబరు నుంచి పలు దఫాలుగా యూనివర్సిటీలో వివరాలు సేకరించింది. అనంతరం కమిషన్‌కు సవివర నివేదిక సమర్పించింది. కాగా, విద్యార్థుల నుంచి అదనపు ఫీజులను వసూలు చేసిన ఎంబీయూ.. దీనిని సమర్థించేందుకు వితండవాదం చేసింది. విద్యార్థులు స్వచ్ఛందంగా అధిక ఫీజులు చెల్లించారని పేర్కొంది. అయితే.. దీనికి సంబంధించిన ఆధారాలను మాత్రం వెల్లడించలేదు. ఇక, యూనివర్సిటీ వసూళ్ల పర్వం ఆధారంగా ఈ ఏడాది జనవరిలోనే ఉన్నత విద్యా కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఉల్లంఘనలకు పాల్పడినందుకు రూ.15 లక్షలు జరిమానా ఎందుకు విధించకూడదో చెప్పాలని ఆదేశించింది. అదనంగా వసూలు చేసిన రూ.26.17కోట్లను విద్యార్థులకు తిరిగి చెల్లించాలని ఆదేశించినా యూనివర్సిటీ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ అదనంగా వసూలు చేసిన ఫీజులు వెనక్కి ఇవ్వడంతో పాటు రూ.15లక్షలు జరిమానా చెల్లించాలని ఉన్నత విద్య కమిషన్ కొద్ది రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేసింది. 15 రోజుల్లోనే విద్యార్థులకు రూ.26.17 కోట్లు తిరిగి ఇవ్వాలని స్పష్టం చేసింది. మోహన్‌బాబు యూనివర్సిటీకి గుర్తింపు లేనట్లుగా భావించాలని, అలాగే ఏపీ ప్రభుత్వం కూడా యూనివర్సిటీ గుర్తింపును ఉపసంహరించుకోవాలని సిఫారసు చేసింది. ప్రస్తుతం వర్సిటీలో చదువుతున్న విద్యార్థుల కోసం సమీపంలోని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీకి తాత్కాలిక బాధ్యతలు అప్పగించాలని సూచించింది.

పరువు పోతోంది: ఎంబీయూ

కమిషన్ ఉత్తర్వులపై ఎంబీయూ హైకోర్టును ఆశ్రయించింది. కాగా, ఈలోపే కమిషన్ విధించిన రూ.15 లక్షల జరిమానా చెల్లించింది. అయితే, కమిషన్ ఆర్డర్ కాపీ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంపై యూనివర్సిటీ ఆందోళన వ్యక్తం చేసింది. తమ పరువుకు నష్టం వాటిల్లుతోందని దానిని తొలగించాలని కమిషన్‌ను కోరింది. అయితే, ఈ అభ్యర్థనకు కమిషన్ అంగీకరించకపోవడంతో ఈ వ్యవహారంపై ఎంబీయూ కోర్టును ఆశ్రయించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.